ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 10.05.2025 | సంపుటి : 11 సంచిక : 291 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# డ్రోన్లతో పాక్ దుశ్చర్యలు

## తిప్పికొడుతున్న భారత్.. సరిహద్దుల్లో యుద్ధవాతావరణం

చండీగఢ్‌లో మళ్లీ మోగిన సైరన్లు..

- ఆర్మీ చీఫ్‌కు పూర్తి అధికారాలు.. రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ
- ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హెచ్చరికలు
- జమ్మూలో పేలుడు శబ్దాలు..జైసల్మేర్‌లో డ్రోన్ శకలాలు గుర్తింపు 2లో



## 36 ప్రాంతాలు.. 400 దాడులు

పౌరుల నివాసాలు, ఆర్మీహెడ్‌క్వార్టర్స్, విమానాశ్రయాలే లక్ష్యంగా పాక్ దాడులకు తెగబడుతోంది

- దాయాది తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోంది
- శత్రుదేశం అబద్దాల ప్రచారంతో ప్రపంచాన్ని నమ్మించే యత్నం చేస్తోంది
- గురుద్వారాలపైనా దాడులకు యత్నం
- సరిహద్దుల వెంట నిరంతరం కాల్పులు జరుపుతూ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది
- అన్నింటినీ సమర్థంగా తిప్పికొట్టాం
- పాక్‌కు కోలుకోలేని నష్టాం కలిగించాం
- మీడియాతో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నర్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌లోనిసరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే.జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సింధూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక

మిగతా 2లో..

### త్రివిధ దళాధిపతులతో
## ప్రధాని మోదీ భేటీ

హాజరైన సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్

ఉద్రిక్తతలతో కేంద్రంలో వరుస సమావేశాలు.. • పాక్ చొరబాట్ల వేళ అమిత్ షా అత్యున్నత స్థాయి సమావేశం
త్రివిధ దళాధిపతులు సహా సీడీఎస్‌తో రాజ్‌నాథ్ భేటీ • గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్ • అప్రమత్తంగా ఉండండి
అన్ని రాష్ట్రాల సిఎస్‌లకు హెూంశాఖ లేఖ • యూకే విదేశాంగ మంత్రితో జైశంకర్ చర్చలు
సైన్యం ఆపరేషన్ల కవరేజీలో జాగ్రత్తలు పాటించాలని మీడియా సంస్థలకు రక్షణశాఖ సూచన 2లో



### మా రక్షణ వ్యవస్థను భారత్
## ధ్వంసం చేసింది

- భారత్ డ్రోన్ దాడులను అడ్డుకట్ట వేయలేకపోయాం
- పాక్ పార్లమెంటులో ప్రకటించిన ఆ దేశ రక్షణమంత్రి
- మా ప్రధానే పిరికివాడు..
- పాక్‌పై భారత్ దాడుల తరువాత ఇప్పటివరకు ఆయన కనీసం ఒక్క ప్రకటన కూడా చేయలేదు
- ఇక ఆ దేశంతో ఎలా పోరాడగలం..?
- ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై ఆ దేశ ఎంపీ తీవ్ర విమర్శలు

### సరిహద్దుల వెంట
## భారీగా చొరబాట్లు

- సమర్థవంతంగా అడ్డుకున్న బీఎస్ఎఫ్..
- కాల్పులో ఏడుగురు మిలిటెంట్లు మృతి
- పాక్‌మిలిటరీ పోస్ట్ ధ్వంసం చేసిన ఆర్మీ

## సంయమనం పాటించాలి

- భారత్-పాక్ ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్నాయి
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మేం వ్యతిరేకమే:చైనా
- భారత్-పాక్ యుద్ధంలో జోక్యం చేసుకోబోం
- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- 'సింధు' ఒప్పందంపై మేం జోక్యం చేసుకోం
- మా పాత్ర కేవలం ఒక సహాయకుడిగా మాత్రమే
- మోదీని కలిసిన వరల్డ్ బ్యాంక్ చీఫ్

## ఏపీ జవాను వీరమరణం

- సరిహద్దులో చొరబాటు దారుల కాల్పుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మృతి
- దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోవడం విషాదకరం : సీఎం చంద్రబాబు

పై వార్తల వివరాలు 2లో..

## డిఫెన్స్ ఫండ్‌కు విరాళం

- ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల నెల జీతం అందిస్తాం
- అన్ని పార్టీలు ముందుకు రావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన



**హైదరాబాద్(జనంసాక్షి):** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడి నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. విరాళం ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది.మన భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేతే లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ టార్గెట్ విజయవంతం అయ్యేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని మన రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో పూజలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి అంతా అండగా నిలవాల్సిన సందర్భమన్నారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయమని అన్నారు.మన ఆర్మీ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున పోరాడుతున్న సమయంలో వారి క్షేమం కోరి

మిగతా 2లో..

### తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
వార్త 2లో

## సమరానికి సై

యుద్ధంలో నా సేవలు అవసరమని భావిస్తే పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నా
భారత వైమానిక దళంలో మిగ్-23 యుద్ధ విమానాలు నడిపిన అనుభవం ఉంది
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్(జనంసాక్షి):** భారత్-పాకిస్థాన్ ల మధ్య ఏర్పడిన యుద్ధ వాతావరణంలో తన అవసరమని భావిస్తే యుద్ధంలో పాల్గొనడానికి తాను సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.భారత వైమానిక దళంలో పని చేసిన తాను మిగ్-23 వంటి యుద్ధ విమానాలు నడిపిన

మిగతా 2లో..





### నేడు హైదరాబాద్ వేదికగా
## ప్రపంచ అందాల పోటీలు

- నేడు గచ్చీబౌలి స్టేడియంలో ప్రారంభం
- ఇప్పటికే నగరానికి చేరుకున్నసుందరీమణులు
- తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలకు పెద్దపీట
- భారత్-పాక్ ఉద్రిక్తతల మధ్య అందాల పోటీలు
- భారీగా భద్రతా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,మే9(జనంసాక్షి):** మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన అందాల భామలు నగరానికి చేరుకున్నారు. 'మిస్ వరల్డ్-2024' విజేతగా నిలిచిన చెక్ రిపబ్లిక్ సుందరి క్రిస్టినా పిస్కోవా శుక్రవారం వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రిస్టినాకు తెలంగాణ అధికారులు ఘనస్వాగతం పలికారు. కళాకారులు

మిగతా 2లో..

### మహిళా ఆర్మీ అధికారుల స్థైర్యాన్ని
## దెబ్బతీయొద్దు

వారు తెలివైన అధికారులు
మీరు వారి సేవలను వేరే చోట ఉపయోగించుకోవచ్చు.
దేశానికి సేవచేయడానికి వారికంటూ మంచి స్థానం ఉంది
ఇది కోర్టు చుట్టూ తిరగాల్సిన సమయం కాదు: సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఎంపికైన మహిళా ఆర్మీ అధికారులకు శాశ్వత కమిషన్ నిరాకరించడంపై దాఖలైన పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది.ఈ పరిస్థితుల్లో వారి స్థైర్యాన్ని దెబ్బతీయొద్దంటూ భారత్-పాక్ ఉద్రిక్త పరిస్థితులను పరోక్షంగా ప్రస్తావించింది. వారిని ప్రస్తుతానికి సర్వీసు నుంచి విడుదల చేయొద్దని కేంద్రాన్ని ఆదేశించింది. "వారు తెలివైన అధికారులు.

మిగతా 9లో..





## రాష్ట్రవ్యాప్తంగా మాక్‌డ్రిల్ చేపట్టాలి

పోలీస్ అధికారులు సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలి • జిల్లా కేంద్రాల్లోనూ ర్యాలీలు నిర్వహించాలి
యుద్ధపరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలి • హై లెవెల్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్(జనంసాక్షి):** యుద్ధ వాతావరణం సందర్భంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్ అధికారులు సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు .గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన హై లెవెల్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తోపాటు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సీఎంఓ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్,డిజిపి జితేందర్, డిజీ ఇంటెలిజెన్స్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సిపి సివి ఆనంద్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాచకొండ సిపి సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.ప్రజల్లో జాతీయవాదాన్ని పెంపొందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అన్ని వర్గాల ప్రజలతో సంఘీభావ ర్యాలీని నిర్వహించాలని అందుకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సిఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో నిన్న నిర్వహించిన సంఘీభావ ర్యాలీ సమాజానికి

మిగతా 2లో..

### ధాన్యం సేకరణలో
## ప్రభుత్వం విఫలం

- జిల్లాకు ముగ్గురు మంత్రుల ఉన్నా శూన్యం
- ఎక్కడి సమస్యలు అక్కడే అన్నచందంగా పాలన
- స్థానిక ఎన్నికల్లో సత్తాచాటి బుద్ధి చెబుతాం: కేటీఆర్



**ఖమ్మం(జనంసాక్షి):** ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. రుణమాఫీ కూడా చేయలేకపోయారు. ఒక్క జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు, మన ప్రభుత్వం పోయాక ముగ్గురుకి పదవులు వచ్చాయి.. అంయినా సమస్యలు మాత్రం తీరడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తొందర్లోనే స్థానిక ఎన్నికలు వస్తాయని, స్థానిక ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ- చేస్తామని కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లు మోసపోయాం అని, మళ్లీ మోసపోవద్దని కేసీఆర్ చెప్పారని.. కానీ తాత్కాలికంగా మోసపోయాం అని పేరొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని, రుణమాఫీ కూడా చేయలేకపోయిందని మండిపడ్డారు. రైతుబంధు మొదటి పంటకే గతి లేదు అని ఎద్దేవా చేశారు. పేదలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమే అని

మిగతా 2లో..

## త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. భారత్‌-పాకిస్థాన్‌ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నడుమే ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్‌ దాడులకు తెగబడటం.. భారత్‌ సైతం వాటిని దీటుగా తిప్పికొట్టిన తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో సీడీఎస్‌ అనిల్‌ చౌహాన్‌, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌ డోభాల్‌ కూడా పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా.. బీఎస్‌ఎఫ్‌, సీఐఎస్‌ఎఫ్‌, హోంశాఖలోని సీనియర్‌ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. 'ఆపరేషన్‌ సిందూర్‌'తో భారత్‌-పాక్‌ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాక్‌ రెచ్చగొట్టే చర్యలకు దీటుగా బదులిచ్చేందుకు కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని అత్యవసర వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో వరుస భేటీలు జరుగుతున్నాయి. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా.. డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ బీఎస్‌ఎఫ్‌, డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ సీఐఎస్‌ఎఫ్‌, హోంశాఖలోని సీనియర్‌ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో , విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌ డోభాల్‌ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది %చొరబాటు ఘటనలు చోటుచేసుకుంటున్న తరుణంలో పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఆయా రాష్ట్రాలు ఇప్పటికే కీలక చర్యలు చేపట్టాయి. మన దేశంలోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పంజాబ్‌ సరిహద్దు వద్ద బీఎస్‌ఎఫ్‌కు చెందిన జవాన్లు హతమార్చిన సంగతి తెలిసిందే. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్‌ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్‌ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్‌ఎఫ్‌ తిప్పికొట్టింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులను మట్టుపెట్టినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్‌ నేడు కూడా నియంత్రణ రేఖకు ఆవలివైపు నుంచి భారీస్థాయిలో షెల్లింగ్‌ కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఉరి, జమ్మూకశ్మీర్‌ ప్రాంతాల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంది. చాలామంది ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఇళు ఖాళీ చేసి వెళుతున్నారు.

యూకే విదేశాంగ మంత్రితో జైశంకర్‌ చర్చలు..!

ఆపరేషన్‌ సిందూర్‌ జోరుగా జరుగుతున్న వేళ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్‌.జైశంకర్‌ యూకే ఫారెన్‌ మినిస్టర్‌ డేవిడ్‌ ల్యామితో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో భారత్‌ తరఫున ఐఎంఎఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ పరమేశ్వరన్‌ అయ్యర్‌ హాజరయ్యారు. ఉగ్రవాదాన్ని పాక్‌ పెంచి పోషిస్తున్న నేపథ్యంలో దానికి నిధులు ఇవ్వడంపై భారత్‌ ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాదు.. ఆ దేశం టెర్రరిజాన్ని వదులు కోవడానికి కూడా అంత సానుకూలంగా లేదని భారత్‌ చెబుతోంది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి, దానికి ప్రతిగా భారత్‌ చేపట్టిన 'ఆపరేషన్‌ సిందూర్‌' తదితర విషయాలు బ్రిటన్‌ పార్లమెంటులో బుధవారం చర్చకు వచ్చాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను ఉపసంహరింపజేయాలని ఎంపీలు తమ ప్రభుత్వానికి సూచించారు. సమస్యలను సంప్రదింపులు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని బ్రిటన్‌ ప్రధానమంత్రి కీర్‌ స్టార్మర్‌ చేసిన విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ హమిష్‌ ఫాక్నర్‌ పార్లమెంటులో చర్చను ప్రారంభించారు. రెండు దేశాలూ సంయమనం పాటించాలని కోరారు. భారత్‌, పాక్‌లతో బ్రిటన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనీ, తాము పహల్గాం ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించామని ఫాక్నర్‌ గుర్తు చేశారు. మరోవైపు దౌత్యపరంగా పాక్‌ను ఎదుర్కోవడానికి భారత్‌ అన్ని యత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఆపరేషన్‌ సిందూర్‌పై అమెరికా సహా మిత్రదేశాలకు తాజా పరిస్థితిని వివరించింది. నిన్న రాత్రి కూడా కేంద్ర మంత్రి ఎస్‌ జైశంకర్‌తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో ఫోన్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని సహించబోమని ఆయన పేర్కొన్నారు. దేశ భద్రతకు సంబంధించిన ఆపరేషన్‌ వార్తలు, దళాల కదలికల కవరేజీల విషయంలో మీడియా కొంత సంయమనం పాటించాలని రక్షణశాఖ ఓ ప్రకటనలో సూచించింది.

## మా రక్షణ వ్యవస్థను భారత్‌ ధ్వంసం చేసింది

**ఇస్లామబాద్‌(జనంసాక్షి):**లాహోర్‌, కరాచీ, రావల్పిండితో సహా పలు ప్రాంతాలకు భారతదేశం పంపిన 25 డ్రోన్‌లను పాకిస్తాన్‌ అడ్డుకట్టవేయలేకపోయిందన్నారు రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్‌. తమ దళాలు అడ్డగించి కూల్చివేసాయని పాకిస్తాన్‌ ప్రభుత్వం ప్రకటించిన ఒక రోజు తర్వాత.. పాకిస్తాన్‌ రక్షణ మంత్రి ఆసిఫ్‌ పార్లమెంటులో ప్రసంగిస్తూ.. భారత డ్రోన్‌లను పాక్‌ అడ్డుకోలేకపోయిందంటూ క్లారిటీ ఇచ్చారు.'మన ఎయిర్‌ డిఫన్స్‌ వ్యవస్థ విఫలమైంది. పాక్‌ రక్షణ వ్యవస్థను భారత్‌ తునాతునకలు చేసింది. మన రక్షణ విభాగం పూర్తిగా విఫలమైంది. ఇంతకు మించి ఇంకేమీ చెప్పలేను. గోప్యత పాటించాల్సిన కారణంగా ఇంకా వివరణ ఇవ్వలేను' అని పార్లమెంట్‌ సాక్షిగా స్పష్టం చేశారు. దీనిపై పాక్‌ ప్రతిపక్ష ఎంపీలు(పీటీఐ పార్టీకి చెందిన వారు) ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుత పాకిస్తాన్‌ ప్రభుత్వం చేతగాని ప్రభుత్వం అంటూ ధ్వజమెత్తారు. ఇదిలా ఉంచితే, ప్రస్తుతం పాకిస్తాన్‌ అన్ని రకాలుగా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్‌ సిందూర్‌'ను చేపట్టిన భారత్‌.. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాయాది దేశం..భారత్‌పై దాడులకు విఫలయత్నం చేస్తోంది. పాక్‌ దాడులను భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థలనూ ధ్వంసం చేశాయి. ఈ పరిణామాలతో పలువురు పాక్‌ ప్రజలు, రాజకీయ నాయకులు అక్కడి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాక్‌కు చెందిన తెహ్రీక్‌ -ఏ- ఇన్సాఫ్‌ (పీటీఐ) పార్టీ ఎంపీ షాహిద్‌ అహ్మద్‌ ఆ దేశ ప్రధాని షెహబాజ్‌ షరీఫ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ..తమ ప్రధాని పిరికివాడని, భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు పలకడానికి కూడా ఆయన భయపడుతున్నారని అన్నారు. టిప్పు సుల్తాన్‌ చెప్పిన కోట్‌ను ప్రస్తావిస్తూ.. సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే, అవి యుద్ధంలో పోరాడలేక ఓడిపోతాయని అన్నారు. అదే విధంగా సరిహద్దుల్లో ఉన్న తమ సైనికులు ధైర్యంగా భారత్‌తో పోరాడాలనుకున్నా.. దేశ ప్రధానికే ధైర్యం లేనప్పుడు వాళ్లు ముందడుగు ఎలా వేయగలరని ప్రశ్నించారు.

**జవాను వీరమరణం**

**గోరంట్ల(జనంసాక్షి):** శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాను జమ్మూకశ్మీర్‌లో వీరమరణం పొందారు. గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాకు చెందిన మురళీనాయక్‌ మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు శుక్రవారం ఉదయం సమాచారం అందింది. సరిహద్దులో చొరబాటు దారుల కాల్పుల్లో ఆయన మృతిచెందినట్లు అధికారులు వారికి తెలిపారు. 2022లో అగ్నివీర్‌ జవానుగా సైన్యంలో చేరిన మురళీనాయక్‌.. రెండు రోజుల క్రితం వరకు నాసిక్‌లో విధులు నిర్వర్తించారు. భారత్‌-పాక్‌ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్మీ అధికారులు ఆయన్ను నాసిక్‌ నుంచి జమ్మూకశ్మీర్‌కు పిలిపించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున చొరబాటు దారుల కాల్పుల్లో మురళీనాయక్‌ మరణించారు. ఈ సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మరోవైపు మురళీ నాయక్‌ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. మంత్రి సవిత కల్లితండాకు వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5లక్షల చెక్కును మురళీనాయక్‌ తల్లిదండ్రులకు ఆమె అందజేశారు. దేశ రక్షణలో సైనికుడు మురళీనాయక్‌ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు 'ఎక్స్‌'లో ఆయన పోస్ట్‌ చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# డ్రోన్లతో పాక్‌ దుశ్చర్యలు

**శ్రీనగర్‌(జనంసాక్షి):**భారత్‌-పాక్‌ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. 'ఆపరేషన్‌ సిందూర్‌' తర్వాత పాకిస్థాన్‌ దుశ్చర్యలను భారత్‌ సమర్థంగా తిప్పికొడుతోంది. కాగా తాజాగా జమ్మూ, సాంబా, పఠాన్‌కోట్‌లలో డ్రోన్లతో దాడులు చేసింది. అయితే దాయాది దాడుల్ని అడ్డుకున్న భారత బలగాలు దీటుగా అడ్డుకున్నాయి. జమ్మూలో కాల్పులు, పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయన్న సీఎం ఒమర్‌ అబ్దుల్లా తెలిపారు. కాగా సరిహద్దు జిల్లాలపై దాయాది వైపు నుంచి దాడుల ముప్పు పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే పంజాబ్‌లోని చండీగఢ్‌లో శుక్రవారం ఉదయం నుంచి మరోసారి సైరన్ల మోత వినిపించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. పాక్‌ నుంచి దాడులు జరిగే అవకాశం ఉందంటూ ఎయిర్‌ఫోర్స్‌ స్టేషన్‌ ఈ హెచ్చరిక జారీ చేసింది. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించింది. బాల్కనీల్లోకి కూడా రావొద్దని స్పష్టం చేసింది. అటు పంచకుల, మొహాలీ, పటియాలా, అంబాలలోనూ ఇదే విధమైన హెచ్చరికలు జారీ చేశారు. అటు జమ్మూలోనూ నేటి ఉదయం సైరన్లు మోగాయి. ఈ తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో పేలుడు శబ్దాలు వినిపించినట్లు తెలుస్తోంది. దీంతో నగరాన్ని బ్లాక్‌అవుట్‌ చేశారు. సరిహద్దు జిల్లాల్లో పాక్‌ నుంచి వస్తోన్న డ్రోన్లను భారత బలగాలు సమర్థంగా కూల్చేస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఓ హోటల్‌ ప్రాంగణంలో పాక్‌ డ్రోన్‌ శకలాలు లభ్యమయ్యాయి. అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగింది. బీఎస్‌ఎఫ్‌ క్యాంప్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌ను పంపగా.. భద్రతా బలగాలు కూల్చేశాయి. పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను అప్పగించింది. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు చేసిన పాక్‌ను భారత్‌ సమర్థంగా అడ్డుకొంది. ఆ రెండూ విఫలం కావడంతో పాక్‌ మరో కుతంత్రానికి తెరదీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు- తెలుస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు చేసి భారత్‌ను ఇబ్బంది పెట్టాలనేదే పాక్‌ పన్నాగం. దీంతో ఆ దేశానికి అలాంటి అవకాశం ఇవ్వకుండా భారత ఆర్మీని మరింత దృఢంగా తయారు చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైతే టెరిటోరియల్‌ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఇందులోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిచేందుకు అధికారం కల్పించింది. రెగ్యులర్‌ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. ఇప్పటి వరకు పలు సందర్భాల్లో -టెరిటోరియల్‌ ఆర్మీ సిబ్బంది యుద్ధాల్లో పాల్గొంది. 1962, 1965, 1971 యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగానూ సేవలు అందించారు. ఇటీవల కేరళ వరదల్లో స్టార్‌ నటుడు మోహన్‌ లాల్‌ తనవంతు సేవలు అందించిన సంగతి తెలిసిందే. అతడు కూడా టెరిటోరియల్‌ ఆర్మీలో లెఫ్టినెంట్‌ కర్నల్‌ స్థాయి అధికారి. ఈ జాబితాలో పలువురు సెలబ్రిటీలు కూడా ఉన్నారు. భారత మాజీ కెప్టెన్‌ ఎంఎస్‌ ధోనీ, సచిన్‌ పైలట్‌, కపిల్‌ దేవ్‌, అనురాగ్‌ ఠాకూర్‌, అభినవ్‌ బింద్రా.. లెఫ్టినెంట్‌ కర్నల్‌ స్థాయిలో ఉన్నారు. కనీస అర్హత సర్వీస్‌ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు- ఇతర ప్రయోజనాలు అందిస్తారు. టెరిటోరియల్‌ లేదా ప్రాదేశిక ఆర్మీ గురించి సింపుల్‌గా చెప్పాలంటే సైనిక రిజర్వ్‌ ఫోర్స్‌. దేశంలో క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీతో కలిసి ప్రత్యర్థితో తలపడేందుకు టెరిటోరియల్‌ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. ఇందులోని సిబ్బంది, అధికారులకు రెగ్యులర్‌ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఇస్తారు. వీరంతా బయట ఉద్యోగాలు చేసుకుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. 1948లో భారత టెరిటోరియల్‌ ఆర్మీ చట్టం ఆమోదించారు. ఆ తర్వాత 1949లో అధికారికంగా ప్రారంభమైంది. ప్రస్తుతం దాదాపు 50 వేల మంది వరకు ఈ ఆర్మీలో ఉన్నట్లు సమాచారం. వీరంతా రెగ్యులర్‌ ఆర్మీలో భాగమే అయినప్పటికీ.. నిరంతరం సైన్యంతోనే ఉండరు. అవసరమైన సందర్భాల్లో కదన, ప్రకృతి వైపరీత్యాల్లో రంగంలోకి దిగుతారు. -టెరిటోరియల్‌ ఆర్మీ అధికారుల్లో పలువురు శౌర్య, విశిష్ఠ పురస్కారాలను అందుకొన్నారు.

## నేడు హైదరాబాద్‌ వేదికగా ప్రపంచ అందాల పోటీలు

సంప్రదాయ రీతిలో ఆమెను స్వాగతించారు. శనివారం కన్నుల పండువగా మిస్‌ వరల్డ్‌ 2025 ప్రారంభ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా మిస్‌ వరల్డ్‌ ఈవెంట్‌ లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంస్కృతి, సౌందర్యం రెండింటి మేళవింపుగా నిర్వహించనున్న మిస్‌ వరల్డ్‌ -2025 ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. తెలంగాణాకు చెందిన వివిధ రకాల జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాది దక్కని కళారూపాలను ఈ ఉత్సవాలలో సమ్మిళితం చేసి ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.ప్రపంచ దేశాల నుంచి హైదరాబాద్‌ నగరానికి విచ్చేసే సుందరీమణుల ఆహ్వానం కోసం రాజీవ్‌ గాంధీ ఇంటర్నేషనల్‌ ఎయిర్‌ పోర్టులో ఈనెల 3వ తారీఖు నుంచి 9వ తారీఖు వరకు కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, కథక్‌, డప్పులు, బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాల తో కూడిన బృందాలతో స్వాగతం పలికేలా ఏర్పాటు- చేయడం జరిగింది. 24 గంటల పాటు అందుబాటు-లో ఉండి ఈ కళాకారులు ఎయిర్‌పోర్టులో ప్రపంచ సుందరి పోటీలకు విచ్చేస్తున్న సుందరీమణులకు స్వాగతం పలకడం జరిగింది. వారందరూ తెలంగాణ నేల మీద, హైదరాబాదులో కాలిడగానే కుంకుమ తిలకం దిద్ది, హారతులతో వారికి స్వాగతం పలకడం జరిగింది. నేడు గచ్చిబౌలి ఇండోర్‌ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రపంచ సుందరి ప్రారంభోత్సవ వేడుకలలో తెలంగాణ సంస్కృతి, కళలు ఆకట్టుకునేలా రూపొందించడం జరిగింది. ఎఆ తర్వాత కాకతీయుల కాలం నుండి తెలంగాణ శాస్త్రీయ నృత్య రీతిగా ఖ్యాతి గడించిన పేరిణి నాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరగనుంది. 250 మంది మహిళా కళాకారిణులు పేరిణి లాస్య సంప్రదాయాన్ని అనుసరించి ఈ నృత్యాన్ని ప్రదర్శించబోతున్నారు.

## 36 ప్రాంతాలు.. 400 దాడులు

నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్‌ సోంగర్‌' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. "గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్‌.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్‌ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్‌ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్‌ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్‌ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్‌ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్‌ డ్రోన్‌, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్‌ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్‌ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్‌ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్‌-పాక్‌ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్‌ సోఫియా ఖురేషీ, వింగ్‌ కమాండర్‌ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.



భారత్‌లోని ప్రార్థన స్థలాలనుపాకిస్థాన్‌ లక్ష్యంగా చేసుకుంటోందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్‌ మిస్రీ పేర్కొన్నారు. ప్రధానంగా గురుద్వారాలపై దాడి చేయడం ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టే యత్నం చేసిందని అన్నారు. అయితే దీనిని భారత్‌ తిప్పికొట్టిందని అన్నారు. పాక్‌ తన దుశ్చర్యలను అంగీకరించే బదులు.. భారత్‌పై దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాల్లో ఆ దేశం ఆరితేరిందని మండిపడ్డారు. పాకిస్థాన్‌లోని నన్కానా సాహిబ్‌ గురుద్వారాను భారత్‌ లక్ష్యంగా చేసుకున్నట్లు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిందని, ఇది మరో పచ్చి అబద్ధమని ఖండించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో ఈ ఘటనలకు మతపరమైన రంగును పులిమేందుకు దాయాది దేశం యత్నిస్తోందని భారత నగరాలు, పౌర సదుపాయాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా పాకిస్థాన్‌ గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగింది. బఠిండా సైనిక స్థావరం లక్ష్యంగా డ్రోన్‌లు దూసుకొచ్చాయి. భారత సాయుధ బలగాలు వాటిని తిప్పికొట్టాయి. ఇందులో భాగంగా పాకిస్థాన్‌లోని నాలుగు గగనతల రక్షణ వ్యవస్థలపై దాడులు చేశాం. ఒక ఏడీ రాడార్‌ వ్యవస్థను భారత డ్రోన్‌ ధ్వంసం చేసింది. ఈ దాడులను పాకిస్థాన్‌ అధికార యంత్రాంగం తిరస్కరించడం.. వారి ద్వంద్వ వైఖరిని తెలియజేస్తుందని అన్నారు. నియంత్రణ రేఖ వెంట పాఠశాలలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్‌ దాడులు చేస్తోంది. పూంచ్‌లోని ఓ స్కూల్‌ సమీపంలోని ఇంటిపై దాడి ఘటనలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కాల్పుల నేపథ్యంలో పాఠశాల సిబ్బంది సహా అనేకమంది స్కూల్‌ కింద ఉన్న బంకర్లలో తలదాచు కున్నారు. అదృష్టవశాత్తూ ఆ పాఠశాల మూసివేసి ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది. దాయాది మరింత దిగజారిందనడానికి ఈ చర్యలే నిదర్శనం అని విక్రమ్‌ మిస్రీ పేర్కొన్నారు. ప్రస్తుత భద్రత పరిస్థితుల దృష్ట్యా కర్తార్‌పుర్‌ సాహిబ్‌ కారిడార్‌ సేవలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేసినట్లు- విక్రమ్‌ మిస్రీ తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సమావేశం జరుగుతోందన్న ఆయన.. పాక్‌కు సంబంధించి భారత్‌ తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుందన్నారు. తదుపరి నిర్ణయం బోర్డు తీసుకుంటుందని చెప్పారు.

## సంయమనం పాటించాలి

**వాషింగ్టన్‌,బీజింగ్‌,న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌-పాకిస్థాన్‌ల మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణపై చైనా స్పందించింది. చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్‌ జియాన్‌ మాట్లాడుతూ..భారత్‌-పాక్‌ మధ్య నెలకొన్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. భారత్‌-పాక్‌ మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణలో తాము జోక్యం చేసుకోబోమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ తేల్చిచెప్పారు. ఫాక్స్‌ న్యూస్‌ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.''రెండు అణుశక్తి దేశాలు ఘర్షణ పడుతూ భారీ సంక్షోభం వైపు రావడంపై మేము ఆందోళన చెందుతున్నాం. వీలైనంత తొందరగా పరిస్థితులు శాంతించాలని కోరుకుంటున్నాం. భారత్‌ - పాకిస్తాన్‌ ఉద్రిక్తతల వేళ సింధు జలాల నిలిపివేతపై స్పందిస్తూ.. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోవడం లేదని వరల్డ్‌ బ్యాంక్‌ చీఫ్‌ 'అజయ్‌ బంగా' స్పష్టం చేశారు. మా పాత్ర కేవలం ఒక సహాయకుడిగా మాత్రమే ఉంటుందని అన్నారు. భారతదేశంలో పర్యటిస్తున్న అజయ్‌ బంగా.. గురువారం దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు.

### సరిహద్దుల వెంట భారీగా చొరబాట్లు

**శ్రీనగర్‌(జనంసాక్షి):**జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్‌ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్‌ఎఫ్‌ తిప్పికొట్టింది. ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకొంటున్న నేపథ్యంలో ఈ పరిణామాలు జరగడం గమనార్హం. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసుకొన్నట్లు బీఎస్‌ఎఫ్‌ ఎక్స్‌ పోస్టులో వెల్లడించింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బీఎస్‌ఎఫ్‌ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు పాక్‌కు చెందిన ధన్‌బార్‌లోని పోస్టును మన దళాలు ధ్వంసం చేశాయి. మరోవైపు పాకిస్థాన్‌ నేడు కూడా నియంత్రణ రేఖకు ఆవలివైపు నుంచి భారీస్థాయిలో షెల్లింగ్‌ కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఉరి, జమ్మూ, కశ్మీర్‌ ప్రాంతాల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని ఆంగ్ల వార్తా సంస్థ పీటీఐ వెల్లడించింది. చాలామంది ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ చేసి వెళుతున్నారు. పాక్‌తో సరిహద్దు పంచుకొంటున్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉన్నాయి. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్‌ సరిహద్దును సీల్‌ చేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు.

**పాక్‌ మిలిటరీ పోస్ట్‌ ధ్వంసం..**

భారత్‌-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. 'ఆపరేషన్‌ సిందూర్‌కు ప్రతిగా దాయాది సైన్యం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడు తోంది. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరుపుతోంది. వీటిని భారత ఆర్మీ సమర్థంగా తిప్పికొడుతోంది. ఈక్రమంలోనే సరిహద్దుల్లో శత్రు దేశానికి చెందిన పలు సైనిక పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయి. అందుకు సంబంధించిన వీడియోను భారత సైన్యం విడుదల చేసింది. యాంటీ ట్యాంక్‌ గైడెడ్‌ మిస్సైళ్లతో పాక్‌ మిలిటరీ పోస్ట్‌లను ధ్వంసం చేస్తున్నట్లు తెలుస్తోంది. భారత దాడిలో పాక్‌ పోస్ట్‌ కుప్పకూలిన దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. అయితే ఏ సెక్టార్‌లోని పోస్ట్‌ను నేలకూల్చారన్నది మాత్రం తెలియరాలేదు. సరిహద్దుల్లో పాక్‌ డ్రోన్‌ దాడులను సమర్థంగా తిప్పికొడుతున్నామని భారత సైన్యం ప్రకటించింది.

# డిఫెన్స్‌ ఫండ్‌కు విరాళం

అంతా పూజలు చేయడం సందర్భోచితమని మంత్రి కొండా సురేఖ అన్నారు. తీవ్రవాదాన్ని యావత్‌ భారతమంతా ఉక్కు పిడికిలితో ఎదుర్కొన్నదన్నారు. ఈ సమైక్యత దేశ భద్రత విషయంలో రానున్న రోజుల్లో కూడా ఉంటుందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. ఎక్కడ ఉన్నా కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మన దేశ పౌరుల మీద ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన దాడికి నిరసనగా ఇండియన్‌ మిలటరీ చేపట్టిన ఆపరేషన్‌ సిందూర్‌ అందరూ స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ మంత్రిగా కాదు, ఇంతటి గొప్ప దేశ పౌరురాలిగా ఈ చర్యపై చాలా సంతోషంగా భావిస్తున్నట్లు తెలిపారు. పుల్వామాలో మనం కోల్పోయిన వీర సైనికులను తిరిగి తీసుకురాలేమని.. వారి త్యాగం శాశ్వతమన్నారు. మనమున్నంత కాలం వారిని స్మరించుకుంటామని అన్నారు. ఆపరేషన్‌ సిందూర్‌ ద్వారా భారత్‌ తలెత్తి నిలిచిందన్నారు. ఏకత్వంతో, శక్తితో, నిశ్శబ్దమైన సంకల్పంతో మనల్ని ప్రపంచం నిలబెట్టిందని చెప్పుకొచ్చారు. ఇది కేవలం ప్రతిస్పందన కాదని.. ఒక ప్రతి సమాధానమని వెల్లడించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చాలా మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకుపోవాలని.. ఎందుకంటే ఇది దేశానికి సంబంధించిన విషయమన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ఎటు-వంటి రాజకీయం చేయాలని అనుకోవడం లేదని... చేయదు కూడా అని స్పష్టం చేశారు. తాము భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నామని.. రానున్న రోజుల్లో కూడా ఉంటామన్నారు. అందుకే ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గుడిలో, దేవాలయాలో ఆర్మీకి మంచి జరగాలని పూజలు చేస్తున్నామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

**తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌-పాకిస్థాన్‌ సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా దిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేశారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఉంటున్న, చిక్కుకున్న తెలంగాణ వాసులకు సాయం చేసేందుకు, సమాచారం ఇచ్చేందుకు, వారికి అవసరమైన సేవలు అందించేందుకు ఈ కంట్రోల్‌ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి సాయం కావాలన్నా కంట్రోల్‌ రూమ్‌ నంబర్‌ 011-23380556ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్‌ రూమ్‌ నంబర్‌తో పాటు రెసిడెంట్‌ కమిషనర్‌ ప్రైవేటు సెక్రటరీ, లైజన్‌ హెడ్‌ నంబర్‌ 98719-99044, రెసిడెంట్‌ కమిషనర్‌ వ్యక్తిగత సహాయకుడి నంబర్‌ 99713-87500, తెలంగాణ భవన్‌లో లైజన్‌ ఆఫీసర్‌ నంబర్‌ 96437-23157, పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌ నంబర్‌ 99493-51270ను సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## సమరానికి సై

ఫైటర్‌ పైలెట్‌ గా పనిచేసిన అనుభవం తనకుందని ఆయన తెలిపారు. అదే అనుభవంతో తాజాగా రెండు దేశాల మధ్యన ఏర్పడ్డ ఉద్రిక్తత వాతావరణంలో తన సేవలు అవసరమనుకుంటే వెనక్కి తగ్గేది లేదని ఆయన సుస్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం గాంధీభవన్‌ లో విలేకరులతో జరిగిన చిట్‌ చాట్‌ లో ఆయన పాల్గొన్నారు. తాను 16 ఏళ్ల వయసులోనే సాయుధ దళాల్లో చేరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 1982 నాటికే మిగ్‌-21వంటి యుద్ద విమానాలు నడపడంతో పాటు తరువాత క్రమంలో మిగ్‌-23 యుద్ద విమానాలను సమర్ద వంతంగా నడిపినట్లు ఆయన తెలిపారు. మిగ్‌-23యుద్ద విమానం రెండింతల వేగంతో దూసుకు పోయే యుద్ద విమనాంగ ప్రసిద్ధి చెందిందని ఆయన తెలిపారు. 20 ఏళ్ల వయస్సు లోనే భద్రతా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఉత్తరప్రదేశ్‌, శ్రీనగర్‌, అమృతసర్‌ వంటి ప్రాంతాల్లో పని చేసినట్లు ఆయన తెలిపారు. తాజాగా కాశ్మీర్‌ లో జరిగిన ఘటన పై ఆయన స్పందిస్తూ మతం పేరుతో జరిగే హింసాత్మక చర్యలను సంఘటితంగా ఖండించాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పాకిస్థాన్‌ అండతో జరిగిన ఈ ఉగ్రవాద చర్యను యావత్‌ భారతదేశం ముక్తకం ఠంతో ఖండించిందన్నారు. లష్కరే తోయిబాబకు చెందిన గ్రూప్‌ జరిపిన దుశ్చర్యకు ప్రతిగా భారతదేశానికి ప్రతిస్పందించాల్సిన హక్కు ఉందని ఆయన తేల్చిచెప్పారు.

## ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

కేటీ-ఆర్‌ చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్‌ మీడియాతో మాట్లాడారు. పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం ఉంది, రాజకీయాలు మాట్లాడాల్సిన సమయం కాదు ఇది. సీతారామ ప్రాజెక్టును కేసీఆర్‌ నిర్మాణం చేపట్టారు. డిప్యూటీ- సీఎం భట్టి మధిరలో గెలవడానికి బాండ్‌ పేపర్‌ మీద సంతకాల చేసి నీటికి వచ్చిన వాగ్దానాలు చేశారు. 125 ఏళ్ల చరిత్ర గలిగిన పార్టీ అని భట్టి చెప్పారు.. ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయి. 17 నెలల తర్వాత వున్న స్కీములు పోయాయి. ఇప్పుడు కేసీఆర్‌ కిట్‌ పోయింది. రైతుబంధు మొదటి పంటకే గతి లేదు. ఫ్రీ బస్‌, తులం బంగారం అన్నారు.. ఎటుపోయాయి. ఖమ్మం జిల్లా అంతా మార్పు అన్నారు. ఇప్పుడు ఏమి అయ్యింది' అని కేటీ-ఆర్‌ ప్రశ్నించారు. అయిదేళ్లు మేము ప్రక్కకు ఉంటాము. ఆరు గ్యారెంటీ-లు, 420 హామీలు ఇచ్చారు. వాటిని మేము వదిలిపెట్టేది లేదు. రేవంత్‌ రెడ్డి మాదిరిగా ఏ సీఎం కూడా ఇలా మాట్లాడలేదు. ఢిల్లీకి పోతే రేవంత్‌ రెడ్డిని దొంగల మాదిరిగా చూస్తున్నారు అని అంటు-న్నారు. నిజమే రేవంత్‌ రెడ్డి దొంగే కదా. ఓ సీఎం అలా మాట్లాడవచ్చా. రేవంత్‌ రెడ్డిని చూస్తే కేంద్రం దొంగలా చూస్తోంది. ఒక్క ఓటు-కి శిక్ష అయిదేళ్లు. తొందర్లోనే స్థానిక ఎన్నికలు వస్తాయి, సీరియస్‌గా పోటీ- చేస్తాం. నాయకులూ ప్రజల్లో ఉండాలి, ధాన్యం కల్లాల వద్ద మనమే ఉండాలి. ఇక్కడ ఎమ్మెల్యేని గెలిపించాం, కాంగ్రెస్‌ లో చేరారు. భద్రాచలం ఉప ఎన్నిక వస్తుంది, ఉమ్మడి జిల్లా క్యాడర్‌ భద్రాచలం వెళ్లి గెలిపించుకుందామన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మాక్‌డ్రిల్‌ చేపట్టాలి

మంచి సంకేతాన్ని ఇచ్చిందని అభిప్రాయపడ్డారు. సున్నితమైన అంశాల గురించి సోషల్‌ మీడియాలో తప్పుడు ప్రచారం కాకుండా నిరంతరం పర్యవేక్షణ చేసి కట్టడి చేయాలి. తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. 24 గంటల ముందే ప్రజలను అప్రమత్తం చేసి మాక్‌ డ్రిల్‌ ట్రయల్‌ నిర్వహించాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులను రద్దుచేసి వారి హెడ్‌ క్వార్టర్‌ లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి, వార్తా ప్రచారాల్లో తగు జాగ్రత్తల కోసం మీడియా అధిపతులతో సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. యుద్ధ వాతావరణం సందర్భంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్‌ అధికారులు సమగ్రంగా యాక్షన్‌ ప్లాన్‌ రూపొందించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు హైదరాబాదులో సైరన్‌ అలర్ట్‌ ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించిన పరికరాలు ఎక్కడున్నా కొనుగోలు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సివిల్‌ డిఫెన్స్‌ మాక్‌ డ్రిల్‌ నిర్వహించినట్లు చెప్పారు దేశ రక్షణలో కీలక పాత్ర వహిస్తున్న రక్షణ శాఖకు సంబంధించిన పరికరాల తయారీకి సంబంధించిన పరిశ్రమల వద్ద కట్టుదితమైన భద్రతను ఏర్పాటు చేశామని మాక్‌ డ్రిల్‌ లో వీళ్ళందర్నీ కూడా భాగస్వాములు చేశామని తెలిపారు. ఆస్పత్రి భవనాల స్లాబు పైన ఎరుపు రంగుతో ప్లస్‌ గుర్తును ఏర్పాటు చేసుకోవాలని అన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అత్యవసర నిధులు సమకూర్చుకోవడం పోలీస్‌ కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌ నుంచి జనాలను అప్రమత్తం చేయడం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నట్టు సిఎస్‌ రామకృష్ణ రావు వివరించారు. రాష్ట్ర డిజిపి జితేందర్‌ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌ గాంధీ ఇంటర్నేషనల్‌ ఎయిర్పోర్ట్‌ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, చెప్పారు. హైదరాబాదులో ఉన్న డిఆర్డిఏ, డి ఆర్‌ డి ఓ, ఎన్‌ ఎఫ్‌ సి తదితర జాతీయ స్థాయి పరిశ్రమల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 24/7 పెట్రోలింగ్‌ నిర్వహిస్తూ సీసీటీవీల ద్వారా మానిటరింగ్‌ చేస్తున్నట్లు తెలిపారు. సోషల్‌ మీడియాలో ఫేక్‌ వార్తలు ప్రచారం కాకుండా సైబర్‌ టీంలను ఏర్పాటు చేసి ఎప్పటి కప్పుడు తప్పుడు వార్తలను కట్టడి చేయడం తో పాటు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు డిజిపి వివరించారు. ?కేవైసీ లేకుండా సిమ్‌ కార్డులు జారీ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నమని. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను పెంచామని వివరించారు రాష్ట్రంలో ఉత్పన్నమయ్యే అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేసుకున్నాము అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై రాష్ట్ర వ్యాప్తంగా నిఘా పెంచామని డిజిపి తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి పర్యవేక్షణ చేయడానికి హైదరాబాద్‌ కేంద్రంగా కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేశాము, గతంలో కేసులు నమోదయి జైలు జీవితం అనుభవించి విడుదలైన వారి కదలికల పట్ల నిఘా పెంచామన్నారు

## ప్రజావాణిలో 221 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 221 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 64, హోం శాఖకు సంబంధించి 10, రెవెన్యూ శాఖకు సంబంధించి 26, మున్సిపల్ శాఖకు 10, ఇందిరమ్మ ఇండ్ల కోసం 64, ప్రవాసి ప్రజావాణికు 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 46 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్స్ తమ సమస్యలను తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో చిన్నారెడ్డి ఫోన్ లో మాట్లాడి సమస్యను ఒక కొలిక్కి తెచ్చారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- ఈ నెల చివరిలోగా ప్రెస్ అకాడెమీ భవనం ప్రారంభిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫిక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000/-తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3000/- ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000/-ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ.8,98,39,000/-లు ఆర్థిక సహాయం అందించండం జరిగిందన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు శ్రీ రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## ఇండియన్ ఆర్మీకి రౌడీ బ్రాండ్ దుస్తులు అందిస్తా

- నటుడు విజయ్ దేవరకొండ ప్రకటన



హైదరాబాద్, మే 9 (జనంసాక్షి) : శత్రుదేశం పాకిస్థాన్ పై భారత్ సాగిస్తున్న యుద్ధానికి దేశమంతా మద్దతు పలుకుతోంది. ఇలాంటి టైమ్ లో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కూడా ఇండియన్ ఆర్మీకి మద్దతు తెలిపాడు. మొదటి నుంచి ఇండియన్ ఆర్మీ మీద ఎప్పటికప్పుడ పోస్టులు పెడుతూ మద్దతు తెలుపుతున్నాడు విజయ్. మొన్న ఆపరేషన్ సింధూర్ పై కూడా ప్రశంసలు కురిపించాడు. కానీ పాక్ చేస్తున్న దొంగ దాడులను మన ఇండియన్ ఆర్మీ ధీటుగా ఎదుర్కుంటుంది. ఈ క్రమంలోనే ఇండియన్ ఆర్మీకి సెలబ్రిటీలు, ప్రముఖులు మద్దతు చెబుతున్నారు. తాజాగా రౌడీ స్టార్ ఓ కీలక ప్రకటన చేశాడు. దేశం కోసం త్యాగాలు చేస్తున్న ఇండియన్ ఆర్మీకి తన రౌడీ బ్రాండ్ దుస్తులు అందిస్తానని ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ ప్రకటనను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. విజయ్ ప్రస్తుతం కింగడమ్ సినిమా పనుల్లో బిజీగా ఉంటున్నాడు. అలాగే విజయ్ సాంకృత్యన్ తో ఓ సినిమా చేస్తున్నాడు.

## కార్మికుల హక్కుల సాధనలో టీబీజీకేఎస్ పాత్ర ఎనలేనిది

- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి




నస్పూర్, మే 9, (జనంసాక్షి): సింగరేణి కార్మికుల హక్కులను సాధించడంలో టీబీజీకేఎస్ యూనియన్ పాత్ర ఎప్పటికీ మర్చిపోలేనిదని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి 3 గనిలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో సింగరేణిలో ఏ కార్మిక సంఘం సాధించలేని హక్కులు టీబీజీకేఎస్ యూనియన్ ద్వారా మాత్రమే సాధించామని తెలిపారు. జాతీయ సంఘాల నిర్లక్ష్యంతో 20 సంవత్సరాల నుండి వారసత్వ ఉద్యోగాలకు దూరంగా ఉన్న సింగరేణి కార్మికులకు టీబీజీకేఎస్, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కారుణ్య నియామకాల పేరుతో 15,000, అలాగే ఎక్స్టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 5000 మంది యువ కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈనెల 20వ తేదీన నిర్వహించే ఒకరోజు టోకెన్ సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టీబీజీకేఎస్ యూనియన్ కి ఆకర్షితులై వివిధ యూనియన్లకు చెందిన 80 మంది యువ కార్మికులు టీబీజీకేఎస్ యూనియన్ లో చేరగా, వారికి కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

నిర్మల్ రూరల్, మే 8 (జనం సాక్షి) : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో వివిధ శాఖల అధికారులు గోవింద్, జీవరత్నం, శ్రీనివాస్, విజయలక్ష్మి, నరసింహారెడ్డి, అశోక్, శంకరయ్య, రామ్ గోపాల్, విష్ణువర్ధన్, భాలిక్ అహ్మద్, రాజేందర్, సుభాష్ తదితరులు ఉన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి

- యుద్ధ వాతావరణంలో అందాల పోటీల నిర్వహణ అవసరమా?
- పరిపాలన చేతకాని సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి: ఎమ్మెల్సీ కవిత
- ఐక్యంగా ఉండి భారత సైన్యానికి అండగా నిలబడుదాం
- ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా తెలంగాణ జాగృతి భారీ ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణలో నెలకొన్న ఈ సమయంలో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని, ఐపీఎల్ ను వాయిదా వేసినట్లుగా మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని సూచించారు. దేశంలో యుద్ధ వాతావరణ నెలకొంటే దేశంలో అందాల పోటీలు పెట్టారన్న అపవాదు తెలంగాణకు వస్తుందని అన్నారు. ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని, తప్పుడు సంకేతాలకు తావునివ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా, భారత సైన్యానికి సంఘీభావంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు జరిగిన భారీ ర్యాలీకి ఎమ్మెల్సీ కవిత నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలను దిగ్విజయంగా భారత సైన్యం ధ్వంసం చేసిందని ప్రశంసించారు. సైన్యం వల్ల మనకు రక్షణ కలుగుతుందని, కాబట్టి వారికి ధైర్యం, స్థైర్యాన్ని నింపడానికి ర్యాలీ చేశామని చెప్పారు. పాకిస్తాన్ మన దేశంలోని ఎయిర్ పోర్టులను టార్గెట్ చేసుకొని చేసిన దాడులకు భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. "ఇది ధర్మయుద్ధం. భారత్ ఎప్పుడూ తప్పు చేయదు. నీతి, నిజాయితీతోనే యుద్ధం చేస్తున్నాం. మనం పాకిస్తాన్ భూభాగంలోని సామాన్య ప్రజలను ఏమి అనలేదు. కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేశాము." అని వ్యాఖ్యానించారు. మరోవైపు, విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఎమ్మెల్సీ కవిత సమాధానమిస్తూ.... ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం రాకపోతే, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేనప్పుడు పదవి నుంచి తప్పుకోవాలని సూచించారు. పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన, ప్రజలైనా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని, కానీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే విధంగా సీఎం మాట్లాడడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు.

## భారత సైన్యం తెగువ దేశానికి గర్వకారణం

- హైదరాబాద్లో ఆర్మీ లెఫ్ట్ నెంట్ కల్నల్ దీపక్ జోషిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆర్.పి.వి.సంస్థ ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలీ



ఖమ్మం మే 09 (జనంసాక్షి) : ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై దాడి చేసి భారత సైన్యం చూపుతున్న తెగువ మన దేశానికే గర్వకారణం అని, దేశ రక్షణ కోసం పోరాడుతున్న ప్రతి సైనికుడికి పలు విభాగాల సైన్యాధ్యక్షులకు మా సలాం అంటూ రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలి అన్నారు.. శుక్రవారం హైదరాబాద్ లోని ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతంలోని లెఫ్ట్ నెంట్ కల్నల్ దీపక్ జోషిని మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపి భారతదేశాన్ని రక్షించడంలో, ప్రజల ప్రాణాలను కాపాడడంలో తమ విభాగాల సైనికులు చూపుతున్న తెగువకు మా సలాంను ప్రతి ఒక్క సైనికుడికి తమరి ద్వారా చేర వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఎంతో ధైర్య సాహసాలతో తమ ప్రాణాలను పణంగా పెట్టి పాకిస్థాన్ లో దాగివున్న ఉగ్ర మూకలపై రుద్ర తాండవమాడి, సింధూర్ ఆపరేషన్ విజయవంతంగా కొనసాగిస్తూ....సుమారు 80 మంది ఉగ్రవాదులను హత మార్చారన్నారు. పాక్ లోని ఉగ్రవాద సంస్థలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు యావత్తు దేశ ప్రజలు గర్వపడేలా చేశాయని, మన భారత సైన్యం కంటి మీద కునుకు లేకుండా భారత దేశ సరిహద్దులో పహారా కాస్తూ...భారత దేశ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న మీరు దైవ స్వరూపులని ఆయన అన్నారు..ఇలాంటి సమయంలో ప్రతి భారతీయ పౌరుడు భారత సైన్యానికి మద్దతుగా విషెస్ చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు..ఆపరేషన్ సింధూర్ లో పాల్గొన్న ప్రతి సైనికుడికి తమరి ద్వారా ఆర్మీ , వాయు, జల విభాగ సైనికులకు అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. జై హింద్... జై భరత్.. అంటూ భారత సైన్యం పోరాట పటిమను కొనియాడారు.. అనంతరం లెఫ్ట్ నెంట్ కల్నల్ దీపక్ జోషి మాట్లాడుతూ భారతదేశ భూభాగాన్ని , భారత ప్రజానీకాన్ని కాపాడటమే తమ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. దేశ రక్షణ కోసం పనిచేయడం పనిచేయడం గర్వంగా ఉందన్నారు.. శత్రు దేశ సైనికులను వెంబడించి మట్టుపెట్టడమే తమ ముందున్న లక్ష్యమని ఆయన అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైఫిల్ షూటర్ మారియాను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.. ఈ కార్యక్రమంలో సయ్యద్ సాదిక్ అలి వెంట నాయకులు కలీం, మారియా తండ్రి ఖదీర్ ఉన్నారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

న్యూఢిల్లీ (జనంసాక్షి) : అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సరిహద్దు రాష్ట్రాలలో ప్రస్తుతం నివసి స్తున్న, చిక్కుకున్న తెలంగా ణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవల ను అందించే ఉద్దేశ్యంతో తెలం గాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. నిరంతరాయంగా సేవలను నిర్ధారించడానికి ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తోంది. వివరాలకు 011-23380556 చేయాలని సూచించింది. అలాగే లైజన్ హెడ్, రెసిడెంట్ కమిషనర్ ప్రయివేటు సెక్రెటరీ వందన 9871999044, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకులు హైదర్ అలీ నఖ్వీ 9971387500, లైజాన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ 96437 23157, పీఆర్వో సిహెచ్. చక్రవర్తి 9949351270 నెంబర్లలో సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ తెలిపారు.

## విశాఖ-అబుదాబి మధ్య విమాన సర్వీస్

- జూన్ 13న ప్రారంభిస్తున్నట్లు రామ్మోహన్ వెల్లడి

న్యూఢిల్లీ, మే9 (జనంసాక్షి) : ఏపీ ప్రజలకు మరోశుభవార్త అందించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అబుదాబి, బెంగళూరు, భువనేశ్వర్ ప్రాంతాలకు కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. విమానయాన సర్వీసుల విస్తరణతో రాష్ట్రమంతటా కనెక్టివిటీని పెంచేందుకు కొత్త విమానాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం- అబుదాబి మధ్య జూన్ 13 నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని మంత్రి వెల్లడించారు. ఈ విమాన సర్వీసులు వారానికి నాలుగు రోజుల పాటు- నడుస్తాయని పేర్కొన్నారు. అలాగే, విశాఖ- భువనేశ్వర్ విమాన సర్వీసు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నట్లు- తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఏపీ, ఒడిశా మధ్య సంబంధాలు బలోపేతమవుతాయని పేర్కొన్నారు. విజయవాడ - బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు జూన్ 2 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

## నిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు

- పెరిగిన ఓపీ, ఐపీ
- ఏడాదిలో పెద్ద సంఖ్యలో రొబొటిక్ సర్జరీలు
- నిమ్స్ 2024 ప్రగతి నివేదికను మంత్రికి అందజేసిన డైరెక్టర్ బీరప్ప
- డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన మంత్రి
- ఆరోగ్యశ్రీ ఇన్‌సెంటివ్ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మంత్రి



హైదరాబాద్ (జనంసాక్షి) : నిమ్స్ డాక్టర్లు, స్టాఫ్ పదేండ్ల ఆకాంక్ష నెరవేరనున్నది. ఆరోగ్యశ్రీ పేషెంట్లకు చికిత్స అందించినందుకుగానూ, నిమ్స్‌కు ఆరోగ్యశ్రీ నుంచి వచ్చే డబ్బుల్లో 35 శాతం ఇకపై డాక్టర్లకు, వైద్య సిబ్బందికి అందించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు, శుక్రవారం సెక్రటేరియట్‌లో జరిగిన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. 2024-25లో నిమ్స్ పేషెంట్లకు అందించిన సేవల వివరాలతో కూడిన నివేదికను బీరప్ప మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2023 కంటే 2024లో అవుట్ పేషెంట్ల సంఖ్య 12.6 శాతం పెరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ కింద అడ్మిట్ అయిన పేషెంట్ల సంఖ్య 22.4 శాతం పెరిగిందన్నారు. నిమ్స్‌లో చికిత్స కోసం 2024లో 11 వేల మంది పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌వోసీల ద్వారా చికిత్స అందించామన్నారు. 2023లో కేవలం 5800 మందికి మాత్రమే ఎల్‌వోసీ కింద చికిత్స అందించామని బీరప్ప తెలిపారు. గతేడాది కాలంలో నిమ్స్‌లో సుమారు 350 రొబొటిక్ సర్జరీలు చేశామన్నారు. నిమ్స్‌లో పేషెంట్ల సంఖ్య పెరుగుతున్నందున ఇందుకు అనుగుణంగా డాక్టర్లు, స్టాఫ్‌ను రిక్రూట్ చేసుకునేందుకు అనుమతించాలని మంత్రిని కోరారు. సుమారు 800లకు పైగా పోస్టుల భర్తీకి మంత్రి అనుమతి ఇచ్చారు. ఇందులో డాక్టర్లు, నర్సులు సహా అన్ని రకాల పోస్టులు ఉన్నాయి. నిమ్స్ కొత్త బిల్డింగుల నిర్మాణ పనులపై మంత్రి ఆరా తీశారు. భవనాల నిర్మాణ పనుల ప్రగతిని మంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్వాలిటీలో కాంప్రమైజ్ అవకుండా, వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులపై త్వరలోనే పూర్తి స్థాయిలో సమీక్ష చేస్తానని, అన్ని వివరాలతో రావాలని అధికారులకు సూచించారు. నిమ్స్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉన్నదని, సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి చికిత్స కోసం వస్తుంటారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అంతర్గత కలహాలతో నిమ్స్ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ శైలజ, నిమ్స్ డీన్, డాక్టర్ లిజా రాజశేఖర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి రాణించాలి

- సంప్రదాయేతర ఇంధన వనరులోనూ సింగరేణి సత్తా చాటాలి.
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష



హైదరాబాద్ (జనంసాక్షి) : బొగ్గు రంగంలో అగ్రస్థానంలో ఉన్న సింగరేణి రానున్న రోజుల్లో క్రిటికల్ మినరల్స్, సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో ప్రవేశించి తన సత్తాను చాటాలని, 136 సంవత్సరాల మైనింగ్ అనుభవాన్ని ఉపయోగించుకొని సంస్థ భవిష్యత్తుకు సుస్థిర ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సింగరేణి భవిష్యత్తు విస్తరణ ప్రాజెక్టులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షించారు. గ్రాఫేట్, లిథియం, కాపర్ తదితర ఖనిజాలకు రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో వాటి అన్వేషణకై ఉన్న అవకాశాలన్నింటినీ అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని నిర్దేశించారు. ఇందుకోసం ఇప్పటికే కన్సల్టెంట్ ఏజెన్సీలను నియమించుకొని ముందుకు వెళుతుండటంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. సింగరేణి ప్రాంతాల్లోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలో అందుబాటులో ఉన్న అవకాశాల అన్వేషణకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. అలాగే రాజస్థాన్ తో చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు విద్యుత్, సోలార్ ప్లాంట్ ఏర్పాట్లపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సిఎండి ఎన్ బలరాం నాయక్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
10 మే 2025
తెలంగాణ

**కట్టుకున్న మనిషిని కళ్ళముందే కాల్చిచంపుతుంటే, కరిగిపోతున్న సుదుటి కుంకుమ కన్నీళ్లను ఎర్రబారుస్తుంటే ప్రాణ్వడిన గుండెలతో నేలపై కూలబడిన ఆడబిడ్డల శోకానికి భారతావని బదులు తీర్చుకుంది భార్యాబిడ్డల కళ్లముందే అమాయకుల గుండెల్లోకి తుపాకి గుళ్లు దించిన నరరూప రాక్షసులను 'స్వాతంత్ర్య సమరయోధులు'గా కీర్తించిన దాయాది దేశానికి దానికి అర్థమయ్యే భాషలోనే ధీరభారతం జవాబిచ్చింది. సుందర క్శ్మోరాన్ని భరతమాత నొసటన నెత్తుటి సిందూరంగా మార్చిన సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయాల్సిందేనని 140కోట్ల గొంతులు ఏకస్వరంతో నినదిస్తున్నాయి.**



# భారతదేశంతో యుద్ధం పాకిస్తాన్‌కు తీవ్రమైన దెబ్బ!



పాకిస్తాన్ చరిత్ర నుండి పాఠాలు నేర్చుకొని పాకిస్థాన్ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. భారత్ సహనంతో వ్యవహరించినప్పటికీ పాకిస్తాన్ బార్డర్ వెంబడి కవ్వింపు చర్యలకు పాల్పడడం. రాకెట్ లాంచర్లతో పంజాబ్, జమ్మూ, లడక్ తదితర ప్రాంతాలలో మిసైల్స్‌తో దాడి చేసి భారత్ సహనాన్ని పరీక్షించింది. ఎంత ఓపికగా సహనంతో మెలుగుతున్న భారతదేశా నికి పక్కలో బల్లెం గా మెలుగుతున్న పాకిస్థాన్ ను ఇప్పటికైనా కట్టుదిట్టం చేయకపోతే భారతదేశం చేతులు కట్టుకొని కూర్చున్నట్లుగా బలహీనులుగా అంచనా వేసే పరిస్థితులు ఉన్నాయి. భారతదేశ యొక్క మంచితనాన్ని ప్రపంచ దేశాలు గుర్తించి మే ఏడో తేదీన ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన మెరుపు దాడికి ప్రపంచ దేశాల నుండి మద్దతు లభించింది. పాకిస్తాన్ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు ముఖ్యంగా ఆహార కొరత తాగునీటి కొరత ఆర్థికంగా వెనుకబడిపోయి బతుకు జీవుడు అన్నట్లుగా అక్కడ ప్రజలు జీవిస్తున్నారు. ప్రజల జీవన వ్యవస్థను మెరుగుపరచకపోగా పాకిస్తాన్ నిత్యం భారతదేశంతో కవ్వింపు చర్యలకు పాల్పడడం భారత్ ఎంతో సహనంతో మెలగడం దౌత్యపరంగా అనేక రకాలుగా పాకిస్తాన్ పై ఒత్తిడి తీసుకురావడం జరిగింది. ఇప్పటికే ఐక్యరాజ్యసమితి పాకిస్తాన్‌ను హెచ్చరించిన ప్పటికీ తన పద్ధతి మార్చుకోకపోవడం రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొల్పడానికి అవకాశం ఏర్పడ్డది. పాకిస్తాన్ కేంద్రంగా ఉగ్రవాద కేంద్రాలు నిర్వహించబడుతున్నట్లు ప్రపంచ దేశాలు స్వీకరించాయి ముఖ్యంగా అమెరికా రస్య ఉక్రెయిన్ ఉత్తర కొరియా తదితర దేశాలు ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపాలని ఉద్దేశంతో ముందడుగు వేస్తున్నాయి. పాకిస్తాన్ ఇప్పటికైనా శాంతి చర్చలకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన పాకిస్తాన్ ప్రజలు ఆర్థికంగా వెనుకబడిపోయారు. జీవనం దయానియస్థితిలో ఉన్నట్లు తెలుస్తుం ది. పాకిస్తాన్ పాలకులకు గట్టి బుద్ధి చెప్తామని భారతదేశం భావిస్తున్న తరుణంలో ప్రపంచ దేశాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఒక చైనా మినహా ప్రపంచంలోని ఏ దేశం కూడా పాకిస్తాన్ చేస్తున్న విధానానికి మద్దతు ప్రకటించిన దాఖలాలు లేవు. కాబట్టి ఏది ఏమైనా పాకిస్తాన్ చరిత్ర తెలుసుకొని భారత్ పై యుద్ధం చేయాలి .

భారతదేశం వద్ద ఉన్న అత్యంత ఆధునికమైన ఆయుధ సంపత్తిని పాకిస్తాన్ తక్కువ అంచనా వేస్తుంది. కేవలం నాలుగు రోజుల్లోనే పాకిస్తాన్ నామరూపాలు లేకుండా చేసేంత సత్తా ఉన్న ఆయుధ సంపత్తి కలిగిన భారతదేశాన్ని పాకిస్తాన్ ఢీకొట్టడం సాధ్యమైన పని కాదని రక్షణ నిపుణులు అంటున్నారు. పాకిస్తాన్ ప్రయోగిస్తున్న మిషన్ విష్ణు చక్ర ఎక్కడికి అక్కడ కూల్చి వేస్తున్న విషయాన్ని పాకిస్తాన్ గమనించాలి. భారత్ ప్రతి కార్య చర్య పూర్తిస్థాయిలో అమలు చేస్తే పాకిస్తాన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. పాకిస్థాన్ ప్రాపకంలోని పిశాచగణాలపై ఆసేతు హిమాచలం ఎగసిపడుతున్న ఆగ్రహజ్వాలలనే మందుగుండ్లుగా మార్చి సరిహ ద్దులకు ఆవలి ఉగ్రవాద శిక్షణ శిబిరాలపై మన త్రివిధ దళాలు ప్రళయ భీకరంగా దండెత్తాయి. పహల్గాల పైశాచిక కాండలో ప్రాణాలొదిలిన పర్యాటకులకు ఆపరేషన్ సిందూర్ భారత ప్రభు త్వం, సాయుధ బలగాలు ఘనంగా నివాళి అర్పించాయి. పీవోకే లోనివే కాదు, పాకిస్థాన్ ప్రధాన భూభాగంలోని టెర్రరిస్టు ర్యాంపుల పైనా క్షిపణుల వర్షం. కురిపించడం" భారతావని అమేయ సైనిక బల పటిమకు నిదర్శనం.

భారతావని శాంతికాముకత్వాన్ని అలుసుగా తీసుకున్న పాకిస్థాన్- ముష్కర మూకలకు శిక్షణిస్తూ, అత్యాధునిక ఆయుధాలను సమకుర్చుతూ ఇండియాపై ప్రచ్ఛన్నయుద్ధం చేస్తోంది. మత ఛాందసత్వాన్ని రెచ్చగొట్టి స్థానిక యువతలో వేర్పాటువాద విషబీజాలు నాటడం, హింసాత్మక దాడులతో సామాజిక అశాంతిని రాజేయడం, భారత్ను అస్థిరపరచి కూర్చు కబళించడం... ఇవే పన్నాగాలతో దూర్తదేశం ఉగ్రవాదాన్ని జాతీయ విధానంగా మార్చుకుంది భారత్లో నెత్తుటేళ్లు పారించిన అనేక ఉగ్రదాడుల వెనక ప్రధాన కుట్రదారులైన మౌలానా మసూద్ అజార్, హఫీజ్ మహమ్మద్ సయీద్, జకీవుర్ రెహ్మాన్ లఖ్వీ, దావుద్ ఇబ్రహీం వంటివారిని ఇంటల్లుళ్లుగా సాకుతోంది. అదే క్రమంలో పాక్ సైన్యం, ఐఎస్ఐ ప్రేరణతోనే పహల్గాంలో ఉగ్రవాదులు హేయ నరమేదానికి పాల్పడ్డారన్నది వాస్తవం దానికి ప్రతిస్పందనగా 'ఆపరేషన్' సిందూర్తో'తో గర్జించిన భారత్- సామాన్య పౌరులకు ప్రమాదం వాటిల్లకుండా తన సార్వభౌమత్వానికి సవాలు విసురు తున్న ముష్కర మూకలపైనే మొన్న రాత్రి 3 విరుచుకుపడింది మెరుపు దాడులకు తగిన లక్ష్యాలను ఎంచుకోవడంలో, గురి తప్పకుండా వాటిని సర్వనాశనం చేయడంలో ప్రశంసనీయ విచక్షణను, అద్వితీయ ప్రజ్ఞను ప్రదర్శించింది.తన ప్రాదేశిక సమగ్రత, ప్రజాభద్రతల పరిరక్షణకు ఎటువంటి చర్యలైనా తీసుకునే హక్కే కాదు. అంతటి సత్తా ఇండియాకు ఉంది. కాబట్టి పహల్గాం బీభత్సకాండ పర్యవసానాలు యుద్ధానికి దారితీయకుండా జాగ్రత్త పడాల్సింది పాకిస్థానే అందుకుగాను అది ముష్కర మిన్నాగులకు పాలుపోయడం తక్షణం మానుకోవాలి. తన గడ్డ మీద రాచమర్యాదలు పొందుతున్న నరహంతక ఉగ్రవాదులను బేషరతుగా ఇండియాకు అప్పగించాలి. పాకిస్థాన్లో నలభై వరకు ఉగ్రవాద సంస్థలున్నాయని, ముప్పై నుంచి నలభై వేల మంది వరకు సుశిక్షిత సాయుధ ముష్కరులు సైతం తమ గడ్డపై స్వేచ్ఛావిహారం. చేస్తున్నారని గతంలో ఆ దేశ ప్రధాని ఇమ్రాన్కానే ఒప్పుకొన్నారు. ఉగ్రవాదులకు తాము దన్నుగా ఉన్నమాట వాస్తవమేనని ప్రస్తుత పాక్ రక్షణ మంత్రి ఖాజా అసిఫ్ సైతం అంగీకరించారు. ఇండియాపై ద్వేషంతో టెర్రరిస్టులను పెంచిపోషించిన పాకిస్థాన్- నేడు తానే ఉగ్రవాద భుజంగానికి బలవుతోంది. అప్పులు పెరిగిపోయి. విదేశ మారకద్రవ్య నిల్వలు అడుగంటిపోయి ఆర్థికంగా దివాలా తీసే స్థాయికి చేరింది

మింగ మెతుకు లేదు కానీ, మీసాలకు సంపెంగ నూనె అన్నట్లు పాకిస్థాన్ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారు. వారు అలాగే ఉగ్రవాదులను చంకనెక్కించుకుంటూ ఇండియాపై కయ్యానికి కాలుదువ్వితే. అంతిమంగా కోలుకోలేనంతగా దెబ్బతినేది పాకిస్థానే. మతాల పేరట విద్వేష భావనలను ఎగదోస్తున్న పాక్ సైన్యాధ్యక్షుడు ఆసీం మునీర్ తదితరులు తమ దుస్సాహసాలు తమ ప్రజలనే మరింతగా బాధిస్తాయని గుర్తించాలి. ఉగ్రవాద. ఎగుమతి కేంద్రంగా ప్రపంచ శాంతికి ప్రథమ శత్రువుగా పరిణమిస్తున్న పాక్ ఇప్పటికైనా తన పిదపబుద్ధులను విడనాడాలి కాదూ కూడదని మొండి మూర[illegible]ంగా ప్రవర్తిస్తే- స్వీయరక్షణకోసం భారత్ తీసుకునే దృఢ నిర్ణయాలకు వాటి పరిణామాలకు పాకిస్థానే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
డాక్టర్. వేదాంతం హరికుమార్
కాకతీయ విశ్వవిద్యాలయం

# నిజం × టిఆర్‌పి



ఒకపక్క మన భారత సేన కంటిమీద కునుకు లేకుండా మనకోసం మన రక్షణ కోసం పగలు రాత్రి కాపలా కాస్తుంటే... శత్రు దేశాల నుండి మనల్ని రక్షిస్తుంటే.. దానిని కూడా ఫేక్ మీడియా ఛానల్లు క్యాష్ చేసుకుంటున్నాయి, ఆపరేషన్ సిందూర్ లో ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేశామని మన భారతీయ సేన ఒకపక్క ప్రెస్ మీట్ లో చెబుతూ ఉంటే.. మరోపక్క కొన్ని మీడియా ఛానల్లో ఇండియా మొత్తం పాకిస్తాన్‌ని కబ్జా చేసిందని, పాకిస్తాన్ ప్రైమ్ మినిస్టర్ పారిపోయాడని.. మన సైన్యం 25 రాష్ట్రాలను ధ్వంసం చేసిందని.. ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు టిఆర్‌పి పెంచుకోవడానికి ఫేక్ న్యూస్‌ని టెలికాస్ట్ చేస్తున్నారు... సూత్రాల ఆధారంగా ఇలా తెలిసిందని.. పిఓకేని మొత్తం ఇండియా స్వాధీనం చేసుకుందని ఇంకొకరి ఛానల్ చెబుతుంది, ఇది వినడానికి మరే మన సైన్యం ఎంత గొప్ప పని చేసింది సాధించింది అని అనిపించొచ్చు కానీ ఇది నిజం కాదు సూత్రాల ఆధారంగా అని ఒక లైన్ పెట్టేసి ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు కథలు అల్లడం కరెక్ట్ కాదు.. ఇంకొందరైతే మన ఆర్మీ కదలికలను లైవ్‌గా చూపిస్తూ ఒక విధంగా మన సైన్యానికి నష్టం చేస్తూ... కదలికలను శత్రు దేశాలకు తెలిసేలా చూపిస్తున్నాయి.. ఇందుకు దేశ రక్షణ, భద్రతా దళాల కార్యకలాపాలకు సంబంధించిన వార్తల ప్రసారంపై కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఇటువంటి సున్నితమైన అంశాల ప్రత్యక్ష ప్రసారాలు, 'సన్నిహిత వర్గాల సమాచారం' అంటూ రాసే కథనాల విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మీడియా సంస్థలకు సూచించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అన్ని మీడియా ఛానెళ్లు, వార్తా సంస్థలు, సోషల్ మీడియా వినియోగదారులకు ఒక సలహా ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు గత నెలలో విడుదల చేసిన మార్గదర్శకాలను పునరుద్ఘాటించింది... ఈ హెచ్చరిక వలన ఈ మీడియా ఛానల్లో ఏమన్నా మార్పు వస్తుందా అంటే రాదేమో ఎందుకంటే వీరికి నిజ నిజాలతో పనిలేదు టిఆర్పి వస్తే చాలు ఎలాంటి హెడ్ లైన్స్ అయినా పెట్టేస్తారు దాని వలన ప్రజలు భయాందోళనలకు గురి అవుతారా లేదా దీని వలన మన దేశం వేరే దేశాలకు జవాబు ఇవ్వాల్సి వస్తుందా అని నా చానల్స్ ఆలోచించవు ఎందుకంటే 'సూత్రాల ఆధారంగా'అని ఒక లైన్ వాడేసి అది నిజం కూడా కావచ్చు అబద్ధం కూడా కావచ్చు అని అంటారు. కానీ మన దేశ ప్రతినిధులు వీటివల్ల అనేక సవాళ్లను ఎదురుక్కోవాల్సి వస్తుంది, ఉదాహరణకి ఒకరు మన దేశ ప్రతినిధిని ఇలా అడిగారు.. ఇది ఇండియా లోని హిందువులకు మరియు పాకిస్తానీ ముస్లింలకు మధ్య జరిగే వార్ అని? ఇంకొకరు మీరు పాకిస్తాన్ భూమిని ఆక్రమించుకోవడానికి ఇదంతా చేస్తున్నారా అని.... కానీ మన ప్రతినిధులు చాలా హుందాగా ఇది కేవలం పెహల్గం లో జరిగిన ఘటనకు పాకిస్తాన్ తీవ్రవాదులకు మా నుండి ఇచ్చిన జవాబు మాత్రమే మేము తీవ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడే వాళ్ళం అని జవాబు ఇస్తున్నారు.. ఈ మీడియా ఫేక్ న్యూస్ ల వల్ల జనం నిజం ఏంటో తెలుసుకోలేక పోతుంది.. మన సైన్యానికి కూడా ఈ న్యూస్ ల వల్ల అనేక ఆటంకాలు ఎదురవుతున్నా యి... ఇంకొందరైతే సోషల్ మీడియాలో వ్యూస్ కోసం మన ఆర్మీ ఎక్కడ కనిపిస్తే అక్కడ వీడియోలు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేస్తున్నారు ఇది కూడా ఒక రకంగా మనం మన శత్రువులకు హెల్ప్ చేస్తున్నట్టే.. అందుకే మన రక్షణ శాఖ ఎలాంటి ఆర్మీ మూమెంట్స్ రికార్డ్ చేయొద్దని ఫేక్ న్యూస్ ఏవి పెట్టొద్దని హెచ్చరిస్తుంది. మన ఆర్మీ ప్రెస్ మీట్ కోసం వేచి చూసి నిజానిజాలు తెలుసుకోవాలి కానీ మొత్తానికి సూత్రాల ఆధారంగా చెప్పే ఈ ఫేక్ మీడియా ఛానల్స్ కి దూరంగా ఉండాలి. యుద్ధాల్లో ప్రాణాలు పోతాయి ఇది వీడియో గేమ్ కాదు ఇష్టం వచ్చినట్టు ఫేక్ ఎడిటెడ్ సమాచారాలని నమ్మక ండి.. వైరల్ చేయకండి. ఇటువంటి సమయంలో పరస్పర విభేదాలు మాని మన ప్రభుత్వాలతో సహకరి ద్దాం.. మన సైన్యంతో సహకరిద్దాం..



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

## లాహోర్ బస్ టూర్...టు
# ఆపరేషన్ సిందూర్




మన భారతదేశ మంచితనానికి లాహోర్ బస్సు యాత్ర ఓ మచ్చుతునక. అద్భుతమైన రాజనీతిజ్ఞుడి గా సకల జనులూ సొంతం చేసుకునే నాటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి ఢిల్లీ నుంచి పాకిస్థాన్‌లోని లాహోర్‌కు బస్సులో ప్రయాణిం చారు. తద్వారా 1999లో ఉభయ దేశాల మధ్య రోడ్డు రవాణా సౌలభ్యాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా భారత సుహృద్భావాన్ని దునియా ముందుం చారు. నవాజ్ షరీఫ్ ఆ దేశ ప్రధానమంత్రిగా ఉన్నప్పటి ఆ సన్నివేశాలు శాశ్వత ప్రాతిపదికన శాంతి సామరస్యాలతో సరికొత్త అధ్యాయానికి నాంది పలకాల్సింది. ఎంతైనా పాక్ తోక వంకర కదా. అది బాగుపడదు. బాగుపడుతున్న మన దేశాన్ని ఓర్వదు. ఆత్మగల్ల మన దేశానికి హాని తలపెట్టని దురాలోచనల దినముండదు.

లాహోర్ బస్సు యాత్ర నాటి స్థితిగతులకు ఈ 2025కల్లా గడిచిన పాతికేళ్ళలో భిన్నమైన ఉత్కంఠ, ఉద్రిక్తతలకు ఉబలాటపడి ఆపరేషన్ సిందూర్ ను పాకిస్థాన్ ఏరికోరి మరీ మీదకు తెచ్చుకున్నది. భారత్ సహనానికి సుదీర్ఘ కాలం నుంచి పెడుతున్న పరీక్షల్లో 25 నిమిషాల ఫలితానికే ప్రాణం విలువ తెలిసొచ్చి విలవిలలాడింది. అక్కడి ఆటంకవాదుల మూలాలను మన సైన్యం మట్టుబెడితే, నిరాశా నిస్పృహలతో ఆ దాయాది మాత్రం మన దేశ అమాయక పౌరులను ఆపరేషన్ సిందూర్ అనంతరమూ బలి తీసుకుంది. దాని బుర్రలేని తనానికి ఇదో కొనసాగింపే. అందుకే...మనది మనకు కావాలే పీవోకే మన ప్రధానమంత్రి మొదలు సగటు పౌరుల ధ్యాసంతా భారతదేశ సమగ్రత, సార్వభౌమత్వంపైనే కేంద్రీకృతమైంది. మత ప్రాతిపదికన విభజించాలని, అంతర్గత అనైక్యత, చిచ్చు రగల్చాలనే పహల్గాం మారణహోమాన్ని పాకిస్థాన్ నూరిపోసింది. ఆపై మన ఐక్యతను చూసి నోరు తెరిచింది.

ఆ శత్రు దేశంలోని బలూచిస్థాన్ అనే అత్యంత పెద్ద రాష్ట్రం వెనుకబాటుతనంతో వేగలేక తిరగబడుతోంది. మనకంటే ఒక తేదీ ముందు స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఆ దేశం మొదటి పదేళ్ల నుంచే బలూచిస్థాన్ కు పరిష్కారం చూపుకోలేక అంతర్యుద్ధం బారిన పడింది. అలాంటి పాక్ మన దేశంలో అంతర్యుద్ధాన్ని కోరుకుంటోంది. మనమంతా కలిసి ఉండడం దానికి అనాదిగా మింగుడు పడడం లేదు. కేవలం భారత పౌరులైనందుకే కశ్మీర్ లో పర్యాటకులను కిరాతకంగా కాల్చిచంపిన ఉన్మాదానికి ఊతమిచ్చేలా ప్రవర్తిస్తోంది.

ఒకరకంగా చెప్పాలంటే ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్ కూ మంచే చేసింది. తన దేశంలోని వినాశకర శక్తులను అంతమొందించే పని తన వల్ల కానప్పుడు..ఆ పని పట్టిన భారత్ ఆ దేశానికీ మేలు చేసినట్లే లెక్క. శాంతిని నెలకొల్పే సైనిక చర్యే. తునాతునకలైన 9 టెర్రరిస్ట్ కేంద్రాలే కాకుండా, ఇంకా 25 వరకూ ఉగ్రవాద స్థావరాలు ఆ దేశంలో ఉన్నాయట. ఇది చాలు పాకిస్థాన్ పాపిష్టిదే అనడానికి! తన ప్రజలకు మేలు చేయకుండా, ఎంతసేపూ భారత్ కీడునే కాంక్షించే ఆ దేశ సౌజన్యపు ఆగడాలు, అకృత్యాలు, క్రూరత్వాలకు సమాధి కట్టాలి. ఇందుకు ప్రధాన ఉపాయంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీ.వో.కె-పాక్ ఆక్యుపైడ్ కశ్మీర్)ను మన దేశం కశ్మీర్ లో తిరిగి కలిపేయాలి. నేటికీ ఆ అసెంబ్లీలో ఖాళీగా ఉన్న పీవోకే బాపతు 24 నియోజకవర్గాల స్థానాలను భర్తీ చేయాలి. చెంప దెబ్బ-గోడ దెబ్బ బతుకులైన పీవోకేలోని 50 లక్షల ప్రజల మనోభావాల మేరకు వారిని భారతీయులుగా పురోగమింపజే యాలి. భరతమాత నుదుటన తిలకమే మన కశ్మీరం. అలాంటి కశ్మీరంలోని పీవోకే మాటున పాకిస్థాన్, దాని ప్రాయోజిత ఉగ్రవాదుల వికృత ఆటలకు స్వస్తి పలకాలి. జైషే మహ్మద్ బాధ్యుడు మౌలానా మసూద్ అజర్ ఆపరేషన్ సిందూర్ తో బాగానే మూల్యం చెల్లించుకున్నాడు. మన పార్లమెంటుపై 2001లో, ముంబైలో 2008లో, పఠాన్ కోట్ లో 2016లో, పుల్వామాలో 2019 దాడుల పాపాల్లో భాగమైన ఐరాస భద్రతా మండలి ప్రకటిత అంతర్జాతీయ ఉగ్రవాది అయిన అతడి కుటుంబీకులూ ఆపరేషన్ సిందూర్ ధాటికి శకలాల్లో శవాలైతేగానీ తత్వం బోధపడలేదు. ఇప్పుడూ ప్రతీకారేచ్ఛతో రగులుతున్న అతగాడిని మన దేశంలో 1995లో కటకటాల వెనక్కి తోసేశారు. కానీ, నేపాల్ నుంచి వస్తున్న విమానాన్ని 1999లో హైజాక్ చేసి అజర్ ను తోటి టెర్రరిస్టులు విడిపించుకున్నారు. అటువంటి ఉన్మాదుల అంతానికి, ఆ ఉనికి జీరోకు పీవోకే స్వాధీనం సమీప లక్ష్యాల్లో ఉండాలి. ఎలాగూ విశ్వ వేదికలపై పాకిస్థాన్ ఏకాకి అయింది. కాబట్టి ఇదే సరైన సమయం. ఇంకా ఎన్నెన్ని కొత్త తరాలు అంతులేని ఈ ఆటవిక చేష్టలు, సంఘర్షణలతో దుఃఖపడాలి? ఓ వైపు విస్తరణ కాంక్ష వీడని సరిహద్దు దేశం చైనా. మరోవంక ఈ దాయాది. ఆ రెంటితోపాటు మరో 5 బార్డర్ దేశాలు. మొత్తం ఏడు సరిహద్దు దేశాలు, పాక్ తో సత్వర సరిహద్దుల్లో గల పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్మూ కశ్మీర్ భూభాగాలను కంటికి రెప్పలా నిరంతరం కాపాడుకునే మన దేశానికి...అంతా రివర్సులో తేలు కుట్టిన దొంగల బాపతు బలహీన రాజకీయవేత్తల అస్థిరత, సైన్యం పెత్తనాల ఈ పాకిస్థాన్ తో ఎపుడూ పొంచి ఉండే అత్యంత అపాయకరమైన పీడ వీలైనంత త్వరగా గతం కావాలి.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు,
హైదరాబాద్, 9440850384


# బానిస సంకెళ్లకు ఉరితాళ్లు - విప్లవ సింహాల గర్జన

**సిపాయిల తిరుగుబాటు మే 10న సందర్భంగా పీడిత ప్రజల పెను తిరుగుబాటు - స్వాతంత్ర్య సమర శంఖారావం**

మొబైల్ ఫోన్లు లేని, వాట్సప్ జాడ లేని, ఇంటర్నెట్ ఊహకు కూడా అందని రోజుల్లో మీరట్ నుండి ఢిల్లీ వరకు ఒక మహా విప్లవం ఉప్పెనలా ఎగసింది. దుర్మార్గపు పాలకుల మోసాలు, నిరంకుశ దౌర్జన్యాలు, కుట్రపూరిత పన్నాగాలపై విసిగి వేసారిపోయిన ప్రజల గుండెల్లో విప్లవ జ్వాల రగిలింది! నరాలలో ప్రళయ రుధిరం ఉప్పొంగింది. బానిస సంకెళ్లను తెంచివేయడానికి, స్వేచ్ఛా భారతావనిని ఆవిష్కరించడానికి సింహాల్లా గర్జించడానికి ఎదురు చూస్తున్న ప్రజల ఆరాటమే ఈ పోరాటానికి పిలుపునిచ్చింది. ఆ పిలుపే 1857 మే 10న భగ్గుమన్న సిపాయిల తిరుగుబాటు. ఇది కేవలం తిరుగుబాటు కాదు. భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సమర శంఖారావం.

**దుర్మార్గపు పాలనకు చరమగీతం - రగిలిన ఆగ్రహ జ్వాలలు:**

1857 రాకమునుపే దుష్ట వలస పాలకులు ప్రజల ఆర్తనాదాలు, సమస్యలు పట్టించుకోకుండా కేవలం భారత సంపదను దోచుకోవ డానికి కంకణం కట్టుకున్నారు. కంపెనీ స్థానిక ప్రజల జీవనాధా రమైన కుల వృత్తులను తుంగలో తొక్కారు. మన ఎగుమతులపై పిడుగులాంటి పన్నులు, వారి దిగుమతులపై నామమాత్రపు పన్నులు విధించి దేశ ఆర్థిక వ్యవస్థను ఛిద్రం చేశారు. వారి దుర్మార్గపు ఆర్థిక దోపిడీ, వివక్షాపూరిత పాలన, నూతన భూస్వామ్య విధానాలు ప్రజలకు నరకం చూపించాయి. వారి దుర్నీతి సామాజిక విధానాలు కూడా విప్లవానికి ఊపిరి పోశాయి. పాశ్చాత్య విద్య, సంస్కృతిని బలవంతంగా రుద్దే ప్రయత్నం ప్రజలలో తీవ్రమైన పరాయీకరణ భావనను కలిగించింది. సాంస్కృతిక విధ్వంసం సృష్టించారు. మత మార్పిడు లను ప్రోత్సహించారు. విదేశీ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలిపశువులుగా వాడుకున్నారు. వేతనాలలో అమానవీయమైన తారతమ్యం చూపారు. భారతీయ సైనికులకు కనీసం పెన్షన్ కూడా లేదు. తమ హక్కులన్నీ కాలరాస్తున్నారన్న భావన పెరిగి ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఊగిపోయారు. అన్నింటా భారతీయుల కంటే యూరోపియన్లకే పట్టం కట్టారు. భూస్వామ్య దళారీలకు ఊడిగం చేస్తూ సామాన్య రైతుల ప్రయోజనాలను, హక్కులను కాలితో తన్నారు. రైతులను వారి భూముల నుండి తరిమికొట్టారు. దీంతో ప్రజలు తమ భూమిని, వనరులపై తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించాలని ఉగ్రంగా పోరాడటానికి సిద్ధమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ రాబందులను నియమించి, దళారులు, వడ్డీ వ్యాపారులను పెంచి పోషించి, గిరిజన భూములను ఆక్రమించి, స్వదేశీ పరిశ్రమ లను నేలమట్టం చేసి, పన్నుల భారం మోపి భూస్వాములకు, దళారులకే లాభం చేకూర్చే ఈస్టిండియా కంపెనీ దుర్మార్గపు పాలనను సహించలేక పాలనకు వ్యతిరేకంగా రైతులు, శ్రామికులు, గిరిజనులు, అన్ని మతాల ప్రజలు ఐక్యంగా తమను తాము కాపాడుకోవడానికి సాయుధ తిరుగుబాటుకు దిగారు. సన్యాసి తిరుగుబాటు, వెల్లూరు తిరుగుబాటు, పైకా తిరుగుబాటు వంటివి ఆ పోరాట స్ఫూర్తికి ప్రతీకలు. ఈ ప్రతిఘటన ఉద్యమాలలో వేర్వేరు ఆవేదనలు ఉన్నప్పటికీ వారందరిదీ ఒకే లక్ష్యం - బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సమాధి కట్టడం. కంపెనీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి వారిని మరింతగా ప్రేరేపించాయి. కానీ 1857లో జరిగిన తిరుగుబాటు భారతదేశంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ఒక ప్రత్యేక అధ్యాయం. అది తాత్కాలికంగా విఫలమైనా స్వాతంత్ర్య పోరాటానికి తిరుగులేని పునాదులు వేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది - అదే మొదటి స్వాతంత్ర్య సంగ్రామం లేదా సిపాయిల విప్లవం.




**ఎన్‌ఫీల్డ్ తూటా - విప్లవానికి తక్షణ కారణం:**

వారి దుర్మార్గపు రాజ్య సంక్రమణ విధానం ఎన్నో స్వతంత్ర రాజ్యాలను కంపెనీ కబంధ హస్తాల్లోకి నెట్టింది. సతారా, నాగ్‌పూర్, ఝాన్సీ వంటి బలమైన రాజ్యాలు కూడా వారి దురాక్రమణకు గురయ్యాయి. అంతేకాదు, జైత్‌పూర్, సంబల్‌పూర్, ఉదయపూర్ రాజ్యాలను కూడా నిర్దాక్షిణ్యంగా విలీనం చేశారు. 1850లో హిందూ వారసత్వ చట్టాన్ని మార్చి, మతం మారిన వారికి కూడా ఆస్తులపై హక్కు కల్పించడం ప్రజల ఆగ్రహానికి హద్దులు లేకుండా చేసింది. భారతీయులందరినీ క్రైస్తవ మతంలోకి మార్చాలని దుష్ట ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రజలు విశ్వసించారు. పాశ్చాత్య విద్యా విధానాన్ని బలవంతంగా రుద్దడం హిందువులతో పాటు ముస్లింల పవిత్ర ధర్మాన్ని అవమానించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, జమీందార్లు భూమిపై విధించిన భరించలేని పన్నులతో, కంపెనీ అనుసరించిన రక్తపిపాసి ఆదాయ సేకరణ పద్ధతులతో కుమిలిపోయారు. రుణదాతల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయారు. పారిశ్రామిక విప్లవం పేరిట బ్రిటీష్ తయారీ వస్తువులు మన దేశాన్ని ముంచెత్తాయి. ఇది మన స్వదేశీ పరిశ్రమలను, ముఖ్యంగా వస్త్ర పరిశ్రమను పూర్తిగా నాశనం చేసింది. మన కళాకారులు బ్రిటన్‌లో యంత్రాలతో తయారైన చౌకబారు వస్తువులతో పోటీ పడలేక వీధిన పడ్డారు. బ్రిటీష్ దళాలలో 87% మంది భారతీయ సిపాయిలు ఉన్నప్పటికీ వారిని బ్రిటిష్ సైనికుల కంటే హీనంగా చూశారు. సిపాయిల వేతనాలలో అన్యాయమైన వ్యత్యాసం చూపారు. ఈ తిరుగుబాటుకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, మతపరమైన కారణాలెన్నో ఉన్నప్పటికీ తక్షణ కారణం మాత్రం బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ 'ఎన్ఫీల్డ్ రైఫిల్స్' అనే మారణాయుధంలో ఆవు, పంది కొవ్వు పూసిన తూటాలను వాడటం. ఆ తూటాలను నోటితో కొరికి రైఫిళ్లలో నింపాల్సి రావడంతో హిందూ, ముస్లిం సిపాయిలు వాటిని వాడటానికి నిప్పులు చెరిగేలా నిరాకరించారు.

**మీరట్ నుండి ఢిల్లీకి - విప్లవ యాత్ర:**

1857 మార్చి 29న బారక్‌పూర్‌లోని సైనిక స్థావరంలో మంగళ్ పాండే అనే ధీరుడు ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించడానికి నిరాకరించి తనపై అధికారిపై తిరుగుబాటు బావుటా ఎగరవేశాడు. మిగిలిన సిపాయిలు అతని ధైర్యానికి స్ఫూర్తి పొంది అతనికి అండగా నిలిచారు. కానీ, దుర్మార్గులైన బ్రిటిష్ పాలకులు అతనిని ఏప్రిల్ 8, 1857న ఉరితీశారు. 1857 మే 9న మీరట్‌లో ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించేందుకు నిరాకరించిన 85 మంది సిపాయిల యూనిఫాంను తీసివేసి వారికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ అన్యాయానికి ఆగ్రహించిన సిపాయిలు 1857 మే 10న బ్రిటిష్ దుర్మార్గులకు వ్యతిరేకంగా మీరట్‌లో విప్లవం ప్రారంభించి ఢిల్లీ వైపు కదం తొక్కారు. 1857 మే 11న ఢిల్లీ ఎర్రకోటకు చేరుకొని బహదూర్ షాను చక్రవర్తిగా ప్రకటించారు.

**వీరనారుల పోరాటం - ధీరుల త్యాగం:**

లక్నోలో 1857 జూన్ 4న బేగం హజ్రత్ మహల్, 1857 జూన్ 5న కాన్పూర్‌లో నానా సాహెబ్, ఝాన్సీ, గ్వాలియర్లలో లక్ష్మీ బాయి మరియు తాంతియాతోపే, బరేలీలో ఖాన్ బహదూర్ ఖాన్, అలహాబాద్, బనారస్‌లలో మౌల్వీ లియాకత్ అలీ, బీహార్‌లో కున్వర్ సింగ్ నాయకత్వాలలో స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగింది. ఎందరో వీరులు ప్రాణాలర్పించారు. మరెందరో జైళ్ల పాలయ్యారు. ఈ విప్లవం సుమారు సంవత్సరానికి పైగా కొనసాగింది. ఈ పోరాటంలో ముఖ్యంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో రైతులు కంపెనీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటులో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తొలి ప్రతిఘటనలో దేవీ చౌధురాణి పాల్గొనడం మహిళా శక్తిని చాటిచెబుతుంది.

**విఫలమైనా వెలిగించిన జ్యోతి - స్వాతంత్ర్యానికి తొలి అడుగు:**

పై తరగతి, మధ్యతరగతి పిరికి మేధావులు ఈ విప్లవానికి వెన్నుదన్నుగా నిలబడలేదు. హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్, కాశ్మీర్ వంటి పెద్ద రాచరిక రాష్ట్రాలు, చిన్న రాజపుతానా రాజ్యాలు ఈ పోరాటంలో భాగం పంచుకోలేదు. దక్షిణ ప్రాంతాలు దీనికి దూరంగా ఉండిపోయాయి. సమర్థవంతమైన నాయకత్వం కొరవ డింది. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోయాయి. చదువుకున్న బానిస మనస్తత్వం గల భారతీయులు ఈ విప్లవం భూస్వామ్య స్వభావానికి భయపడి ప్రేక్షక పాత్ర పోషించారు. బ్రిటిష్ కంపెనీ సైన్యం ఉపయోగించిన ఆధునిక మారణాయుధాల ముందు మన సిపాయిల సంప్రదాయ ఆయుధాలు ఏ మాత్రం నిలువలేకపో యాయి. చక్రవర్తిగా ప్రకటించిన బహుదూర్ షా పోరాడే శక్తి లేని వృద్ధుడు కావడం కూడా ఒక కారణం. అనేక కారణాల వల్ల ఈ విప్లవం 1858 మధ్యలో దారుణంగా అణచివేయబడింది.

**అనంతర పరిణామాలు - స్వేచ్ఛా భారతం వైపు పయనం:**

ఈ విప్లవం భారత చరిత్రలో ఒక పెను తుఫానును సృష్టించింది. బ్రిటిషు దుర్మార్గులు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసి విక్టోరియా రాణి పాలనను ప్రవేశపెట్టారు. భారత పాలనా వ్యవహారాలను పర్యవేక్షించడానికి వైస్రాయిని నియమించారు. ఈ విధంగా భారతదేశం బ్రిటిషు సామ్రాజ్యవాదంలోకి కూరుకు పోయింది. కానీ, ఈ విప్లవం రగిలించిన స్వాతంత్ర్య కాంక్ష ఎందరో యోధులకు స్ఫూర్తినిచ్చింది. వారి పోరాట ఫలితంగానే 1947 ఆగస్ట్ 15న మనకు స్వేచ్ఛ లభించింది. ఆనాటి విప్లవకారుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది! జై హింద్!



కింజరాపు అమరావతి
82472 86357

## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి



**గద్వాల నడిగడ్డ, మే 9 (జనం సాక్షి) :** జూన్ నెల 14 న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో రాజీ కాదగిన వీలైననీ ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత పేర్కొన్నారు. శుక్రవారం గద్వాల కోర్టు ఆవరణలో జాతీయ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. ఠాణాలు కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరగకుండా ఇరు వర్గాలను సమన్వయపరచి క్రిమినల్ కేసుల రాజీ విషయమై వారిలో అవగాహన కలిగించాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమని కక్షి దారులు కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు సమయం వృధా కాకుండా రాజీద్ ద్వారా కేసులు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ వి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ ఎన్.వి.హెచ్ పూజిత,ఏ.పి.పి సంజన, డీఎస్పీ మొగులయ్య, సి.ఐ లు, స్టేషన్ ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి దందా

**• వెంచర్లలోకి మట్టి రవాణా**

**మోమిన్‌పేట, మే 9 (జనం సాక్షి) :** మోమినిపేట మండల పరిధిలోని కేసారం గ్రామ సమీపంలోని జే బి. ఇన్ఫ్రా వెంచర్ లోకి మట్టిని దర్జాగా ఎలాంటి అనుమతులు లేకుండాఅక్రమంగా తరలిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతు పట్టాభూమి సర్వే నంబర్ 225 లో నుండి దర్జాగా టిప్పర్ల ద్వారా మట్టిని జేబీ ఇన్ఫ్రా వెంచర్‌లోకి తరలిస్తున్నారు. మోమిన్ పేట నుండి తాండూర్ వెళ్లే రోడ్డుకు సమీపంలో ఉన్నటువంటి గుట్టలను యంత్ర పరికరాల సహాయంతో టిప్పర్ల ద్వారా వెంచర్ లోని అంతర్గతరోడ్లకు ఎర్ర మట్టిని తరలిస్తున్నారు.. గ్రామంలో సుమారు 6 నుంచి 7 వెంచర్లు వెలిశాయి.ఇట్టి విషయమై వెంచర్ సూపర్వైజర్ ను ప్రశ్నిస్తే రెండు ట్రిప్పులు అయితేసరిపోతాది అన్న అని నిర్లక్ష్యంగా సమాధానం దాటవేస్తున్నారు. మైనింగ్ శాఖ నుండి ఏమైనా అనుమతులు ఉన్నాయా అని అడిగితే లేదు. అని సమాధానం చెప్పి దాటవేశారు. మండల పరిధిలోని కేసారం పల్లి దేవరంపల్లి, చీమలదరి రావులపల్లి మేక వనం పల్లి మోమినిపేట కొత్త కోల్ కుంద ఎంకతల గోవిందా పూర్ చక్రంపల్లి, టేకులపల్లి గ్రామాల్లో పుట్టగొడుగుల వెలుస్తున్న వెంచర్లకు అడ్డగోలుగా గుట్టలను తవ్వి



వెంచర్లుగా మారుస్తున్నారు. ఎవరైనా ఏమైనా అడిగితే అధికార పార్టీకి చెందిన నాయకులదనీ సమాధానం చెబుతున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టలను నేలమట్టం చేస్తున్నారు. అలాగే గోవిందా పూర్ గ్రామంలో హైదరాబాద్ కు చెందిన ఒక వ్యక్తి ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వము నుంచి నిర్మించిన చెక్ డ్యాం మధ్య నుండిమధ్య నుండి దర్జాగా వారి పొలం వరకు వెళ్లడానికి రోడ్డు వేశారు.చుట్టుపక్కల వారు రైతుల అడిగితే అందరికీ పోవడానికి రోడ్డు ఉపయోగపడుతుందని సమాధానం చెబుతున్నారు. అలాగే గత 15 రోజుల క్రితం ఎన్కతల గ్రామంలో హైదరాబాదు నగరానికి చెందిన ఒక వ్యక్తి చిన్న చెరువు సమీపంలోని శిఖం భూమిని కబ్జా చేసిన సంగతి పాఠకులకు తెలిసినదే. గ్రామస్తులు స్పీకర్ దృష్టికి తీసుకు వెళ్ళితే ఇరిగేషన్ శాఖ రెవెన్యూ శాఖ సిబ్బంది సహాయంతో కబ్జా చేసిన శిఖం భూమినీ కబ్జా నుంచి విడదీశారు.ఏది ఏమైనా మోమినిపేట మండల పరిధిలో గుట్టలను జెసిబి ల ద్వారా వెంచర్లకు మట్టిని తరలిస్తున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మండల పరిధిలో మట్టి దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది .అయినా అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం విచారకర మనీ పలువురు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు జిల్లా అధికారులు స్పందించి మట్టి దందాను అరికట్టితే గాని గుట్టలు గుట్టలుగానే మిగిలి నేటి తరానికి చూడడానికి గుట్టలు కనిపిస్తాయి. లేనిచో గుట్టలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని చెప్పక తప్పదు. ఈ విషయమై స్థానిక ఉప తహసిల్దార్ సురేష్ ను వివరణ కోరగా అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని మండల పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మట్టి తరలిస్తున్న సమాచారం తమ దృష్టికి తీసుకు వస్తే అట్టివ్యక్తులపై చట్టపరమైన చర్యలను తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

# మైనారిటీ ప్రజల హక్కుల పరిరక్షణ అభివృద్ధికి కృషి

**• మైనారిటీ మండల ఇంచార్జి అక్బర్ బాబా**

**తాండూరు, మే 9 (జనంసాక్షి) :** మైనారిటీ ప్రజల హక్కుల పరిరక్షణ, అభివృద్ధికి కృషి చేస్తానని మైనారిటీ మండల ఇంచార్జి అక్బర్ బాబా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీ హక్కుల పోరాటానికి సంబంధించిన కార్యక్రమాలు అనేకమందిని ఆకర్షిస్తున్నాయి. శుక్రవారం యాలాల మండల కేంద్రంలో తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహాబ్ ఆధ్వర్యంలో జరిగిన యాలాల మండల కమిటీ ఎన్నికలు ప్రత్యేకంగా ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి.ఈ కార్యక్రమంలో మైనారిటీ సంఘాలు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొని, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో పాటు, కమిటీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికలలో ఏకగ్రీవంగా మండల ఇంచార్జిగా అక్బర్ బాబాను ఎన్నిక చేశారు. ఆయన మైనారిటీ హక్కుల కోసం చేసిన కృషి, అనుభవం మరియు నాయకత్వం కారణంగా ఈ పదవికి ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా అక్బర్ బాబా మాట్లాడుతూ, మా కమిటీ ద్వారా మైనారిటీ ప్రజల హక్కుల పరిరక్షణ మరియు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మొహమ్మద్ అహ్మద్ ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా మైనారిటీలు తమ హక్కులను తెలుసుకుని, వాటి కోసం పోరాటం చేయడానికి



ప్రోత్సహించబడతారు. కమిటీ యాలాల మండలంలోని మైనారిటీ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు.అబ్దుల్ వాహాబ్ నాయకత్వం ఆయన నాయకత్వంలో జరిగిన ఈ ఎన్నికలు మైనారిటీ హక్కుల పోరాటానికి ఒక మైలురాయిగా మారనున్నాయి. ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతుతో ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. మేము ప్రతి మైనారిటీ వ్యక్తి హక్కుల కోసం పోరాడుతామని నమ్మకం వ్యక్తం చేశారు. నూతన నియమితులైన కమిటీ సభ్యులు మండల ఇంచార్జిగా అక్బర్ బాబా, అధ్యక్షులు గా మొహమ్మద్ అహ్మద్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా మెహరాజ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వాసీద్ ఖాన్, సభ్యులు, అబ్దుల్ రజాక్, అబ్దుల్ జబ్బార్, మొహమ్మద్ మౌలానా తాండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ జలీల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సమాజానికి సేవ చేయాలని, మైనారిటీ ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అనేక మైనారిటీ సంఘాల ప్రతినిధులు, యువత, మరియు స్థానిక ప్రజల సందేశాలు, అభిప్రాయాలు అందించారు, వారి అనుభవాలను పంచుకున్నారు.

**భవిష్యత్తు ప్రణాళికలు...**

ఈ ఎన్నికల అనంతరం యాలాల మండల కమిటీ కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ముఖ్యంగా, మైనారిటీ ప్రజల సమస్యలు, విద్య, ఆరోగ్య, మరియు ఆర్థిక భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.యాలాల మండల కేంద్రంలో జరిగిన ఈ కమిటీ ఎన్నికలు మైనారిటీ హక్కుల పోరాటానికి కొత్త దిశను నిర్దేశించనున్నాయి. అక్బర్ బాబా, మొహమ్మద్ అహ్మద్ ల వంటి నాయకులు కృషి ద్వారా, మైనారిటీ ప్రజల హక్కుల పరిరక్షణ మరియు అభివృద్ధి కోసం ముందుకు సాగుతారని ఆశిస్తూ, ఈ కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, తాండూర్ నియోజకవర్గం అధ్యక్షులు సమీయొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీయొద్దీన్, ఉపాధ్యక్షులు వాజీద్ మియా, తాండూర్ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ సాధిక్, ఉపాధ్యక్షులు వాసే పాల్గొన్నారు.

## మూడు కేసుల్లో 3.315 కేజీల గంజాయి పట్టివేత

**• మూడు బైకుల స్వాధీనం, ముగ్గురి అరెస్ట్**



**సంగారెడ్డి ప్రతినిధి, మే 9 (జనం సాక్షి) :** సంగారెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదు చేసి, 3.315 కేజీల గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులను మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. 1.500 కేజీల గంజాయి కేసులో ఎస్సార్ నగర్ కు చెందిన సందీప్ ను అరెస్ట్ చేసి అతడి వద్దన ఉన్న స్కూటీని సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బీరం కొండకు చెందిన సాయికుమార్, శ్రీకాంత్‌ల వద్ద 1.200 కేజీల గంజాయిని పట్టుకొని వారి వద్ద ఉన్న బైకును రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో 615 గ్రాముల గంజాయిని పట్టుకొని అతడి వద్ద ఉన్నటువంటి బైకును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు కేసుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి సంగారెడ్డి పోలీసులకు గంజాయితోపాటు అప్పగించారు. గంజాయి పట్టుకున్న దాడుల్లో వీణారెడ్డి బి. గాంధీ సిఐ అనిల్, యాదయ్య, ఎస్సైలు ప్రహ్లాద్, కరీం, యాదయ్య, గోపాల్ ,రామారావు, ఉమా, మల్కయ్య కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. మూడు చోట్ల గంజాయిని పట్టుకున్న సంగారెడ్డి ఎక్సైజ్ శాఖ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ హరి కిషన్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

## 150 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**మక్తల్, మే 9 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలో రూ.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 150పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. మక్తల్ పట్టణ శివారులోని పంప్ హౌస్ వద్ద జరుగుతున్న ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన ఏఈ సాయి, కాంట్రాక్టర్ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఆసుపత్రి భవన నిర్మాణ నమూనాను పరిశీలించి నిర్మాణపనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన చేపట్టి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. నిర్ణీత సమయంలోగా నిర్మాణ పనులను పూర్తి చేసి వైద్య సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకురావలసిందిగా అధికారులను కాంట్రాక్టర్ ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంబడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, డైరెక్టర్లు పసుల రంజిత్ రెడ్డి, సాలంబిన్ ఉమర్ బ్రావి, అంజి, కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ కుమార్, కోళ్ల వెంకటేష్, బోయ రవికుమార్, కావలి తాయప్ప, బోయ వెంకటేష్, కట్ట వెంకటేష్, సిఎన్.మూర్తి, వాకిటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సేవలు అమోఘం

**• జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**జడ్చర్ల మే 9 (జనం సాక్షి) :** అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురు చూసే వారికి సహాయం అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అమోఘమని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్, స్వచ్ఛంద సేవకులు, తలసేమియా బాధితుల సమావేశానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా హాజరై తలసేమియాకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. నోబుల్ అవార్డు గ్రహీత జాన్ హెన్రీ డ్యూనాంట్ గొప్ప ఆశయంతో స్థాపించిన రెడ్ క్రాస్ ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థంగా సేవలు అందిస్తూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. యుద్ధ భూమిలో గాయపడిన క్షతగాత్రులకు, ప్రకృతి వైపరీత్యాల్లో, కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇబ్బందుల్లో ఉన్న వారికి వైద్య, ఆరోగ్య సేవలను అందించడంలో రెడ్ క్రాస్ చురుకైన పాత్ర పోషించడం గర్వించదగిన విషయమన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో రెడ్ క్రాస్ అందిస్తున్నసేవలను అభినందించారు. రెడ్ క్రాస్ సేవలను మరింతగా విస్తృతం చేయాలని సూచించారు. తలసేమియా బాధితులకు స్థానిక వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. అదనపు జిల్లా కలెక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో రెడ్ క్రాస్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డాక్టర్ శామ్యూల్, కోశాధికారి జగపతి రావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లయన్ జి. రమణయ్య, జిల్లా సభ్యులు డాక్టర్ శశి కాంత్, తిరుపతి రెడ్డి, యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త లు బాబుల్ రెడ్డి, అశ్విని చంద్రశేఖర్, మేనేజర్ ఏ .నరసింహా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ గృహ పథకం



**• జిల్లా గృహ నిర్మాణాధికారి చలపతిరావు**

**న్యాల్‌కల్, మే 9 (జనం సాక్షి) :** ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ఇందిరమ్మ గృహ పథకం"లో ఇండ్లను నిర్మించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా జిల్లా గృహ నిర్మాణశాఖ సిద్ధంగా ఉందని, ఈ మేరకు జిల్లాలో 1308 ఇండ్లను మంజూరు చేయగా.. 556 ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఈ పాటికే "ఇందిరమ్మ గృహ పథకం" లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ: లక్ష చొప్పున 102 గురి లబ్ధిదారులకు రూ:1.20 కోట్లను అందజేయడం జరిగిందని సంగారెడ్డి జిల్లా గృహ నిర్మాణ అధికారి చలపతిరావు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన న్యాల్ కల్ లో కొనసాగుతున్న ఇండ్ల నిర్మాణాలను జిల్లా గృహ నిర్మాణ ఇంజనీరింగ్ అధికారి సీ.మాధవ రెడ్డితో కలిసి పరిశీలించారు.

ఎలాంటి అపోహాలకు లోనవ్వకుండా ఇండ్లను నిర్మించుకోవాలని, నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారులకు తప్పనిసరిగా.. విడతలవారీగా అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు తప్పనిసరిగా 400 - 600 స్క్వేర్ ఫీట్ లోనే నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీ అర్హులను ఎంపిక చేయాదని, లబ్ధిదారుల ఎంపిక కేవలం ప్రత్యేక అధికారులు మాత్రమే ఎంపిక చేస్తారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, అధికార పార్టీ శ్రేణులు శ్రీనివాస్, భద్రుస్వామి, సురేష్, తదితరులు ఉన్నారు.

# ప్రతాప్‌సింగ్ అందరికీ అదర్శం

**• ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి**
**• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూర్, మే 9 (జనంసాక్షి) :** పట్టణంలో మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా పట్టణంలోని కాళికాదేవి మందిరం నుండి ప్రధాన వీధుల మీదుగా కాన్జాపూర్ గేట్ సమీపంలోని మహారాణా ప్రతాప్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జయంతి వేడుకలలో ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మహారాణ ప్రతాప్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం వారి సమక్షంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఛీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మొగులులను గడగడలాడించిన మహారాణా ప్రతాప్ సింగ్ చరిత్ర అందరికీ ఆదర్శనీయమని రాజ్ పుత్రులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ధైర్య సాహసాలతో అనాడు మొగుల్ సామ్రాజ్యాన్ని ఎదురెళ్లి పోరాడిన యోధుడు మహారాణా ప్రతాప్ సింగ్ అని కొనియాడారు. రాజ్ పుత్ సంఘ



ప్రతినిధుల కోరిక మేరకు గతంలోని ఇందిరానగర్ లోస్థలాన్ని కేటాయించడం జరిగిందని వారి సంఘ అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు సమసమాజ స్థాపన కోసం పోరాడిన మహా యోధులని స్వరాజ్య స్థాపన కోసం సరిపోను సైన్యం లేకపోయినా గిరిల్ల యుద్ధం చేసి గెలిచిన మహనీయులని కొనియాడారు.రాజ్ పుత్ సమాజాభివృద్ధికి మహారాణా ప్రతాప్ భవన్ నిర్మాణానికి రూపాయలు 20 లక్షలు, 500 గజాల స్థలాన్ని మంజూరు చేస్తామని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలలో కూడా అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, మాజీ బీసీ కమిషన్ నెంబర్ శుభప్రద పటేల్, మాజీ చైర్పర్సన్ సునీత సంపత్, హిందూ విశ్వాసమితి ప్రధాన కార్యదర్శి నర్సింలు, బషీరాబాద్ మాజీ ఎంపీపీ కరుణ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్,మాజీ కౌన్సిలర్లు సాహూ శ్రీలత, నీరజ బాల్రెడ్డి, ప్రభాకర్ గౌడ్, రాము, రాజ్ పుత్ సమాజ సమాజ గౌరవ అధ్యక్షులు సుభాష్ సింగ్, మాజీ అధ్యక్షులు ఠాకూర్ సూరజ్ సింగ్, జగదీశ్వర్ సింగ్, రఘువీర్ సింగ్, శీతల్ సింగ్, ఠాకూర్ రమేష్ సింగ్, మహేష్ సింగ్ ఠాకూర్, వివిధ కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు బషీరాబాద్ గంజిపల్లి, ఎరాన్ పల్లి, దౌల్తాబాద్, కొడంగల్, కర్ణాటక ప్రాంతానికి చెందిన రాజోలి, లింగంపల్లి వీర్నపల్లి తదితర ప్రాంతాలకు రాజ్ పుత్ సమాజ సభ్యులు, రాజపుత్ సమాజం అధ్యక్షులు దిలీప్ సింగ్ ఠాకూర్ (హై కోర్ట్ అడ్వకేట్ ) ఉపాధ్యక్షులు గంజిపల్లి ఉమేష్ సింగ్, వెంకట్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా శివానంద్ సింగ్, కార్యదర్శి బాలాజీ సింగ్, కోశాధికారి ప్రతాప్ సింగ్, రాజ్ పుత్ మహిళా సంఘం విభాగం అధ్యక్షులు నికిత ఠాకూర్, పల్లవి ఠాకూర్, దీపిక,కవిత, సుమన్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో ముగ్గురు కార్మికుల దుర్ఘటన బాధాకారం



**• బాధిత కుటుంబాలకు పరిహారం**
**• మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**హైదరాబాద్ సిటీ, మే 9 (జనంసాక్షి) :** జవహర్‌నగర్‌లో జరిగిన విషాదకర ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి విచారం వ్యక్తం చేసారు.జవహర్‌నగర్‌లో జరిగిన విషాద ఘటనపై శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శానిటేషన్అధికారులు, రాంకీ ప్రాజెక్టు యాజమాన్యంతో సమావేశమై సమీక్షించారు.

ఈ సందర్భంగా రాంకీ ప్రాజెక్టు యాజమాన్యం ప్రమాద కారణాలను మేయర్ కు వివరించారు. భవిషత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాంకీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్ ఈ ఘటనపై స్పందిస్తూ, ఇది అనుకోని ప్రమాదమని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా, మొదటివిడతగా ఒక్కొక్కరికి రూ. 4 లక్షల పరిహారం ఈరోజే మంజూరు చేసినట్లు మేయర్ కు వివరించారు.ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా కొండాపూర్ మండలం
- భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, మే 9 (జనం సాక్షి) :** రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి తెలిపారు. జిల్లా భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా శుక్రవారం కొండాపూర్ మండలం, గొల్లపల్లి, గ్రామం లో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. రైతులు సమర్పించిన దరఖాస్తులో భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్లైన్ లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితవు పలికారు. దరఖాస్తుల పరిశీలన ఆన్లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 18 రాష్ట్రాలలో సమగ్ర అధ్యయనం జరిపి, నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన కొండాపూర్ మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పుగా ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావంలో మార్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్–బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద కొండాపూర్ మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన మీదట, జిల్లాలోని మిగితా మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు కొండాపూర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులఆన్లైన్ నమోదు ప్రక్రియ ను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సదస్సులలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాక్షి ఎడిటర్ ఇంటిపై పోలీసుల దాడి అప్రజాస్వామికం



**కల్వకుర్తి, మే 9 (జనం సాక్షి) :** సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఆంధ్రప్రదేశ్ లో పోలీసులు దాడి చేయడం ప్రజాస్వామిక చర్యని జర్నలిస్టులు ఆక్షేపించారు. దాడికి నిరసనగా శుక్రవారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ పోలీసుల వ్యవహార శైలి ని తప్పు పట్టారు. ఈ దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. పోలీసుల తీరు విచారకరమన్నారు. ప్రభుత్వ లోపాలను అవినీతి చర్యలను ఎత్తిచూపుతూ వార్తలు ప్రచురిస్తే కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తూ పోలీసుల ద్వారా ఇలాంటి దుశ్చర్యకు తెగబడటం సరికాదన్నారు. ఆర్డిఓ శ్రీను నాయక్ ఏపీ పోలీసుల తీరును నిరసిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు శ్రీధర్, రవి, నాగేష్, సమద్, ప్రసాద్, రాజు, సిరాజ్, నరేష్, ఫయాజ్, నరేష్, జాహిద్, ప్రవీణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రారంభం

- హాజరైన ఎమ్మెల్యేలు, తూడి మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలు



**పెబ్బేరు, మే 9 (జనం సాక్షి) :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరామ ఆగ్రో ఇండస్ట్రీస్‌ను శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు, తూడి మేఘారెడ్డి, జోగులాంబ గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ ఇండస్ట్రీస్‌లో వ్యవసాయ ఉపకారణమైన వరి కోత యంత్రాలు, రోటవేటర్, కల్టివేటర్, డ్రోన్ పిచికారి యంత్రాలు, వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాల్ లాంటి అనేక రకాల ఉపకరణాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. నంద్యాలకు చెందిన కొండారెడ్డి, గద్వాలకు చెందిన దేవేందర్ రెడ్డి, మహబూబ్నగర్ కు చెందిన మహేశ్వర్ రెడ్డి, విజయ భూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి లు కలిసి సంయుక్తంగా ఈ ఆగ్రో ఇండస్ట్రీస్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఇండస్ట్రీస్లో అన్నదాతలకు కావలసిన అన్ని రకాల యంత్రాలను పనిముట్లను అందుబాటులో ఉంటాయని నియోజకవర్గ పరిధిలోని అన్నదాతలు ఈ ఇండస్ట్రీషను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యేలు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కురుమూర్తి, నాయకులు సత్యం, వెంకట్రాములు, దయాకర్ రెడ్డి రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, యుగేందర్ రెడ్డి, గంధం రాజశేఖర్, యాపర్ల రాంరెడ్డి, గుమ్మడం వెంకట్రామిరెడ్డి, వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌పై దాడులతో ప్రపంచానికి సత్తాచాటిన భారత్

**మక్తల్, మే 9 (జనంసాక్షి) :** పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలతో పాటు మన దేశంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పాక్ ఆర్మీ పై భీకరమైన దాడులను జరిపి, ఉగ్రవాదాన్ని అంతం చేసే దిశగా భారత్ ప్రపంచానికి మన సత్తా చాటిందని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, మాజీ ఎంపిటిసి జి. బలరాం రెడ్డి అన్నారు. శుక్రవారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 20 రోజుల క్రింద పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన 28 మంది అమరుల ఆత్మలకు నిజమైన శాంతి కలిగేలా భారత త్రివిధ దళాలు పాక్ పై దాడులను జరిపి అనుకున్న లక్ష్యాన్ని సాధించారని వారు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని ప్రజలు సుఖ:శాంతులతో జీవనం గడుపుతుంటే, పాక్ ఉగ్రవాద ముఠాలు దాడులకు పాల్పడి కల్లోలం రేపడం జరిగిందన్నారు. దీనికి ప్రతిగా పాక్ పై భారత్ యుద్ధం ప్రారంభించిందని వారు అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా రూపుమాపే వరకు భారత త్రివిధ దళాలు నిరంతరాయంగా యుద్ధం చేయాలని, వారికి ప్రతి భారతీయుడు సంపూర్ణ మద్దతును తెలియజేయాలని వారు అన్నారు. దేశంలో ఉంటూ దేశద్రోహానికి పాల్పడే ప్రతి ఒక్కరికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వారన్నారు. పార్టీలు, సంస్థలతో



సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దేశ భద్రతకై తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయానంద్ రెడ్డి, రమేష్, నల్లె నరసప్ప, తిమ్మప్ప, బస్వరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ భూముల్లో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

- సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్




**జడ్చర్ల, మే 9 (జనం సాక్షి) :** జడ్చర్ల మండల పరిధిలో భూధాన్, దేవాదాయ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని వెంచర్లు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు చేపట్టి అందులో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ, మండల పరిధిలోని భూదాన్, దేవాదాయ భూములను రిజిస్ట్రేషన్ చేస్తూ కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్న జడ్చర్ల రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అట్టి భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో జడ్చర్ల తాహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని భూదాన్, దేవాదాయ భూములైన సర్వేనెంబర్ లు 138, 29, 31, 33,115,116 లలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని భూములలో వెంచర్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని, అట్టి భూములలో అర్హులైన పేదవారికి ఇండ్ల స్థలాలుగా కేటాయించాలని, స్థలాలు కేటాయించని పక్షంలో భవిష్యత్తులో సిపిఐ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటం ద్వారా ఆ భూములో పేదల గుడిసెలు నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బాగి కృష్ణయ్య, జి సత్యనారాయణ రెడ్డి, హనుమంతు, శంకరయ్య, వెంకటయ్య, ఇస్తారయ్య, దాసు తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి

- మీడియా అకాడమీ చైర్మన్‌కు వనపర్తి (ఐజెయూ) నాయకుల వినతి




**వనపర్తి బ్యూరో, మే 9 (జనంసాక్షి) :** తెలంగాణ మీడియా ఆకాడమి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విలువలతో కూడిన జర్నలిజం వైపు అడుగులు వేసేందుకు జర్నలిస్టులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో వనపర్తి జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) వనపర్తి జిల్లా నాయకులు బి. రాజు, విజయ్, రవికాంత్, మన్యం, వేముల తిరుపతయ్య,సూరం పల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సదస్సులతో భూ సమస్యలపై అవగాహన



**చిలప్‌చేడ్, మే 9 (జనంసాక్షి) :** భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు చిలప్‌చేడ్ మండలం చండుర్ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకున్నారు. భూ భారతిపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకుని గ్రామాలను భూ సమస్యలు లేని పల్లెలుగా తీర్చిదిద్దుకోవాలని రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చిలప్‌చేడ్ మండలం పైలట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్కను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి తాసిల్దార్లు సహదేవ్,అంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



**జడ్చర్ల, మే 9 (జనం సాక్షి) :** నాలుగు లేబర్ కోడ్ లు, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్లతో ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలే జగన్ పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలు భాగస్వామ్యం కావాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని లింగంపేట్, కోడుగల్ గ్రామాలలో ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలే జగన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పని దినాలను తగ్గిస్తూ, బడ్జెట్ లో నిధులను తగ్గిస్తూ ఉపాధి కూలీల పొట్ట కొడుతున్నారని, కొలతల విధానాన్ని తీసుకువచ్చి రోజు కూలి 200 రూపాయలు కూడా గిట్టుబాటు కాకుండా చేస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘం, సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, యశోద, నరేందర్, మణెమ్మ, పావని, మల్లమ్మ, శ్రీనివాసులు, సంతోష్, సులోచన తదితరులు ఉన్నారు.

## తుల్జా భవాని జాతర గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే




**జడ్చర్ల, మే 9 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలో శంకరయ్య పల్లి తాండ బంగారాల గుట్టలో ఉన్న శ్రీ తుల్జా భవాని మాత అమ్మవారి జాతర కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను, కరపత్రాలను శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆవిష్కరించారు. ముందుగా దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించి జాతర కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా 9వ వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహాన్ మాట్లాడుతూ తుల్జా భవాని అమ్మవారి ఆలయ కమిటీ, తిరుపతి బావోజీ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీలలో జరిగే తుల్జా భవాని అమ్మవారి జాతర, ద్వితీయ వార్షికోత్సవంలో బంజారాలంతా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది, జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరు తమ వంతు ఆర్థిక సహాయ, సహకారాలు అందించి తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్త్యావత్ రమేష్ నాయక్, నాయకులు గోపాల్ నాయక్, రామ్ చందర్ నాయక్, కిషన్ నాయక్, పాండు నాయక్ ఉన్నారు.

# జర్నలిస్టులకు అండగా మీడియా అకాడమి

- రాష్ట్ర మంత్రి పొంగులేటి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
- దివంగతులు అయిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**వనపర్తి బ్యూరో, మే 9 (జనంసాక్షి) :** విధులు నిర్వహిస్తూ అనారోగ్యం, తదితర కారణాలతో దివంగతులు అయిన జర్నలిస్టుల కుటుంబాలకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రెస్ అకాడమీ మంజూరి చేసిన ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. శుక్రవారం హైదరాబాదులోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాల కు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చెక్కులను, ప్రతినెల 3000 రూపాయల చొప్పున పెన్షన్, ఒకటి నుండి పదవ తరగతి లోపు విద్యాభ్యాసం చేసే పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు 1000 రూపాయల చొప్పున చెల్లించే ఉత్తర్వులను అందజేశారు. ఈ చెక్కులు అందుకున్న వారిలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం శ్రీనివాసచారి, నారాయణపేట జిల్లా జర్నలిస్టులు యాదగిరి మహేష్, రాఘవేందర్, భూత్పూర్ మండలం రాములు , పెద్ద కొత్తపల్లి మండలం ఇస్మాయిల్, గద్వాలకు చెందిన సుగేంద్రనాథ్, మానవపాడుకు చెందిన స్వాములు కుటుంబ సభ్యులు ఉన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచడంతోపాటు.. అమరులైన జర్నలిస్టుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో దివంగతులు అయిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రెస్ అకాడమీ నుండి ఆర్థిక సహాయం అందేందుకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టనివ్వకుండా దరఖాస్తు పత్రాలను పూరించింది మొదలు.. ఆర్థిక సహాయం అందే దాకా కృషి చేసిన టి యు డబ్ల్యూ జే – ఐజేయు రాష్ట్ర కార్యదర్శి మధు గౌడుకు దివంగతులైన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు, ఉమ్మడి జిల్లా ఐజేయు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే ఐ జే యు రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, వనపర్తి జిల్లా ఐజేయు నాయకులు బి. రాజు, విజయ్, రవికాంత్, మన్యం, వేముల తిరుపతయ్య, సూరంపల్లి గోపాల్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి, నాయకులు రఘు గడప, నక్క శ్రీనివాస్, ఆకుల రాజేష్, సంజీవ ప్రకాష్, విఠోబా , నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ సుదర్శన్ రెడ్డి, కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మాలే రాజేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి బొల్లం వెంకటస్వామి , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దిశ బ్యూరో ఇన్చార్జ్ సి నరసింహులు, భూత్పూర్ జర్నలిస్టు నాయకుడు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



# జవహర్‌నగర్‌లో ముగ్గురు కార్మికుల దుర్ఘటన బాధకారం

## మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## బాధిత కుటుంబాలకు పరిహారం

హైదరాబాద్, మే 09 (జనంసాక్షి)



జవహర్‌నగర్‌లో జరిగిన విషాదకర ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి విచారం వ్యక్తం చేసారు. జవహర్‌నగర్‌లో జరిగిన విషాద ఘటనపై శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శానిటేషన్‌అధికారులు, రాంకీ ప్రాజెక్టు యాజమాన్యంతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా రామ్ కి ప్రాజెక్టు యాజమాన్యం ప్రమాద కారణాలను మేయర్ కు వివరించారు. భవిషత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాంకీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్ ఈ ఘటనపై స్పందిస్తూ, ఇది అనుకోని ప్రమాదమని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా, మొదటివిడతగా ఒక్కొక్కరికి రూ. 4 లక్షల పరిహారం ఈరోజే మంజూరు చేసినట్లు మేయర్ కు వివరించారు. మేయర్ స్వయంగా నగరంలో పారిశుధ్య పరిస్థితిని సమీక్షించి, నగర శుభ్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మిస్ వరల్డ్ పోటీలో జీహెచ్‌ఎంసీ భాగస్వామ్యం అవుతున్నందున నగరాన్ని మరింత శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రతి చర్య మార్గదర్శిగా ఉండాలని మేయర్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతిరోజు సమీక్షిస్తానని, పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా లేనట్లయితే తీవ్ర చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ప్రతిరోజు నివేదికలను తనకు అందజేయాలని మేయర్ సూచించారు. ఆ దిశగా ఇప్పటికే 700 బిన్లు ఏర్పాటు చేసామని, త్వరలో మరో 300 బిన్లు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు మేయర్ కు తెలిపారు. ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ , రామ్ కీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్,ఫస్యా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే మరింత భద్రత

## మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ బ్యూరో, మే 09 (జనం సాక్షి):



ప్రజల సహకారంతోనే సమాజంలో మరింత భద్రత కల్పించగలమని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. భారతదేశ వ్యాప్తంగాగా నెలకొన్న యుద్ధ వాతావరణం, సరిహద్దు జిల్లాలో మావోయిస్టుల అలజడుల నేపథ్యంలో నిఘా మరింతగా బలపరిచేందుకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో భద్రతా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా లోని ప్రధాన రహదారులు, గ్రామీణ మార్గాల్లో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం, రాత్రి వేళల్లో సడెన్ చెకింగ్స్ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను గుర్తించి విచారిస్తున్నారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక బలగాలతో నిఘా చర్యలను ముమ్మరం చేశారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. గ్రామ స్థాయిలో పోలీస్ కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు సూచనలు చేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలనీ, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు, సంచయాలు లేదా కార్యకలాపాలు కనిపించిన పక్షంలో వెంటనే 100 నెంబర్ కి లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వగలరనీ, మీ సహకారం వల్లే మేము సమాజాన్ని మరింత భద్రమైనదిగా తీర్చిదిద్దగలమని తెలిపారు.

# అధికారులు కాళేశ్వరంలోనే మకాం వేయాలి

## భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

## జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం (జనంసాక్షి)



శనివారం నుండి అధికారులు కాళేశ్వరంలో మకాం వేసి సరస్వతి పుష్కరాలు ఏర్పాట్లను సమీక్షించి పర్యవేక్షణ చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం కాళేశ్వరం దేవస్థానం ఈఓ కార్యాలయంలో జిల్లా అధికారులతో పుష్కరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్య శిభిరాల ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన స్టేజి, మైక్ ఇతర ఏర్పాట్లు, పారిశుద్ధ్య చర్యలు, సిబ్బందికి ఆహార ఏర్పాట్లపై పర్యవేక్షణకు విధులు కేటాయించిన అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఈఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో వైద్య సేవలు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. మూడు షిఫ్టు లలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర మందు లు, ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉండాలని తెలిపారు. అత్యవసర సేవలకు మహాదేవపూర్ లో 30 బెడ్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అంబులెన్స్, 108 సేవలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం వివిఐపి ఘాట్ గోదావరిలో నీటిమట్టం, టెంట్ సిటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. టెంట్ సిటీ వద్ద వర్షం వచ్చినా బురద కాకుండా భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రావెల్ వేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వైద్య ఆరోగ్య శాకాధికారి డా మధుసూదన్, డిపిఓ వీర భద్రయ్య, ఆర్ అండ్ బి, పీఆర్ ఇంజినీరింగ్, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 9 (జనంసాక్షి) :

మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, మే 5 నుంచి మీ సేవా కేంద్రాలలో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మే 17 లోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లోని సమర్పించాలన్నారు. ఇంటర్ లో గణితంలో 60 శాతం మార్పులు సాధించిన వారు,ఐటిఐ డ్రాఫ్ట్ మెన్ (సివిల్) ,డిప్లమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పని దినాలలో మే 26 నుంచి జూలై 26 శిక్షణ ఇస్తామని, శిక్షణ కోసం ఓసి అభ్యర్థులు రూ 10 వేలు, బీసీ అభ్యర్థులు రూ 5 వేలు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ 2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందనీ తెలిపారు .మరిన్ని వివరాలకు 9849081489, 7032634404, 9441947339 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలన్నారు.

# ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా జర్నలిస్టుల ర్యాలీ

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 9 (జనంసాక్షి)




భారత జవాన్లు ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం వేములవాడలోని ప్రెస్ క్లబ్ (ఐజేయు) ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి రాజన్న ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ను 25 నిమిషాల్లో విజయవంతంగా పూర్తిచేసిన భారత సైన్యానికి వందనాలు తెలిపారు. ఉగ్రవాదులను పోషిస్తున్న పాకిస్థాన్ భారత్ పై దాడులు చేయగా రెండు రోజుల నుండి సైనికులు పాకిస్థాన్ పై క్షిపణులతో దాడులు చేయడంలో ముందున్నామన్నారు. ర్యాలీలో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్,కార్యవర్గ సభ్యులు,సీనియర్ జర్నలిస్టు పాల్గొన్నారు.

# శ్రీధర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం : షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 9 (జనం సాక్షి)



విధి నిర్వహణలో మరణించిన పోలీసు వద్ల శ్రీధర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు.పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వద్ల శ్రీధర్ అంత్యక్రియల్లో శుక్రవారం పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వద్ల శ్రీధర్ కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. చర్చల ద్వారా సమస్యలు పరిస్కరించుకోవాలని, హింసా మార్గాన్ని విడనాడాలని అన్నారు. మరణించిన శ్రీధర్ కుటుంబానికి 2.17 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం నుండి అందజేయ బడుతుందని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం తో పాటు 300 గజాల ఇంటి స్థలాన్ని అందిస్తామన్నారు
పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ గ్రేహ్యాండ్ కమాండర్ ఆపరేషన్ రాఘవెందర్ రెడ్డి,ఒఎస్డి దయానంద్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, టీఎస్పీ శంకరయ్య డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ వి.విక్టర్, ఆర్డీఓ వీణ, పోలీసు, రెవిన్యూ, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమంగా చెరువు మట్టి తరలింపు

## వాహన యజమానుల అరెస్ట్

వరంగల్ ప్రతినిధి, మే 9 ( జనం సాక్షి) :



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువు మట్టిని రాత్రి పూట రవాణా చేస్తూ అనుమతులు లేకుండా మట్టిని తరలించే వాహన యజమానులను అరెస్టు చేసినట్లు దుగ్గొండి ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్సై విలేకరులతో దుగ్గొండి ట్రైనింగ్ ఎస్సై ఎస్.మహేష్, పీఎస్ సిబ్బందితో రాత్రి 12 గంటల సమయంలో పెట్రోల్ చేస్తుండగా బంధం పల్లి గ్రామ శివారున గల బంధంపల్లి తుమ్మలకుంట చెరువు వద్ద ఒక జెసిబి తో ఐదు ట్రాక్టర్ల యందు చెరువు మట్టిని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తీసుకు వెళుతున్నారని సమాచారం రాగా ఎస్సై మహేష్ సిబ్బంది తో అట్టి టాక్టర్లను పట్టుకొని విచారించగా మట్టి తీసుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని తెలిసింది, టాక్టర్లను జేసీబి ని అదుపులోకి తీసుకొని శుక్రవార దుగ్గొండి ఎమ్మార్వో రవి చంద్రారెడ్డి ఎదుట నిందితులను హాజరు పరిచారు. జెసిబి ట్రాక్టర్ల ఓనర్ నగరబోయిన తిరుపతి బంధంపల్లి, , జెసిబి నెంబర్ టిఎస్ 24 జి 1626, నగరబోయిన కట్టయ్య, బంధం పల్లి ట్రాక్టర్ నెంబర్ టిఎస్ 02 యు 5225, నగర బోయిన రమేష్, చల్ల శ్రీకాంత్ , బొమ్మల రాకేష్, ఒక జెసిబి ఐదు ట్రాక్టర్లను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసి దుఃఖండి ఎమ్మార్వో తాసిల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

# అర్జీలను చట్ట ప్రకారం పరిశీలించి చర్యలు చేపట్టాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 9 (జనం సాక్షి)



భూ భారతి చట్టం ప్రకారం వచ్చిన అర్జీలను చట్ట ప్రకారం పరిశీలించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం లింగంపేట్ ఎంపీడీఓ సమావేశ మందిరంలో రెవిన్యూ టీమ్ లతో సమావేశం నిర్వహించారు. గత నెల 17 నుండి 30 వరకు లింగంపేట్ మండలంలో భూ భారతి చట్టం ప్రకారం 23 రెవిన్యూ గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద రెవిన్యూ సదస్సులు నిర్వహించి భూములకు సంబంధించిన అర్జీలను స్వీర్జించారని, అట్టి చట్టం ప్రకారం 4225 దరఖాస్తులు రావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి పరిష్కరించడానికి 9 టీమ్ లను ఏర్పాటు చేసి, దరఖాస్తుల ప్రకారం భూములను పరిశీలించడం జరుగుచున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 1443 దరఖాస్తులకు సంబంధించిన క్షేత్ర పర్యటన చేసి భూములను పరిశీలించడం జరిగిందని తెలిపారు. మిగతా దరఖాస్తు లకు సంబంధించిన వాటిని త్వరగా పరిశీలించాలని అన్నారు. అటవీ క్షేత్రాల్లోనూ భూముల ను జాయింట్ సర్వే చేయాలనీ సూచించారు. దీర్ఘకాలిక పెండింగు దరఖాస్తులను కూడా పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ ప్రభాకర్, భూ భారతి ప్రత్యేక అధికారి రాజేందర్, ల్యాండ్ సర్వే సహాయ సంచాలకులు శ్రీనివాస్, అటవీ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్లు, రెవిన్యూ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ట్రాన్స్ జెండర్ల వితరణ



## సమాజ సేవకు ముందుకు వస్తున్న ట్రాన్స్ జెండర్లు.

కాటారం, మే 9( జనం సాక్షి ) :

సమాజంలోని నిరుపేద కుటుంబానికి సహాయం చేసి ట్రాన్స్ జెండర్లు తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే... జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మద్దులపల్లి గ్రామంలో ట్రాన్స్ జెండర్ ల శిబిరం ఉంది. కాగా గత వారం రోజుల క్రితం మద్దులపల్లి గ్రామానికి చెందిన మారపాక దుర్గయ్య అనే ఇంటి యజమాని అకాల మరణం చెందడంతో నిరాశ్రయులైన కుటుంబ సభ్యులకు ట్రాన్స్ జెండర్లు చేయూతను అందించారు. ఈ మేరకు వారు నెల రోజులకు సరిపడే బియ్యం, వంట సామాగ్రి తో పాటు నిత్యావసర సరుకులు, కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్లు అడువాల రూప, సల్లపు గౌరీ, సాన్విత, ఫ్రూటీ, మోక్ష, తదితరులు పాల్గొన్నారు. నిరాయుశ్రులైన కుటుంబానికి ట్రాన్స్ జెండర్లు చేయూతను అందించడం పట్ల పలువురు అభినందించారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లలో క్రీడాకారులను తీర్చిదిద్దాలి

## అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు


హైదరాబాద్, మే 09 (జనంసాక్షి) :



సమ్మర్ కోచింగ్ క్యాంప్ ల ద్వారా క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి క్రీడాకారులను తీర్చిదిద్దాలని అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు సంబంధిత కోచ్ లను ఆదేశించారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ జోన్‌లోని వివిధ ప్లే గ్రౌండ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ ను సంబంధిత జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ లకు మంచి స్పందన లభిస్తుందని, గ్రేటర్ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.
ఈ సంవత్సరం ఆరు జోన్లలో వివిధ క్రీడా విభాగాల్లో నిష్ణాతులైన 77 మంది పార్ట్ టైం కోచ్ లు, 800 మంది గౌరవ వేతన కోచ్ ల ద్వారా సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామని తెలిపారు. 44 విశాలమైన బహుళ క్రీడా సముదాయాలు, 29 స్విమ్మింగ్ పూల్స్, 13 ఆట స్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లలో 44 రకాల ఆటలలో శిక్షణను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు

ఎలిగేడు,మే 09(జనంసాక్షి) :



రెవెన్యూ సదస్సుల ద్వారా వస్తున్న భూ సమస్యల పరిష్కారా నికి కట్టుదిట్టమైన చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం ఎలిగే డు తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు పెద్దపల్లి జిల్లాలో ఎలిగేడు మండలం పైలేట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని భూ భారతి చట్టం కింద భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.మే 19 వరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, భూ రికార్డుల సమస్యలు ఉంటే ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఎలిగేడు మండలంలో ఇప్పటివరకు ప్రజల నుంచి 614 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, కోర్టు సమస్యలు, కుటుంబ వివాదాలు మినహాయించి మిగిలిన భూ సమస్యలను జూన్ 2 లోపు పరిష్కరించేలా కార్యచరణ అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో తహసిల్దార్ బషిరుద్దన్,తహసిల్దార్ యాక్కన్న, డిప్యూటీ తహసీల్దారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని ప్రభుత్వ వైద్యులు

- 12.30 గంటలకే పత్తాలేని డాక్టర్లు
- డాక్టర్ల కోసం రోగుల పడిగాపులు
- ఇబ్బందులకు గురవుతున్న రోగులు

**దేవరకొండ, మే 9 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దేవరకొండ డివిజన్ మరియు పరిసర ప్రాంతాల నుండి ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం దాదాపు 600 మంది ఔట్ పేషెంట్లు, 120 నుండి 150 ఇన్ పేషెంట్లు, సుమారుగా నెలకి 110 నుండి 130 ప్రసవాలు జరుగుతున్నాయి.సర్కార్ వైద్యం కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆచరణలో అమలు పరచడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లు వెచ్చించి అభివృద్ధి పథకంలో దూసుకుపోతుంటే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో దానికి భిన్నంగా ప్రవర్తిస్తున్నారు కొందరు డాక్టర్లు.

సమయపాలన పాటించని కొందరు డాక్టర్లు

దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని లక్ష్యంతో గతంలో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టగా, పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కానీ కొందరు డాక్టరలకు తమ సొంత ప్రైవేటు ఆసుపత్రులకు అడ్డుగా





ఉందనే కావాలనే వాటిని రిపేర్ చేయించట్లేదనే వాదనలు సైతం వినిపిస్తున్నాయి. శుక్రవారం 12. 30 డాక్టర్లు ఇంటి బాట పట్టడమే దీనికి నిదర్శనం. ఇప్పటికైనా జిల్లా అధికారులు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పై దృష్టి సారించి రోగుల పక్షాన నిలబడి, రోగులకు నిరంతరం సేవలు అందించేలా చేయాలని ఆసుపత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.

### ప్రవేట్ ఆసుపత్రికి తరలింపు

తాజాగా శుక్రవారం పాదం బొక్క విరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగికి ప్రభుత్వ ఆసుపత్రిలో తీసిన ఎక్స్ - రే సరిగా కనబడటం లేదని,తన ప్రవేట్ ఆసుపత్రికి పంపి , అక్కడే ఎక్స్-రే తీపించి, పిఓపి కొరకు 4000 రూపాయలు ఖర్చవుతుందని రోగితో తెలిపారు ఓ డాక్టర్..

### చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల కొరకు పిఓపి సదుపాయాలు కూడా ఉన్నాయని, పిఓపి, మరియు ఎక్స్రే కొరకు రోగికి బయట పంపించిన విషయం తన దృష్టికి రాలేదని, వస్తే మాత్రం చర్యలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్క డాక్టర్ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు డ్యూటీ లో తప్పకుండా ఉండాలని తెలిపారు. ఆసుపత్రిలో ప్రస్తుతం బయోమెట్రిక్ మిషన్ మరమ్మతులకు గురైందని తెలిపారు. 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నామని,సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఆసుపత్రి సూపరింటెండెంట్**

# ఆరోగ్య కేంద్రం ప్రజలకు పూర్తి భరోసా ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**కల్లూరు, మే 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శుక్రవారం కల్లూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ హోమియో వైద్యశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఫార్మసీ, ప్రాథమిక పరీక్ష గది, ఎక్స్ రే, ఆసుపత్రిలో మందుల నిల్వలు, సాధారణ ప్రాథమిక వైద్య సేవలు, గర్భిణీ మహిళలకు అందుతున్న సేవలు, ఆసుపత్రి నిర్వహణ, ప్రజలకు అందించనున్న చికిత్సలు, క్యాజువాలిటీ, ఓపీ సేవలు, ల్యాబ్ లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల స్టాక్, వివిధ రకాల ఔషధ వివరాలను కలెక్టర్ పరిశీలించారు. గర్భిణులకు అందించు వైద్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని అన్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని క్యాజువాటీ లో నేరుగా రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు గురించి కలెక్టర్ ఆరా తీశారు.ఆసుపత్రిలో ఉన్న ప్రతి మందుల వివరాలను తెలిసేలాగా బోర్డు పై వివరాలను నమోదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్యాధికారులు రమేశ్, నవ్యకాంత్, కల్లూరు మండల తహసీల్దార్ పి. సాంబశివుడు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పాకిస్తాన్ ఉగ్ర శిబిరాలపై భారత్ వైమానిక దాడులు అభినందనీయం



**తలకొండపల్లి, మే 9 (జనంసాక్షి) :** పాకిస్తాన్ లోని ఉగ్ర శిబిరాలపై సింధూర్ పేరుతో భారత్ జరిపిన వైమానిక దాడులు అభినందనీయమని తలకొండపల్లి బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గుజ్జరి రాఘవేందర్ అన్నారు. శుక్రవారం తలకొండపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ..జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో హిందూ టూరిస్టులపై పాకిస్తాన్ టెర్రరిస్టులు జరిపిన దాడి పిరికిపంద చర్య అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం యాదవ్,ఎరువ రాజలింగం,సోషల్ మీడియా ఇన్చార్జ్ కుమార్ యాదవ్,స్వామి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు దాటిన 9 ఇసుక లారీలను అడ్డుకున్న పోలీసులు

- రూ:1.07 లక్షల జరిమాను విధించిన రెవెన్యూ అధికారులు

**న్యాల్‌కల్, మే 9 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి.. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారుల కళ్ళుగప్పి అక్రమంగా ఇసుక దందాను కొనసాగిస్తున్న అక్రమ మైనింగ్ వ్యాపారులకు పోలీసులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ నుండి కర్ణాటకలోని బీదర్ పట్టణానికి ఇసుకను తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో దాడులు చేశారు. ఈ నెల 4న హద్దునూర్ ఎస్సై చెల్లా రాజశేఖర్, పోలీసుల బృందంతో కలిసి జహీరాబాద్ - బీదర్ రోడ్డు, మండలంలోని హుసేళ్ళి గ్రామం నుండి బీదర్ కు ఇసుక లారీలు వెళుతుండగా స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వస్తున్న 9 ఇసుక లారీలను స్వాధీనం తీసుకొని.. కేసు నమోదు చేసిన అనంతరం రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

8 లారీలకు గాను రూ:1.07 లక్షల జరిమానా

సంగారెడ్డి జిల్లా మైనింగ్ ఏడి రఘుబాబు ఆదేశం మేరకు స్థానిక డిప్యూటీ తహసిల్దార్ రాజిరెడ్డి శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలపై జరిమానా విధించారు. ఒక్కో క్యూబిక్ మీటర్ గాను రూ:614 చొప్పున 8 ఇసుక లారీల పై రూ:1.07 లక్షల మేర జరిమానా విధించినట్లు ఉప తహసిల్దార్ తెలిపారు. 35 టన్నులు ఉన్న రెండు ఇసుక లారీలకు రూ:28650 చొప్పున, 30 టన్నులు ఉన్న 6 ఇసుక లారీలకు రూ: 78576 చొప్పున జరిమాన వేయడం జరిగిందన్నారు. జిల్లా మైనింగ్ అధికారుల ఆదేశం మేరకు కేవలం అక్రమ ఇసుక రవాణా పైనే జరిమానా విధించడం జరిగిందన్నారు. పట్టుబడ్డ లారీలను విడుదల చేయడానికి మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఇలాంటి అధికారులు లేవని స్పష్టం చేశారు. అక్రమ



ఇసుక దందాను అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ - కర్ణాటక సరిహద్దు, మండలంలోని హుస్సేల్లి వద్ద ఆర్డిఓ, డిఎస్పి ఆదేశం మేరకు స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల బృందంతో ప్రత్యేకంగా చెక్ పోస్ట్ వద్ద గస్తీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనునిత్యం రాత్రి ఎనిమిది గంటల నుండి ఉదయం 8 గంటల వరకు గస్తీ చేపట్టడం జరుగుతుందని ఉప తహసిల్దార్ రాజిరెడ్డి తెలిపారు.

# వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి

**హైదరాబాద్, మే 9 (జనంసాక్షి) :** వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని, ప్రతి వికలాంగునికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని మే 13న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడిస్తున్నామని ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య తెలిపారు. చిక్కడపల్లి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి శశికలలతో కలిసి మే 13న జరిగే వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగాలని గత ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేటికీ అమలు కావడం లేదన్నారు. తక్షణమే జిల్లా స్థాయిల్లో ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ, అవసరమైన ఉద్యోగులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి వికలాంగునికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రాల్లో వికలాంగుల కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సైన్ లాంగ్వేజ్, బ్రెయిలి లిపిలో ఇంటర్, డిగ్రీ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సాంస్కృతిక సారధిలో 5శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం మే 13న డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.



# 106 కిలోల నిషేధిత ఎండు గంజాయి సీజ్



**సంగారెడ్డి ప్రతినిధి, మే 9 (జనం సాక్షి) :** అక్రమ గంజాయి రవాణా పై సంగారెడ్డి జిల్లా పోలీసుల ఉక్కు పాదం మోపుతున్నారు. సిసియస్, పటాన్ చెర్వు పోలీసుల సంయుక్త ఆపరేషన్ లో సుమారు 27 లక్షల విలువ గల, 106 కిలోల నిషేధిత ఎండు గంజాయి సీజ్ చేసినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సిసియస్ టీం, పటాన్చెర్వు ఇన్స్పెక్టర్ వినాయక్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ -3 టోల్ గెట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సంగారెడ్డి వైపు అనుమానాస్పదంగా వస్తున్న రెండు కార్లు మారుతి స్విఫ్ట్ , నెంబర్ టీఎస్ 15 ఎఫ్ హెచ్ 3441, మారుతి బెల్లెనో కార్ నెంబర్ టీఎస్ 09 జిఏ 6422 గల వాటిని ఆపి తనిఖీ చేయగా రెండు కార్ల డిక్కిలలో గోదుమ రంగు కవర్ చుట్టిన 54 ప్యాకెట్స్‌లో 106 కిలోల ఎండుగంజాయి ప్యాకెట్స్ లభించినట్లు తెలిపారు. నిందితులు రాథోడ్ బీర్‌బల్ పతునాయక్ తండా, యేనకపల్లి నాగల్‌గిద్ద మండలం, రాథోడ్ సురేష్, నివాసం: పతునాయక్ తండా, యేనకపల్లి గ్రామం, నాగల్‌గిద్ద మండలం,రాథోడ్ మారుతి సిరిగిపూర్ మండలం, రాథోడ్ ప్రకాష్ యేనకపల్లి గ్రామం, నాగల్‌గిద్ద మండలం లను రిమాండ్ చేసినట్టు తెలిపారు. జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపడం జరుగుతుందన్నారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా ఎస్ నాబ్ సెల్ 8712656777 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి అక్రమ రావాణ ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

# నివేశన స్థలాల ఈఎన్‌సి కోసం మంత్రికి వినతి

- సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి



**హుజురాబాద్, మే 9 (జనం సాక్షి) :** హుజురాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన నివేశన స్థలాలకు ఈఎన్‌సి ఇప్పించాలని హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించారు. హైదరాబాదులోని ప్రెస్ అకాడమీలో జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. హుజురాబాద్ లోని జర్నలిస్టులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన నివేషన స్థలాలకు ఈఎన్ సి ఇప్పించి క్లియరెన్స్ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి జర్నలిస్టులకు పంపిణీ చేసిన నివేశన స్థలాలకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ద్వారా ఈఎంసి ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని ఆయన చాంబర్ లో కలిసి జర్నలిస్టుల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు .దీనికి స్పందించిన ప్రెస్ ఆకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... హుజురాబాద్ జర్నలిస్టుల నివేషన స్థలాల సమస్యను తొందరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో టియు డబ్ల్యూ జె (ఐజేయు )జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్ ఉన్నారు.

# మంథనిలో భారత సైన్యానికి సంఘీభావ ర్యాలీ

**మంథని, మే 9 (జనంసాక్షి) :** “ఆపరేషన్ సింధూర్” నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా శుక్రవారం మంథని పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి శ్రీపాద చౌక్ వరకు నిర్వహించిన ర్యాలీలో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత్ సైన్యానికి సంఘీభావం తెలిపే విధంగా మంథని పట్టణ ప్రజల ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని స్థానిక గాంధీ చౌక్ నుండి పూలే చౌరస్తా,శ్రీపాద చౌక్ ల మీదుగా పాదయాత్ర చేస్తూ సంఘీభావ ర్యాలీనీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గాంధీ చౌక్ నుండి పూలే చౌరస్తా వరకు జాతీయ జెండాలను



పట్టుకొని పాకిస్తాన్ కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీనీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంథని పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**చౌటుప్పల్, మే 9 (జనం సాక్షి) :** అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ద్యేయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలంలో శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లక్కారం క్యాంప్ ఆఫీస్‌లో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. పట్టణంలోని కస్తూరిబా బాలికల పాఠశాల నూతన భవనంకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ద్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్స్ , ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాపరంగా జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలి

- ఉల్లాస్ కార్యక్రమం జిల్లాలో పగడ్బందీగా అమలు చేయాలి
- బడి బాటలో విద్యార్థులందరూ నమోదు కావాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, మే 9 (జనం సాక్షి) :** విద్యాపరంగా జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఎంఈఓ లను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులకు మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా ప్రమాణాలు కార్పొరేట్ దీటుగా మెరుగుపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిన నేపథ్యంలో వాటికి అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మెదక్ జిల్లా పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించినందుకు మండల విద్యాధికారులను ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు ఇదే స్ఫూర్తితో రాబోయే బడిబాటలో అందరు విద్యార్థులను నమోదు చేసి ఏ ఒక్క విద్యార్థి కూడా బడి బయట ఉండకుండా చూడాలన్నారు గ్రామంలోని ప్రతి ఒక ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు 15 సంవత్సరాలు నిండిన నిరక్ష రాశ్యులను గుర్తించి వారికి “ఉల్లాస్” కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని స్వయం సహాయక బృందాల సహకారంతో అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపట్టాలన్నారు .చదవడం రాయడం వచ్చిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ మరియు ఓపెన్ ఇంటర్లో నమోదు చేయాలన్నారు 100% విద్యార్థులను నమోదు చేసి రాబోయే విద్యా సంవత్సరంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు విద్యా పరంగా జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో ఉంచాలన్నారు పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అందరూ తప్పనిసరిగా జూనియర్ కళాశాలలో నమోదు చేసుకునే విధంగా వారికి క్యారియర్ గైడెన్స్ కల్పించాలన్నారు ప్రతి శుక్రవారం మెగా పేరెంట్స్ సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామంలో ఉన్న విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులకు మన బడిలో ఉన్న వసతులు అన్నింటిని చూపించి వాటి గురించి వివరించి



తప్పనిసరిగా విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా అవగాహన కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో హాజరైన అంగన్వాడి సూపర్వైజర్ లందరికీ పదవ తరగతి పూర్తయిన బాలికలందరూ తప్పనిసరిగా పై చదువులు చదువుకునే విధంగా చూడాలని ఎట్టి పరిస్థితుల్లో బాల్యవివాహాలు జరగకుండా చూసే బాధ్యత అంగన్వాడీ సిబ్బంది దేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్ , జిల్లా సంక్షేమ అధికారిని, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వర ప్రసాద్, వయోజన విద్యాధికారి,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏ ఎస్ ఓ నవీన్, సెర్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

# పసిడి పతనం

## ఒక్కసారిగా పడిపోయిన బంగారం ధరలు

**జనంసాక్షి:**దేశంలో బంగారం ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. వరుసగా నాలుగు రోజులుగా భగ్గుమన్న పసిడి ధరలు శుక్రవారం భారీగా దిగివచ్చాయి. గత నాలుగు రోజుల్లో పసిడి 10 గ్రాములకు ఏకంగా రూ.4వేలకు పైగా ఎగిసి మళ్లీ రూ.లక్షకు చేరువైంది.దీంతో ఆందోళన చెందుతున్న కొనుగోలుదారులకు నేటి భారీ తగ్గుదల ఊరట కలిగించనుంది. మే 9 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..

**ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాల్లో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,350
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,150

హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది.

**చెన్నైలో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,350
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,150



చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.1250, రూ.1150 చొప్పున క్షీణించాయి.

**ఢిల్లీలో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,500
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,300

ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.1250, రూ.1150 చొప్పున క్షీణించాయి.

**ముంబైలో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,350
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,150

ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.1250, రూ.1150 చొప్పున క్షీణించాయి.

**బెంగళూరులో..**


- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,350
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,150

బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి, కానీ స్థానిక ఆర్థిక పరిస్థితులు, ఫెస్టివల్ సీజన్ డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేయవచ్చు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.1250, రూ.1150 చొప్పున క్షీణించాయి.

**వెండి ధరలు ఇలా..**

దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ ధర రూ.1,11,000 వద్ద, ఢిల్లీ ప్రాంతంలో రూ. 99,000 వద్ద కొనసాగుతోంది.




భారత్-పాక్ యుద్ధం..

# నష్టాల్లో సూచీలు

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే శుక్రవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:26 సమయానికి నిఫ 211 పాయింట్లు నష్టపోయి 24,063కు చేరింది. సెన్సెక్స్ 542 పాయింట్లు దిగజారి 79,805 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 100.81 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 63 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.36 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో గతంతో పోలిస్తే లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.58 శాతం లాభపడింది. నాస్‌డాక్ 1.07 శాతం ఎగబాకింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమవడంతో స్టాక్ సూచీలు ఒడిదొడులకు లోనవుతున్నాయి. ఇటీవల భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా దాడులు చేసిన పాక్‌పై ప్రతీకార చర్యగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్లు భారత రక్షణ శాఖ ప్రకటనతో దలాల్ స్ట్రీట్ సెంటిమెంట్ నిన్న ఒక్కసారిగా మారిపోయింది. ట్రేడింగ్ మరో గంటలో ముగుస్తుందనే సమయంలో ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో భారీ విక్రయాలు తలెత్తాయి. అమెరికాతో చైనా, తాజాగా బ్రిటన్ వాణిజ్య ఒప్పంద చర్చలు సఫలం అవ్వొచ్చనే అంచనాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.పరస్పర దాడులకు సంబంధించిన పరిస్థితులు త్వరగా సద్దుమనిగితే మార్కెట్ ప్రభావం పరిమితం కావచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఈ ఆపరేషన్ స్టాక్ మార్కెట్‌పై పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని కొందరు చెబుతున్నారు. పరిస్థితులు త్వరితగతిన నియంత్రణలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం.



ఇలాంటి ఆపరేషన్‌ల ప్రభావానికి తాత్కాలికంగా మార్కెట్లు ఒడిదొడులకులకు లోనైనా భవిష్యత్తులో తప్పకుండా పెరుగుతాయని స్పష్టం చేస్తున్నారు.

**క్షీణించిన రూపాయి**

**జనంసాక్షి:**భారత్-పాక్ మధ్య పెరుగుతున్న యుద్ధ భయాల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడికి గురైంది. రెండేళ్లలో ఎప్పుడూ లేనంతగా అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ గురువారం ఒక్కరోజులోనే 89 పైసలు క్షీణించి 85.72 వద్ద ముగిసింది.2023 ఫిబ్రవరి 6 తర్వాత రూపాయి విలువ 1 శాతానికి పైగా క్షీణించడం ఇదే తొలిసారి. బుధవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.83 వద్ద ముగిసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్ర స్థావరాలపై భారత్ దాడి చేసింది. తిరిగి నిన్న సరిహద్దులో పాక్ భారత సైన్యాల స్థావరాలను కూల్చేందుకు ప్రయత్నించింది. పాకిస్థాన్‌లో భారత్ సైనిక దాడుల తర్వాత యుద్ధ భయాలు పెరిగాయని విశ్లేషకులు తెలిపారు. డ్రోన్లు, క్షిపణులను ఉపయోగించి పలు భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నించడంతో కరెన్సీ మార్కెట్ ఒత్తిడికి గురైంది. ఈ చర్యను భారత రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నాయి. భౌగోళిక రాజకీయ ఒత్తిడితో పాటు, బలమైన అమెరికా డాలర్, ముడి చమురు ధరలు సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి.

# ఐటీలో పెరిగిన ఆర్‌పీఈ



**ఒక్కో ఉద్యోగి వల్ల ఆదాయం ఎంతంటే..**

**జనంసాక్షి:**దేశంలోని ప్రముఖ ఐటీ కంపెనీల్లో 2025 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతి ఉద్యోగి ద్వారా సమకూరే ఆదాయం(రెవెన్యూ పర్ ఎంప్లాయి-ఆర్‌పీఈ) పెరిగింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల ద్వారా సమకూరే ఆదాయం ఏడేళ్ల గరిష్టాన్ని తాకినట్లు కొన్ని నివేదికల ద్వారా తెలిసింది.మెరుగైన వనరుల వినియోగం, ఆటోమేషన్, కార్యాచరణ సామర్థ్యాల ద్వారా ఇది సాధ్యమైందని కంపెనీలు తెలిపాయి. కాగా, ఇటీవల సంస్థల త్రైమాసిక లాభాలు తగ్గుముఖం పట్టడం గమనార్హం. ఒక్కో ఉద్యోగి ద్వారా 2024-25లో ఏయే సంస్థకు ఎంత సమకూరిందో కింద తెలుసుకుందాం.

టీసీఎస్: 49,638 డాలర్లు(సుమారు రూ.41.67 లక్షలు) గతేడాది కంటే ఇది 2.7 శాతం పెరిగి ఏడేళ్ల గరిష్టాన్ని చేరింది. టీసీఎస్ కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 6,07,979.

ఇన్ఫోసిస్: 59,575 డాలర్లు(సుమారు రూ.50 లక్షలు). గతంలో కంటే 1.8% పెరిగి ఏడేళ్ల గరిష్టానికి చేరింది. ఇన్ఫోసిస్ కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 3,17,240.

హెచ్‌సీఎల్ టెక్: 61,946 డాలర్లు (సుమారు రూ.51.9 లక్షలు). గతంలో కంటే 6.2% పెరిగింది.? హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 2,27,000.

విప్రో, టెక్ మహీంద్రా రెండూ ఆర్‌పీఈలో క్షీణతను నమోదు చేశాయి.క్రమబద్ధీకరించిన కార్యకలాపాలు, సమర్థవంతంగా ప్రాజెక్టల అమలు, అధునాతన ఆటోమేషన్ వ్యూహాల కారణంగా ఆర్‌పీఈలో మెరుగుదల కనిపించినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, లేఆఫ్స్ పేరుతో ఇటీవల కాలంలో చాలామంది ఉద్యోగులను తొలగించడంతోనే కంపెనీలకు ఇలా ఆర్‌పీఈ పెరిగినట్లు కనిపిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. కంపెనీలకు లాభాలు ఉన్నప్పటికీ ప్రపంచ స్థూల ఆర్థిక అనిశ్చితితో ఐటీ రంగం సవాళ్లు ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఐటీ సేవలకు డిమాండ్ మందగించడం, వ్యయ ఒత్తిళ్లు, లేఆఫ్స్ ఆందోళనలు భవిష్యత్ రాబడులపై ప్రభావం చూపనున్నాయని కొందరు అంచనా వేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలతో ఐటీ సంస్థలు స్కిల్ డెవలప్‌మెంట్, ఆటోమేషన్, కాస్ట్ ఎఫిషియెన్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు.

విమానాశ్రయాల్లోకి నో ఎంట్రీపై

# దుష్ప్రచారాలు

**జనంసాక్షి:**భారత్-పాకిస్తాన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అనేక ఫేక్ వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వాటిల్లో ఒకటే ఎయిర్ పోర్టుల్లోకి నో ఎంట్రీ వార్త.దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లోకి ప్రవేశంపై నిషేధం విధించినట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమని ప్రభుత్వానికి చెందిన వార్తా సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ యూనిట్ స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విటర్)లో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఒక పోస్ట్ చేసింది. "ఫేక్ న్యూస్ అలర్ట్. భారతదేశం అంతటా విమానాశ్రయాల్లోకి ప్రవేశాన్ని నిషేధించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు ఉన్నాయి. ఆ వార్తలు ఫేక్. ప్రభుత్వం అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు" అని పేర్కొంది.భద్రతా తనిఖీల దృష్ట్యా ప్రయాణికులు తమ ప్రయాణానికి కనీసం మూడు గంటల ముందే విమానాశ్రయాలకు చేరుకోవాలని పలు విమానయాన సంస్థలు ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేశాయి. ప్రభుత్వం ఆమోదించిన ఫోటో ఐడీ కార్డులను వెంట తీసుకెళ్లాలని సూచించాయి. దేశంలోని అన్ని విమానాశ్రయాలలో మెరుగైన భద్రతా చర్యల కారణంగా, ప్రయాణానికి కనీసం 3 గంటల ముందు విమానాశ్రయానికి చేరుకోవాలని ఆక్షాశ ఎయిర్ లైన్స్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. స్పైస్ జెట్ కూడా ఇదే విధమైన అడ్వైజరీని జారీ చేసింది.



# భారత్ పాక్‌పై చేసింది యుద్ధం కాదు.. న్యాయం

## ఆపరేషన్ సిందూర్‌పై పాక్ వ్యక్తి ప్రశంసల జల్లు




పహల్గాం ఘటనకు ప్రతిగా భారత్ బుధవారం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసింది. దీనిపై యావత్ దేశం హర్షం వ్యక్తం చేసింది.అయితే ఈ నేపథ్యంలో భారత్-పాక్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పూర్తిస్థాయిలో ఇరు దేశాలు యుద్ధం దిశగా కదులుతున్నాయి. ఈ తరుణంలో నెట్టింట ఒక పాక్ వ్యక్తి భారత్ చేసింది న్యాయమే అంటూ పోస్ట్ చేసిన వైరల్ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అందులోనూ ఇలాంటి సమయంలో శత్రు దేశానికి చెందిన వ్యక్తే ఇలా మాట్లాడటం నెటిజన్లను ఆశ్చర్యపరిచింది.ఆ వీడియోలో దుబాయ్‌కి చెందిన ఫారెక్స్ వ్యాపారి అభయ్ భారత్ సిందూర్ ఆపరేషన్‌తో పాక్‌పై చేసిన దాడిని సరైదని, అది న్యాయం అని మాట్లాడారు. అంతేగాదు భారత ప్రభుత్వం చర్యను, భారత సాయుధ దళాల ప్రతిస్పందనను మెచ్చుకున్నాడు. ఇప్పుడు పాక్ వరకు వచ్చేటప్పటికీ తాము బాధితులమే అని డ్రామా ప్లే చేస్తోందని ఆరోపించాడు. పహల్గాం పర్యటనకు వచ్చిన 26 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్నప్పుడూ ఏమైంది ఇదంతా అని నిలదీశాడు. ఇప్పుడు అకస్మాత్తుగా శాంతి, మానవహక్కులు అంటూ నీతి కబర్లు చెప్పడమే గాక పాక్ కూడా ఉగ్రవాద బాధిత దేశమే అని చెప్పుకోవడం హాస్యాస్పదం గా ఉంది అని తిట్టిపోశాడు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా స్పందించే హక్కు భారత్‌కి పూర్తిగా ఉందన్నారు. అలాగే భారత్ చేసింది న్యాయమే అని ప్రశంసించాడు. అసలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించినప్పుడూ తెలియలేదా పాక్‌కి ఇది ఎప్పటికైనా నష్టమే అని అంటూ ఫైర్ అయ్యాడు. ప్రజలు మరణించగానే శాంతి అనడం కాదు..భారత్ మొదటి నుంచి సంయమనం పాటిస్తూ..శాంతికి పీటవేస్తూ వచ్చిందనేది గుర్తులేదా అని మండిపడ్డారు. అంతేగాదు భారత్ చేసింది యుద్ధ చర్య కాదు..కేవలం అది న్యాయం.. అనినొక్కి చెప్పాడు అభయ్ వీడియోలో. పైగా ఆ వీడియోకి ఒక పాకిస్తానీ హిందువుగా నా అభిప్రాయం అనే క్యాప్షన్ కూడా ఇచ్చాడు. దీనిపై నెటిజన్లు సదరు పాక్ వ్యక్తిని ప్రశంసిస్తూ పోస్టులు పెట్టారు.

## పాక్‌కు ఆర్థిక సంకెళ్లు?

ఢిల్లీ: పాకిస్తాన్ బెయిల్ ఔట్ ప్యాకేజీపై అంతర్జాతీయ ద్రవ్య నిధి బోర్డు ఆలోచనలో పడింది.. 1.3 బిలియన్ డాలర్ల అప్పు ఇవ్వాలా ? వద్దా అనే అంశంపై నిర్ణయం తీసుకోనుంది.కాసేపట్లో ఐఎంఎఫ్ సమావేశం కానుంది. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ అప్పు ఇవొద్దని భారత్ కోరుతోంది. పాకిస్థాన్‌కు ఎట్టి పరిస్థితుల్లో బెయిల్ అవుట్ ప్యాకేజ్ నిధులు విడుదల చేయవద్దని భారత డిమాండ్ చేస్తోంది.పాకిస్థాన్‌కు నిధులు విడుదల చేస్తే అవి ఉగ్రవాదులకు చేరుతాయని భారత్ స్పష్టం చేసింది. ఉగ్ర స్థావరాలను ఏర్పాటు చేసి భారత్‌పైకి ఎగదోస్తున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకి చేయడమనే లక్ష్యంగా ఇండియా పావులు కదుపుతోంది. మరో వైపు, పాకిస్థాన్ ఐఎంఎఫ్ నుంచి తీసుకున్న నిధులను దారి మళ్లిస్తున్నట్టు తగిన ఆధారాలను కూడా భారత్ సమర్పించిన సంగతి తెలిసిందే. కాగా, ఆపరేషన్ సిందూర్ దాడిలో హతమైన ఉగ్రవా దులకు పాకిస్థాన్ సైన్యం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించటంపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆపరేషన్ సిందూర్‌పై గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. పాక్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది నాయకత్వంలో ఆ దేశ సైన్యం, పోలీసులు ఉగ్రవాదుల మృతదేహాలకు అధి కారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫొటో లను ప్రదర్శించారు.ఇలాంటి చర్యలతో పాకిస్తాన్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. భారత్ దాడుల్లో సాధారణ పౌరులు మరణిం చారన్న పాకిస్తాన్ ప్రకటనను ఖండించారు. 'దాడుల్లో నిజంగా సామాన్య పౌరులే మరణిస్తే.. మరి ఈ ఫొటోలో ఉన్న దేమిటి? సామాన్యుల మృతదేహాలను శవపేటికల్లో పెట్టి.. వాటిపై పాకిస్తాన్ జాతీయ జెం డాలు కప్పి, అధికారిక లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహిస్తున్నారా?'అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

రిటైర్‌మెంట్ వయసు..

# 60 నుంచి 45 ఏళ్లకు ?



**జనంసాక్షి:**శరవేగంగా మారుతున్న భారత కార్పొరేట్ ప్రపంచంలో 60 ఏళ్ల వరకు హాయిగా పనిచేయాలనే ఆలోచన మెల్లమెల్లగా కనుమరుగవుతోంది. ఈ రోజుల్లో వృత్తి నిపుణులు పని వాతావరణంలో చాలా ఒత్తిడిని అనుభవిస్తున్నారు.దాంతో యువ ఉద్యోగుల్లో 45 ఏళ్లు వచ్చేవరకే రిటైర్ అవ్వాలనే ధోరణి పెరుగుతోంది. అయితే ఇది ఆదోళన కలిగించే అంశమని కొందరు నిపుణులు భావిస్తున్నారు.ఈ సందర్భంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, అడ్వైజర్ సార్థక్ అహూజా మాట్లాడుతూ..'ఉద్యోగుల్లో ఈ మార్పు వాస్తవమే. ఇది ఆందోళన కలిగించే అంశం. రిటైర్మెంట్ వయసు 60 నుంచి 45 ఏళ్లకు మారుతుండడంతో భారతీయ కార్పొరేట్లలో ఆందోళన కలిగించే అంశం. ఇది మంచి పద్ధతి కాదు. లీగల్ లేదా వైద్యం వంటి రంగాల్లో పని చేస్తున్న వృత్తి నిపుణుల వయసు పెరిగే కొద్దీ ఎక్కువ గౌరవం, అధిక వేతనం అందుతాయి. అదే సేల్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, ప్రొడక్ట్, టెక్ వంటి కార్పొరేట్ ఉద్యోగాలు ఇందుకు పూర్తి విరుద్ధం. వయసు పెరిగేకొద్దీ పనితీరు కాస్త తగ్గుతుంది. కొత్త టెక్నాలజీలకు అలవాటుపడే మనస్తత్వం ఉండదు. సేల్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ముఖ్యంగా టెక్నాలజీ వంటి విభాగాల్లో 40 ఏళ్ల పైబడినవారు పనికిరారని చాలా కంపెనీలు భావిస్తున్నాయి' అన్నారు.'40 ఏళ్లు పైబడినవారు నైపుణ్యం లేనివారు కాదు. వారు యువ ప్రతిభావంతుల మాదిరి చురుకుగా ఉండకపోవచ్చు. కానీ వారి అనుభవం కచ్చితంగా ఉపయోగపడుతుంది. అందుకే చాలా కంపెనీలు వీరిని పూర్తిగా తొలగించడం లేదు. అయితే కంపెనీల్లో కొత్త విభాగాలు ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు మాత్రం వీరికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో 40 ఏళ్లు పైబడిన వారికి మెరుగైన నైపుణ్యాలు ఇచ్చేందుకు అప్ స్కిల్ సెంటర్లకు డిమాండ్ పెరుగుతోంది' అని అహూజా వివరించారు.

మహిళా ఆర్మీ అధికారుల


# స్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

మీరు వారి సేవలను వేరే చోట ఉపయోగించుకోవచ్చు. ఇది కోర్టు చుట్టూ తిరగాల్సిన సమయం కాదు. దేశానికి సేవచేయడానికి వారికంటూ మంచి స్థానం ఉంది" అని ధర్మాసనం పేర్కొంది.ఈ విచారణలో భాగంగా కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. వారిని షార్ట్ సర్వీస్ నుంచి విడుదల చేయడానికి సంబంధించి ఎటువంటి స్టే ఇవ్వొద్దని కోర్టును కోరారు. భారత సైన్యానికి యువ అధికారులు అవసరమని, ప్రతి సంవత్సరం 250 మంది సిబ్బందికి మాత్రమే శాశ్వత కమిషన్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వాదిస్తూ.. ఆపరేషన్ సిందూర్ గురించి మీడియాకు వివరించిన ఇద్దరు మహిళా అధికారుల్లో ఒకరైన కర్నల్ సోఫియా ఖురేషీ గురించి ప్రస్తావించారు. ఇదే విషయమై సోఫియా గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఇప్పుడు ఆమె దేశాన్ని గర్వపడేలా చేస్తున్నారని కోర్టుకు వెల్లడించారు. ఇరు పక్షాల వాదనల విన్న కోర్టు.. తదుపరి విచారణ వరకు పిటిషన్లు వేసిన అధికారులను విడుదల చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఆర్మీలో తమకూ శాశ్వత కమిషన్ (పీసీ) అవకాశం కల్పించాలన్న మహిళా సైనికాధికారులు కొన్నేళ్లపాటు న్యాయపోరాటం చేశారు. ఆ సందర్భంగా కర్నల్ సోఫియా విజయపరంపర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఆమె సేవలను సోదాహరణగా చూపుతూ మహిళలూ ఆర్మీలో శాశ్వత కమిషన్‌కు అర్హులేనంటూ 2020 ఫిబ్రవరి 17న వెలువరించిన తీర్పులో విస్పష్టం చేసింది. అప్పటి వరకూ ఆర్మీలో మహిళా అధికారుల సేవలను ఎస్ఎస్‌సీకే పరిమితం చేస్తున్న పరిస్థితి.

# రియల్టీకి డేటా సెంటర్స్ దన్ను

- అదనంగా 50 మిలియన్ చ.అ. అవసరం
- 2030 నాటికి అంచనాలు డెలాయిట్ నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా కృత్రిమ మేథకు డిమాండ్‌తో డేటా సెంటర్లు గణనీయంగా పెరగనున్న నేపథ్యంలో 2030 నాటికి అదనంగా 45-50 మిలియన్ చ.అ. రియల్ ఎస్టేట్ అవసరం ఏర్పడనుంది. అలాగే 40-45 టెరావాట్-అవర్స్ (టీడబ్ల్యూహెచ్) విద్యుత్ కూడా కావాల్సి రానుంది. 'భారత ఏఐ డేటా సెంటర్ మౌలిక సదుపాయాల్లోకి పెట్టుబడుల ఆకర్షణ' పేరిట డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.వ్యయాలపరమైన ప్రయోజనాలు, పునరుత్పాదక విద్యుత్‌పై ప్రధానంగా దృష్టి పెట్టడం, వ్యూహాత్మక స్థానంలో ఉండటం తదితర అంశాలు భారత్‌కి సానుకూలాంశాలని వివరించింది. అయితే, అంతర్జాతీయంగా ఏఐ హబ్‌గా ఎదగాలంటే కీలకమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం, నిపుణుల లభ్యత, విధానాల్లో అంతరాలను తొలగించడం మొదలైనవి ప్రధానంగా ఉంటాయని పేర్కొంది. ప్రపంచ స్థాయి ఏఐ వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే రియల్ ఎస్టేట్,



విద్యుత్, కనెక్టివిటీ, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, నిపుణులు, విధానాలు అనే ఆరు అంశాలు మూల స్తంభాలుగా ఉంటాయని నివేదిక తెలిపింది. నేషనల్ బిల్డింగ్ కోడ్‌లో డేటా సెంటర్ల కోసం ప్రత్యేక కేటగిరీని ఏర్పాటు చేయాలని సూచించింది.

## మరిన్ని ముఖ్యాంశాలు..

డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు అనుమతుల ప్రక్రియను సరళతరం, వేగవంతం చేయాల్సి ఉంటుంది. విధానాలపరంగా మద్దతు కల్పించాలి. డేటా లోకలైజేషన్ నిబంధనలను క్రమబద్ధీకరించాలి. ప్రత్యేక డేటా సెంటర్ జోన్లను ఏర్పాటు చేయాలి. ఇవి భారతదేశ ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు తోడ్పడతాయి.

డేటా సెంటర్ల వేగవంతమైన విస్తరణ వల్ల పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసుకునేందుకు అత్యవసరంగా భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయి.దేశీయంగా నెట్‌వర్క్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌పరంగా పరిమితులు, గట్టిగా ఆధారపడలేని హై-స్పీడ్ ఇంటర్నెట్ మొదలైన వాటి పరిమితుల వల్ల డేటా సెంటర్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉండొచ్చు.

# జర్నలిస్టులు లక్ష్యంగా దాడి దుర్మార్గం

## సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై దాడికి ఖండన

**ఖమ్మం, మే 9 (జనంసాక్షి) :**

జర్నలిస్ట్ లు లక్ష్యంగా దాడిచేయడం దుర్మార్గచర్యని, సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై ఏపీ ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యానికి పాల్పడటాన్ని ఖండిస్తూ జర్నలిస్ట్ సంఘాలు ముక్తకంఠంతో నిరసనను వ్యక్తం చేశాయి. ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో జర్నలిస్ట్‌లను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తోందని విమర్శించారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడిని ఖండిస్తూ శుక్రవారం జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో జెడ్పీకార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు.
సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి విజయవాడలోని ఇంటిపై ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు దాడి చేయడాన్ని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజా మన్ననలు చూరగొనే విధంగా పాలన చేయాలి తప్ప, వ్యతిరేక వార్తలు రాశారని జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసే చర్యలకు




దిగటం అత్యంత హేయనీయమని అన్నారు.
టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన జర్నలిస్ట్ వ్యవస్థపై తెలుగు రాష్ట్రాల్లో దాడి జరుగుతోందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వారికి అనుకూలంగా మాత్రమే వార్తలు రాయాలని పత్రికలు, విలేకరులు,
ఎడిటర్ల పై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంట్లోకి పోలీసులు అక్రమంగా జొరబడటం శోచనీయమన్నారు.
టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మీడియా వర్గాలపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, కూరాకుల గోపి, వేగినాటి మాధవరావు, మధుశ్రీ, మూర్తి, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, బాధ్యులు గుద్దేటి రమేష్, కొరకొప్పుల రాంబాబు, యలమందల జగదీష్,
టీఎస్ చక్రవర్తి, వి. ఈశ్వరీ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నగర అధ్యక్షుడు మైసా పాపారావు, కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, బాధ్యులు మోహిద్దీన్, శివానంద, సాక్షి ఎడిషన్ ఇంచార్జి కేశవ్, బ్రాంచిమేనేజర్ మోహన్‌క్రిష్ణ, సాక్షిటీవీ స్టాఫర్ పి.మహేందర్‌కుమార్, సాక్షి ఏసీఎం శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్‌రెడ్డి, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, వంగూరి వెంకటేష్‌లు ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు.

# కోట్ పల్లి ప్రాజెక్ట్ మరమ్మతులకు 89.30కోట్లు మంజూరు.

## ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.

**తాండూరు మే 9(జనంసాక్షి)**




కోట్ పల్లి ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ. 89.30కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తా మన్నారు. కొన్ని సంవత్సరాల నుండి నీరు వృధా అవ్వడంతో, రైతులు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని స్పీకర్ , సీఎం దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు.వారు స్పందించి వెంటనే రైతుల సమస్యను పరిష్కారానికి చూపిన చొరవ హర్షించదగ్గ విషయమన్నారు.యావత్ తాండూరు రైతాంగం తరుపున సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చిలుక వాగు, గొల్ల చెరువు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు ఉన్నారు.

# రైతులు భూ సమస్యలను రెవిన్యూ సదస్సులో పరిష్కరించుకోవాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

**వరంగల్ ప్రతినిధి, మే 9 (జనం సాక్షి):**

భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని ప్రసంగించారు .భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టు గా వర్ధన్నపేట మండలం ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామంలో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను ,రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్



ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్కను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.అనంతరం చెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుని ఎంపికకు క్షేత్ర స్థాయిలో స్థితిగతులను పరిశీలించి నిబంధనల మేరకు అత్యంత నిరుపేదను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయ్ సాగర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు రేజెర్లలో ఘన స్వాగతం




**ఖమ్మం (జనంసాక్షి) :**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ (బీఆర్ఎస్) ప్రెసిడెంట్ కే.టీ.రామారావుకు ఖమ్మం జిల్లా రేజెర్ల (అంజనాపురం)లో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే, సత్తుపల్లి నియోజకవర్గ ఇంఛార్జి సండ్ర వెంకటవీరయ్య తదితర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. తల్లాడ మండలం కొత్త మిట్టపల్లిలో మాజీ ఎంపీపీ,డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ దివంగత రాయల వెంకట శేషగిరిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను శుక్రవారం ఉదయం కేటీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా రేజెర్లకు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,బానోతు మదన్ లాల్,కందాళ ఉపేందర్ రెడ్డి,మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ నాయక్, నాయకులు ఆర్జేసీ కృష్ణ,దిండిగాల రాజేందర్, మహేష్,ఉప్పల వెంకటరమణ, బమ్మెర రాంమూర్తి,బచ్చు విజయ్ కుమార్,దుగ్గిదేవర వెంకటలాల్ తదితర ప్రముఖులు హెలిప్యాడ్ వద్ద కేటీఆర్ కు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.స్వర్గీయ శేషగిరిరావు విగ్రహావిష్కరణ,ఆ తర్వాత జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు గాను హెలికాప్టర్ లో కేటీఆర్ వెంట బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు విచ్చేశారు.పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ రాక సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ రేజెర్ల నుంచి కొత్త మిట్టపల్లి వరకు గులాబీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు "జై తెలంగాణ జైజై తెలంగాణ","జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్"," వర్థిల్లాల్లి వర్థిల్లాల్లి కేసీఆర్ నాయకత్వం వర్థిల్లాలి","జిందాబాద్ జిందాబాద్ కేటీఆర్ జిందాబాద్"అని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ భారీ ఊరేగింపు జరిపారు.



# ఎన్టిపిసి పవర్ ప్లాంట్‌లో మాక్ డ్రిల్

**విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొంటాం**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ**

**గోదావరిఖని, జనంసాక్షి**

అనుకోని ఘటనలు ఏమైనా జరిగినట్లయితే వాటిని సమర్ధంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అన్ని వేళలా సన్నద్ధంగా ఉందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ ఎన్టిపిసి లోని ఎన్టిపిసి పవర్ ప్లాంట్ లో భద్రత సిబ్బంది తో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అకస్మాత్తుగా ఏదైనా ప్రమాద సంఘటన జరిగితే భద్రత సిబ్బంది ఎలా స్పందించాలో ముందు నుంచే



అప్రమత్తం లో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది అన్నారు. అనుకోని రీతిలో ప్రమాదాలు జరిగిన, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై రక్షణ దళాలు అప్రమత్తం అయి విపత్కర పరిస్థితుల్లో రక్షణ నిమిత్తం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలకు, అక్కడ ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా స్పందించవల్సిన తీరుపై మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అరవింద్ కుమార్ సీనియర్ కమాండెంట్, ఎస్ ఆంజనేయ రాజు డిప్యూటీ కమాండెంట్, ఓవికె శాస్త్రి- డిప్యూటీ కమాండెంట్, జై కన్వర్- అసిస్టెంట్ కమాండెంట్ ఆకేశ్వర్ సింగ్- అసిస్టెంట్ కమాండెంట్ సిఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బందితో, ఎన్టీపీసి హెచ్ ఆర్, భద్రతా విభాగం పాల్గొంటారు.

# కోట్ పల్లి ప్రాజెక్ట్ మరమ్మతులకు 89.30కోట్లు మంజూరు.

## ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.

**తాండూరు మే 9(జనంసాక్షి)**



కోట్ పల్లి ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ. 89.30కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తా మన్నారు. కొన్ని సంవత్సరాల నుండి నీరు వృధా అవ్వడంతో, రైతులు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని స్పీకర్ , సీఎం దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు.వారు స్పందించి వెంటనే రైతుల సమస్యను పరిష్కారానికి చూపిన చొరవ హర్షించదగ్గ విషయమన్నారు.యావత్ తాండూరు రైతాంగం తరుపున సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చిలుక వాగు, గొల్ల చెరువు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పథకాల క్షేత్ర స్థాయి పరిశీలనలో వేగం పెంచండి



**వరంగల్ ఎంజీఎం, మే9(జనంసాక్షి):**

ప్రభుత్వ పథకాల క్షేత్ర స్థాయి పరిశీలనలో వేగం పెంచాలని బల్దియా కమీషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.శుక్రవారం డిప్యూటీ కమిషనర్ లతో రేషన్ కార్డ్ విచారణల ఇందిరమ్మ ఇళ్లు రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించి సమర్థవంతం నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక లో భాగం గా క్షేత్ర స్థాయి లో పరిశీలనలు చేసి ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ల లాగిన్ లోకి పంపించాలని కొత్త గా దరఖాస్తు చేసుకున్న
రేషన్ కార్డు ల సర్వే మొదలు పెట్టాలని రాజీవ్ యువ వికాసం కు వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి. సిబిల్ స్కోర్ కోసం బ్యాంకులకు పంపించాలని కమిష నర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి రవీందర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# మణికొండలో పేదల పట్టా భూములు కబ్జా

## అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్న అక్రమార్కులు

**రాజేంద్రనగర్,మే9 (జనంసాక్షి)**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మణికొండ శివపురికాలనీలో రాజకీయ నాయకులు చేతివాటంతో పేదల భూములు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. పేద ప్రజల కోసం 2006లో సర్వే నెంబర్ 261లో 278 పట్టాలు మంజూరు చేసింది. ఈ భూములపై కన్నేసిన స్థానిక నాయకులు 278 పట్టా భూములతో పాటు మరికొన్ని స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఇలా దాదాపు 300 పట్టా స్థలాలను కబ్జా చేసి అమ్ముకున్నారు. బుల్కాపూర్ కబ్జా చేసి శ్మశానాలను సైతం



ఆక్రమించి అక్కడ ఉన్న ఖాళీ స్థలాలకు దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. దీనికి తోడు అధికారులు రోడ్లు సైతం కూడా వేశారు.ఇప్పటికైనా రెవన్యూ, మున్సిపాలిటీ అధికారులు దొంగ పట్టాలని గుర్తించి రద్దు చేయాలని అలాగేస్మశాన వాటిక కు సంబంధించిన భూములు కాపాడి బుల్కాపూర్ నాలా పై నిర్మించిన కబ్జాలపై చర్యలు తీసుకోవాలనిస్థానిక ప్రజలు కోరుతున్నారు.

**ఆక్రమణలను ఎప్పటికైనా కూల్చివేస్తాం : శ్రీనివాస్ రెడ్డి, గండిపేట మండలం తహసిల్దార్**

మణికొండ పరిధిలో పేదలకు పంచిన భూములు ఆక్రమించుకున్న వారిపై
చర్యలు తీసుకుంటాం. దానికి తోడు బుల్కాపూర్ నాలాను కబ్జా చేసి నిర్మించిన వాటిని త్వరలో హైడ్రాతో కలిసి కూల్చివేస్తాం.

# 14న రామప్పలో పర్యాటకులకు అనుమతి లేదు

**ములుగు ప్రతినిధి, మే 09 (జనంసాక్షి)**

ఈ నెల 14న మిస్ వర్ద్ లో పాల్గొనే పోటీ మహిళలు వెంకటాపూర్ మండలంలోని పాలంపేట లో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి సందర్శించనున్నారని, ఆరోజు రామప్ప సందర్శించడానికి పర్యాటకులకు అనుమతి లేదని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 14 సాయంకాలం నాలుగు గంటల సమయంలో 30 నుండి 35 మంది సుందరీమణులు రామప్ప దేవాలయాని సందర్శించనున్నారని, దాదాపు మూడు గంటల పాటు రామప్పలో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా పర్యాటకులకు ఎలాంటి అనుమతి ఉండదని, పాలంపేట గ్రామం వద్ద గల ఆర్చి లోపలికి



మధ్యాహ్నం 2 తర్వాత ఎవరికి అనుమతి ఉండదని, పర్యాటకులకు నిలిపివేస్తామని వివరించారు. దాదాపు 5 కిలోమీటర్ల వరకు డ్రోన్ కెమెరాలను ఎగుర్వేయడం నిషేధించడం జరిగిందని, రామప్ప దేవాలయం లోపల పాత్రికేయులు ఎలాంటి ఫోటోలు వీడియోలు తీయడానికి అవకాశం లేదని తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ లోనే పాత్రికేయులకు అనుమతి ఉంటుందని, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఏమాత్రం అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రామప్పను సందర్శించనున్న మిస్ వరల్డ్ పోటీ మహిళలకు తెలంగాణ సంస్కృతి
సాంప్రదాయాలు
తెలిపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, సుందరీమణుల పర్యటన దృశ్య అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి యండి రఫిక్, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువ వికాసం పథకంకు సిబిల్ స్కోర్ ఎందుకు?

**హైదరాబాద్ (జనంసాక్షి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఆధారంగానే ఎంపిక చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కె వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ఇబీసీలలో ఉన్న నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు 6000 కోట్ల రూపాయలతో 5లక్షల మందికి రుణాలు ఇవ్వాలని నిర్ణయం చేసి దరఖాస్తులు స్వీకరించింది. ప్రభుత్వ నిర్ణయతో 16 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు స్వీకరణ పూర్తి అయిన తరువాత సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం లబ్ధిదారుల నోట్లో మట్టికొట్టడమే అవుతుంది. ప్రభుత్వ నిబంధన ఎవ్వరి ప్రయోజనలకోసం. ప్రభుత్వం నిర్ణయం వలన వికలాంగులలో ఒక్కరికి కూడా రాజీవ్ యువ వికాసం రుణాలు వచ్చే అవకాశం లేదు.
తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని ఎన్పీఆర్డీ డిమాండ్ చేస్తుంది.

## ఐపీఎల్ నిరవధిక వాయిదా..!

### ఉద్రిక్త పరిస్థితుల్లో బీసీసీఐ కీలక నిర్ణయం



ఐపీఎల్ 18వ సీజన్ నిరవధికంగా వాయిదా వేసినట్లు బీసీసీఐ ప్రకటించింది. భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల్లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతుంది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీపడకూడ్దన్న ఉద్దేశ్యంతోనే వాయిదా వేసినట్లు బీసీసీఐ అధికారులు తెలిపారు. ఓ వైపు దేశం యుద్ధం చేస్తుంటే..ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచులు నిర్వహించడం సరైంది కాదని వెల్లడించింది. ఇప్పటికే పంజాబ్, ఢిల్లీ, మ్యాచ్ భద్రతా కారణాలవల్ల మధ్యలోనే రద్దు చేసిన విషయం తెలిసిందే. నేడు లఖ్ నవ్రూ, ఆర్సీబీ మధ్య లఖ్ నవ్రూలోని ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సింది. టోర్నీని వాయిదా వేసినప్పటికీ ఎప్పుడు తిరిగి ప్రారంభిస్తారనేది మాత్రం బీసీసీఐ ఇంకా వెల్లడించలేదు. కాగా భారత్ పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో అందరూ ఊహించినట్లుగానే ఐపీఎల్ నిరవధికంగా వాయిదా పడింది. ధర్మశాలలో ఉన్న పంజాబ్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లను సిబ్బందిని అక్కడి నుంచి ఢిల్లీకి తరలించేందుకు మొదట ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది బీసీసీఐ. వందేభారత్‌లో తరలించేందుకు రెడీ అయ్యింది. అయితే తాజా కథనాల ప్రకారం..ఆ రైలు వెళ్లేందుకు రైల్వేశాఖ అనుమతి లేకపోవడంతో పఠాన్ కోట్ మీదుగా వెళ్లాల్సిన నేపథ్యంలో రిస్క్ తీసుకోదలుచుకోలేదని రైల్వే వర్గాలు తెలిపాయి. దీంతో మరో విధంగా ఆటగాళ్లను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది బీసీసీఐ. బస్సుల్లోనే ఢిల్లీకి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం.

## రోహిత్ రిటైర్మెంట్ పై మౌనం వీడిన బీసీసీఐ!

టెస్ట్ క్రికెట్ నుండి రోహిత్ శర్మ ఆకస్మిక పదవీ విరమణపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. జూన్ 20న ఇంగ్లాండ్‌లో ప్రారంభమయ్యే ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు రోహిత్ తన రిటైర్మెంట్ ప్రకటించగా, ఇది పూర్తిగా అతని వ్యక్తిగత నిర్ణయమేనని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. బోర్డు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటగాళ్లు తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే స్వేచ్ఛను కలిగి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. రోహిత్ టెస్ట్ కెరీర్‌గురించి మాట్లాడుతూనే శుక్లా, అతని సహకారం అపారమైనదని కొనియాడారు. వన్డేలు ఇంకా కొనసాగించనున్న రోహిత్, భారత క్రికెట్‌కు తన అనుభవాన్ని అందించ గలడని ఆశాభావం వ్యక్తం చేశారు.రోహిత్ శర్మ తన టెస్ట్ కెరీర్‌లో మిశ్రమ ఫలితాలు సాధించాడు. 67 టెస్టుల్లో అతను కొన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడినా, అవి స్థిరంగా కొనసాగలేకపోయాయి. ముంబై దేశీ క్రికెట్‌లో అద్భుత శతకాలు సాధించిన రోహిత్, అంతర్జాతీయంగా 2007లో అరంగేట్రం చేసినా టెస్ట్ కెప్టెన్‌గా 2013లో మాత్రమే అవకాశం లభించింది. ఆ తర్వాత కూడా టెస్ట్ ఫార్మాట్‌లో తన స్థానం నెమ్మదిగా స్థిరపరిచాడు. దేశీయ మైదానాల్లో రోహిత్ అసాధారణ ఆటతీరు కనబర్చినా, విదేశాల్లో అస్థిరత అతని కెరీర్‌ను వెంటాడింది. విశ్వవ్యాప్తంగా ఉన్న అభిమానులను తన అస్థిర ఆటతీరుతో నిరాశపరిచిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. కానీ, అతని సాంకేతిక నైపుణ్యం, శాంతమైన మనస్తత్వం, 'హిట్‌మ్యాన్'గా గెలుచుకున్న గౌరవం అతనిని చరిత్రలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబెడతాయి.రోహిత్ రిటైర్మెంట్ తర్వాత, భారత టెస్ట్ కెప్టెన్సీ బాధ్యత ఎవరు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారింది.

## ఐపీఎల్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీలు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్ రొమారియో షెపర్డ్ చిన్నస్వామి స్టేడియంలో ఇటీవల చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసం సృష్టించాడు. డెత్ ఓవర్లలో బ్యాటింగ్‌కు వచ్చిన షెపర్డ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో చిన్నస్వామి స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. దీంతో ఆర్సీబీ ఆఖరి రెండు ఓవర్లలో ఏకంగా 54 పరుగులు స్కోర్ చేసింది. షెపర్డ్ బ్యాటింగ్ చేసిన 19వ ఓవర్లో 4 సిక్సలు, 2 ఫోర్లతో ఏకంగా 33 పరుగులు రాగా, 20వ ఓవర్లో 21 పరుగులు బాదాడు. ఈ క్రమంలో 14 బంతుల్లోనే షెపర్డ్ అర్ధ శతకం పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ కావడం విశేషం.

# కోహ్లీవైపే మొగ్గు



### టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ!

టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా మళ్లీ విరాట్ కోహ్లీ బాధ్యతలు చేపట్టనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టెస్ట్ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలకడంతో టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్ ఎవరా? అనేది చర్చనీయాంశంగా మారింది. జస్‌ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ పేర్లు వినిపిస్తున్నా.. సెలెక్టర్లు విరాట్ కోహ్లీవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్‌గా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రాకు సారథ్య బాధ్యతలు దక్కాల్సింది. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రోహిత్ శర్మ గైర్హాజరీలో బుమ్రా.. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఈ పర్యటనలో 32 వికెట్లు తీసి కెప్టెన్సీ బాధ్యతలు తన ప్రదర్శనకు అడ్డంకి కాదని నిరూపించుకున్నాడు. సారథిగా ఉంటే మరింత మెరుగ్గా రాణిస్తానని చాటి చెప్పాడు. కానీ బౌలర్‌గా ఎక్స్‌ట్రా ఎఫర్ట్ పెట్టే క్రమంలో వెన్ను గాయానికి గురై జట్టుకు దూరమయ్యాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఆడలేకపోయాడు. ఈ గాయం నేపథ్యంలో బుమ్రాను లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తప్పించేందుకు సిద్ధమయ్యారని వార్తలు వచ్చాయి. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా.. ఇంగ్లండ్ పర్యటనలో 5 టెస్ట్‌లకు ఐదు మ్యాచ్‌లు ఆడలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే అతన్ని లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ పేర్లను కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు.ఐపీఎల్‌లోనూ గుజరాత్ టైటాన్స్‌ను అద్భుతంగా నడిపిస్తున్నాడు. అయితే సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టును నడిపించే అనుభవం అతనికి లేదని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేఎల్ రాహుల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. అది అతని ఆటపై ప్రభావం చూపనుంది. రిషభ్ పంత్ పరిస్థితి కూడా అదే. ఈ క్రమంలోనే అనుభవం కలిగిన విరాట్ కోహ్లీకే మళ్లీ టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలనే యోచనలో సెలెక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది.హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కోహ్లీ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతల చెపట్టేందుకు విరాట్ కోహ్లీ విముఖత చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం ఇంగ్లండ్ పర్యటన వరకైనా కెప్టెన్‌గా వ్యవహరించాలని కోహ్లీని సెలెక్టర్లు ఒప్పిస్తున్నట్లు సమాచారం. టెస్ట్‌ల్లో అత్యంత విజయవంతమైన భారత కెప్టెన్లలో విరాట్ కోహ్లీ టాప్‌లో ఉన్నాడు. అతని సారథ్యంలో భారత్ 68 మ్యాచ్‌లు ఆడి 40 విజయాలు సాధించింది. మరో 11 మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. కెప్టెన్‌గా కోహ్లీ టెస్ట్‌ల్లో 5,864 పరుగులు చేశాడు. ఇందులో 20 సెంచరీలతో పాటు 7 డబుల్ సెంచరీలు నమోదు చేశాడు. కోహ్లీ సారథ్యంలో సొంతగడ్డపై 11 టెస్ట్ సిరీస్‌లు గెలిచింది. విదేశాల్లో అత్యధిక విజయాలు సాధించిన భారత కెప్టెన్‌గానూ విరాట్ కోహ్లీ రికార్డ్ సాధించాడు. కోహ్లీ సారథ్యంలో విదేశాల్లో భారత్.. 15 విజయాలు నమోదు చేసింది. కోహ్లీ సారథ్యంలో భారత టెస్ట్‌ల్లో నెంబర్ వన్ ర్యాంక్‌ను కూడా సొంతం చేసుకుంది. అరంగేట్ర డబ్ల్యూటీసీ 2021 ఫైనల్ కూడా చేరింది.

## దివాళా దిశగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు

### భారత్ దెబ్బకు బిచ్చమెత్తుకుంటోన్న పీసీబీ




భారత్‌తో శత్రుత్వం పెంచుకోవడం ద్వారా పాకిస్తాన్ పెద్ద తప్పు చేసింది. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద సంఘటన తర్వాత, మే 6, 7 తేదీల్లో రాత్రి పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను భారతదేశం ధ్వంసం చేసింది. అప్పటి నుంచి భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఈ ఉద్రిక్తత కారణంగా, మే 8న రావల్పిండిలో జరగాల్సి న పాకిస్తాన్ సూపర్ లీగ్ మ్యాచ్ రద్దు చేశారు. ఇది మాత్రమే కాదు, పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో పాల్గొనే విదేశీ ఆటగాళ్లందరూ కూడా భయాందోళనలో ఉన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే కొంతమంది విదేశీ ఆటగాళ్ళు తమ దేశానికి తిరిగి రావడం గురించి ఫ్రాంచైజీలతో ఇప్పటికే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితిలో, పిఎస్ఎల్ 10వ సీజన్ ఇప్పుడు రద్దు అయ్యే ప్రమాదం ఉంది. ఎందుకంటే పాకిస్తాన్ వైపు నుంచి నిరంతరం డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో, భారతదేశం ప్రతీకారం తీర్చుకుంటే, పిఎస్ఎల్ ఈ సీజన్ పూర్తి చేయడం కష్టం. ఎందుకంటే, పాకిస్తాన్‌లోని కొన్ని ప్రధాన స్టేడియాలు భారత సరిహద్దుకు చాలా దగ్గరగా ఉన్నాయి. ఇది జరిగితే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు దివాళా తీస్తుంది. ఎందుకంటే, ఈ లీగ్ కారణంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నిరంతరం నష్టాలను చవిచూస్తోంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మాత్రమే కాదు, 6 జట్ల యజమానులు కూడా భారీ నష్టాలను చవిచూస్తారు. ఆడిట్ నివేదిక ప్రకారం, గత ఐదు సీజన్లలో పిఎస్ఎల్ నుంచి పీసీబీ భారీ నష్టాలను చవిచూస్తోంది . ఫ్రాంచైజీకి ఎక్కువ వాటా ఇవ్వడం వల్ల ఈ నష్టం సంభవించింది. ఆడిట్ నివేదిక ప్రకారం, పిఎస్ఎల్ ఫ్రాంచైజీలకు అధిక వాటాలు ఇవ్వడం వల్ల పాకిస్తాన్ క్రికెట్ బోర్డు రూ.1,637.977 మిలియన్ల నష్టాన్ని చవిచూసింది. పీసీబీ, ఫ్రాంచైజీ మధ్య 10 సంవత్సరాల ఒప్పందం ఉంది. 2025 లో 10 సంవత్సరాలు పూర్తయిన తర్వాత మాత్రమే ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి అనుమతి ఉంటుంది.

## ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేయకండి..!

### భారత్-పాక్ దాడులపై రోహిత్ శర్మ

భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్ని విషయం తెలిసిందే. ఒక రకంగా రెండు దేశాల మధ్య అనధికారిక యుద్ధం మొదలైందని నిపుణులు అంటున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేపట్టింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ జమ్మూ కశ్మీర్‌తో పాటు పలు ప్రాంతాలపై దాడికి యత్నించింది. కానీ, వాటిని భారత్ తిప్పికొట్టింది. ఆ తర్వాత భారత్ పాక్‌పై దాడి చేసినట్లు ఇప్పటి వరకు సమాచారం అందుతోంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో పలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాటిలో 90 శాతం ఫేక్ వీడియోలు, ఏఐ జనరేటెడ్ వీడియోలు అంటూ కొంతమంది ఫ్యాక్ట్ చేసి నిరూపిస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. ఫేక్ వీడియోలతో పాటు, పాకిస్థాన్ దాడులను తిప్పికొడుతూ, పాక్‌పై దాడి చేస్తున్న సాయుధ దళాల గురించి కూడా రోహిత్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "గడిచే ప్రతి క్షణం, తీసుకునే ప్రతి నిర్ణయంతో నేను మన భారత సైన్యం, భారత వైమానిక దళం, భారత నావికాదళం పట్ల చాలా గర్వంగా ఉన్నాను. మన యోధులు మన దేశ గౌరవానికి అండగా నిలుస్తున్నారు. ప్రతి భారతీయుడు బాధ్యతాయుతంగా ఉండటం, నకిలీ వార్తలను వ్యాప్తి చేయకుండా లేదా నమ్మకుండా ఉండటం ముఖ్యం. అందరూ సురక్షితంగా ఉండండి!" అంటూ ట్వీట్ చేశాడు.

## భారత సైన్యానికి మద్దతుగా కోహ్లీ

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇండియన్ ఆర్మీ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. ప్రస్తుతం భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, దాడి ప్రతిదాడుల మధ్య కోహ్లీ ఈ పోస్ట్ చేయడం ఆసక్తికరంగా మారింది. "ఈ క్లిష్ట సమయాల్లో మన దేశాన్ని తీవ్రంగా రక్షించినందుకు మన సాయుధ దళాలకు మేం సంఘీభావం తెలియజేస్తున్నాం. వారికి నా సెల్యూట్. మన వీరుల అచంచల ధైర్యసాహసాలకు, మన గొప్ప దేశం కోసం వారు, వారి కుటుంబాలు చేసే త్యాగాలకు హృదయపూర్వక కృతజ్ఞతకు మేం ఎప్పటికీ రుణపడి ఉంటాం. జై హింద్" అంటూ కోహ్లీ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టాడు. అంతకంటే ముందు రోహిత్ శర్మ సైతం ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ఇలా భారత క్రికెటర్లు మన దేశ సైనికులకు నైతిక మద్దతు ఇవ్వడం వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంచుతుందని నెటిజన్లు అంటున్నారు.

## కాంగ్రెస్ ఉగ్రవాదులకు వంతపాడుతోంది

- దేశ ప్రజలు లెఫ్ట్ పార్టీలకు మంగళం పాడాయి
- రైట్‌వేలో నడుస్తున్నది ఒక బిజేపి మాత్రమే
- మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావు
- ఖమ్మంలో ఒకదేశం-ఒక ఎన్నికపై అవగాహన సదస్సు




**ఖమ్మం (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగితే దేశ జీడీపీలో 2శాతం మేర ఖర్చు తగ్గుతుందని, తద్వారా దేశ ప్రజల సంక్షేమానికి, ఆకలి తీర్చడానికి అవకాశం దక్కుతుందని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఖమ్మం జిల్లాలోని హెూటల్ కోణార్క్‌లో వన్ నేషన్%-%వన్ ఎలక్షన్ అనే అంశంపై భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఎలక్షన్ మీద ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదమని, ఒకేసారి ఎన్నికలు జరిగే ప్రభుత్వం కూలిపోతే ఎలా అని కొందరు.. గెలిచిన వారు చనిపోతే ఎలా అని మరికొందరు ప్రశ్నిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు తప్ప అందులో వాస్తవం ఎంత అనేది ప్రజలు గుర్తించాలని కోరారు. నియంతృత్వ శైలితో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ అహింసను ప్రేరేపిస్తూ పబ్బం గడుపుతుందని, లెఫ్ట్ పార్టీలకు దేశ ప్రజలు ఇప్పటికే మంగళం పాడారని, తెలంగాణ వ్యాప్తంగా ఒక సీటుకి పరిమితం చేసి కమ్యూనిస్టులను లెఫ్ట్ చేశారని ఎద్దేవా చేశారు. ఇక రైట్‌వేలో ముందుకు పోతున్నది ఒక భారతీయ జనతా పార్టీ మాత్రమేనని, రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా బిజెపి జెండా రెపరెపలాడటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇక మొన్న జరిగిన ఆపరేషన్ సిందూర్‌తో పాటు భారత ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నామని ప్రగల్భాలు పలికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని మదర్సాల్లో తలదాచుకున్న పాక్ మద్దతుదారులను, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుండి అక్రమంగా తెలంగాణలో నివసిస్తున్న వారిని రాష్ట్ర పొలిమేరలు దాటించిన ప్పుడు మాత్రమే దేశానికి మద్దతు ఇచ్చినవారవుతారని పేర్కొన్నారు. దేశంలో ఉగ్రవాదం పెల్లుబుకుతోందని, అహింసో పరమో ధర్మ అనే నినాదాన్ని ఒంటపట్టించుకున్న దేశ ప్రభుత్వం పొరుగు దేశాలు హింసకు ప్రేరేపిస్తే చూస్తూ ఊర్కోబోవని, మొన్న జరిగిన ఆపరేషన్ సిందూర్ అందుకు నిదర్శనమన్నారు. పహల్గాంలో పురుషుల బట్టలు తొలగించి నిర్ధారించుకొని మరీ మారణ హెూమాన్ని సృష్టించిన ఉగ్రవాదులు, మహిళల సిందూరాన్ని తుడిచామని సంతోషించారని, దానికి ప్రతీకారంగా ఇద్దరు మహిళా అధికారుల నేతృత్వంలో ఆపరేషన్ సిందూర్‌ను ద్వారా 9 ఉగ్రవాద స్థావరాలపై తిరుగుబావుట ఎగురవేసి దేశ సత్తా చాటిన ఆర్మీకి అభినంద నలు తెలిపారు. మీడియా సమావేశంలో నాయకులు దేవకి వాసుదేవరావు, సన్నే ఉదయ ప్రతాప్, దొంగల సత్యనారాయణ, పుల్లారావు యాదవ్, తక్కెళ్ళపల్లి నరేందర్ రావు, డాక్టర్ శీలం పాపారావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వరావు, నున్న రవికుమార్, పెరుమాళ్ళపల్లి విజయరాజు, మందా సరస్వతి తదితరులు పాల్గొన్నారు

## ఎండు గంజాయి పట్టివేత

### ముగ్గురు వ్యక్తులు, కారు స్వాధీనం



**భద్రాచలం మే 09 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలో అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి భద్రాద్రి కొత్త గూడెం ఎస్ జానయ్య అద్వర్యంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి కరంచంద్ పర్యవేక్షణలో భద్రాచల%శీ% ఎక్సైజ్ సీఐ ఎస్.కె రహముఐన్నీసా బేగం, ఎస్ ఐ అల్లూరి సీతారామరాజు తమ సిబ్బందితో భద్రాచలం ఆర్టీవో చెక్పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా రావడాన్ని గమనించి దానిని నిలుపుదల చేసి ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 29.500 కేజీల ఎండు గంజియిని, ముగ్గురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 14.5 లక్షలు ఉంటుందని తెలిపారు. కారులో ఉన్న వ్యక్తులను విచారించగా వారు ఒరిస్సాలోని మల్కాన్ గిరి ప్రక్కన ఉన్న వనగడల దగ్గర కొనుగోలు చేసి దానిని హైదరాబాద్ వయా భద్రాచలం మీదుగా తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారు కడప కు చెందిన సాయి కృష్ణ, హైదరాబాద్ కు చెందిన శ్రీహరి, కడపకు చెందిన పవన్ కుమార్ రెడ్డి లుగా గుర్తించారు. వీరు ఈ గంజాయిని హైదరాబాదులో విక్రయిస్తామని తెలిపినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 29.500 కేజీల ఎండు గంజాయి, షిఫ్ట్ డిజైర్ కారు ను, కారు విలువ రూ. 4 లక్షలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం పరుచుకున్నట్లు తెలియజేశారు. ఈ వాహన తనిఖీలలో ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ తోపాటు వారి సిబ్బంది ఎస్టి అలీం, కె బాబు, వి వీరబాబు, లలిత, రాకేష్, కిరణ్ కుమార్, మనోహర్, ఏ నాగేశ్వరరావు, ఎస్.కె జమాల్ షరీఫ్, డ్రైవర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఒకే పర్మిట్ విధానంలో అనుమతులివ్వండి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సెస్ అసోసియేషన్ ప్రతినిధులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిశారు. తమ ఇబ్బందులను మంత్రికి వివరించి పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలను కలిపి ఒకే పర్మిట్ విధానంలో అనుమతులు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. పార్కింగ్ సమస్యను, ట్రాఫిక్ పోలీసుల ఇబ్బందులను తొలగించేలా చూడాలన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆర్టీఏ అధికారులు, మూడు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలతో సమావేశం ఏర్పాటు చేసి.. సమస్యలు పరిష్కరించేలా చూస్తానని పేర్కొన్నారు.

## నగర ప్రజల అవసరాలను తీర్చేందుకు మై జిహెచ్‌ఎంసి యాప్

**హైదరాబాద్ సిటీ, మే 09(జనంసాక్షి):** నగర ప్రజల అవసరాలను తీర్చేందుకు మై జిహెచ్‌ఎంసి యాప్ సమస్యల పరిష్కారం తో పాటు అవసరమైన సేవలు పొందేందుకు మై జిహెచ్‌ఎంసి యాప్ ఉపయోగించుకోవచ్చు. ఈ యాప్ ద్వారా శానిటేషన్, ఇంజనీరింగ్, హెల్త్, స్ట్రీట్ లైట్, రోడ్స్, డ్రైయిన్ క్లీనింగ్, రోడ్ స్వీపింగ్ సమస్యల పై ఫోటో గ్రాగ్రస్ తో పాటుగా జియో లొకేషన్ ద్వారా ఫిర్యాదు చేస్తే డైరెక్ట్ గా పరిష్కారం కోసం సంబంధిత అధికారికి చేరుకుంటుంది. తమ సమస్య పరిష్కారం అయ్యిందో లేదో తెలుసుకోవడానికి చెక్ చేసుకునే వెసులుబాటు తో పాటుగా ఫీడ్ బ్యాక్ సబ్మిట్ చేసుకోవచ్చు. ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ టాక్స్, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపు కోసం వెహికిల్ బుకింగ్ సింగిల్ క్లిక్ ద్వారా చేసుకోవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డు, యుపిఐ ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చు. వీటితో పాటుగా జిహెచ్‌ఎంసి కార్యాలయాల లొకేషన్, వెదర్ అలెర్ట్, ఇంకా చాలా అవసరమైన సేవలు పొందవచ్చు. గ్రేటర్ ప్రజల సౌకర్యం కోసం ఈ యాప్ మరింత ఈజీగా ఉపయోగం చేసుకొనే విధంగా ఉన్నందున ప్రజలు వినియోగించుకొని సేవలతో పాటు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం పొందవచ్చునని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.మై జిహెచ్‌ఎంసి యాప్ ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ ని మీ మొబైల్ లోని ప్లే స్టోర్ ద్వారా డౌన్ లోడ్ చేసుకొని సమస్యలు, సేవలు పొందవచ్చునని కమిషనర్ పేర్కొన్నారు. ఫోటో క్లిక్ ద్వారా మీ సమస్యను పంపంపి, సమస్య పరిష్కారం స్టేటస్ ను ట్రాక్ చేసుకొని స్టేటస్ ను చూసుకోవచ్చు. సమస్య పరిష్కారం అయిన వెంటనే ఫీడ్ బ్యాక్ ఇవ్వవచ్చును. లొకేట్ వార్డు ఆఫీస్ ఆప్షన్ లోకి వెళ్తే జిహెచ్‌ఎంసి ఆఫీస్ లొకేషన్ తెలుసుకోవచ్చు. ట్రేడ్ లైసెన్స్, పెట్ డాగ్ లైసెన్స్ కోసం అప్లై చేసుకునే వెసులుబాటు ఉంటుంది. సిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.




## గుప్పెడు మెతుకుల కోసం పోరాటం

- న్యాయం కోసం మండు ఎండలో తాసిల్దార్ కార్యాలయానికి
- వయోవృద్ధుల చట్టం అమలులో జాప్యం
- తల్లిదండ్రులకు అన్నం పెట్టని వాళ్లకు ఇది ఒక గుణపాఠం



**మర్రిగూడ, మే 9 (జనం సాక్షి) :** నవ మాసాలు కానీ పెంచి అల్లారుముద్దుగా కంటికి రెప్పలాగా కష్టపడి పెంచిన కుమారులను ప్రయోజకులుగా చేసిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో గుప్పెడు మెతుకులు పెట్టడానికి చేతులు రావడం లేదు ఈ సమాజానికి, ఎంతగా దిగజారింది అంటే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారైంది ఈ సమాజం. మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన గాదగోని వెంకటమ్మ భర్త జంగయ్య, వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె, తనకున్న 8 ఎకరాల భూమిని మొత్తం ఇద్దరు కుమారుల పేర్లు మీద ఆస్తి మొత్తం బదిలీ చేయడం జరిగింది, భర్త మరణం తర్వాత గాదగోని వెంకటమ్మ పరిస్థితి చాలా దారుణంగా మారింది, ఇద్దరు కుమారులు తనని పట్టించుకోవడంలేదని కనీసం గుప్పెడు మెతుకులు కూడా పెట్టడం పెట్టకపోవడంతో వయోవృద్ధుల చట్టం అమలు కోసం చండూర్ ఆర్డీవో కు దరఖాస్తు ఇచ్చారు, వెంటనే చండూర్ ఆర్డీవో మర్రిగూడ తాసిల్దార్ ను పూర్తి సమాచారం పై వివరణ కోరగా సమగ్ర దర్యాప్తు జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు, గాధగోని వెంకటమ్మ దరఖాస్తు సరైనదిగా భావించి ఆమె సమ్మతి మేరకు ఇదివరకే గాధగోని వెంకటమ్మ పేరు మీద 15 గుంతల భూమి ఉండగా 5 గుంటలు ఆమెకు ఆమె కూతురికి 20 గుంటలు భూమిని రిజిస్ట్రేషన్ చేయించాలని కుమారులకు ఆర్డిఓ ఆదేశాలు జారీ చేశారు, కానీ కుమారులు దానికి అంగీకరించకపోవడంతో శుక్రవారం మండుటెండలో మర్రిగూడ తాసిల్దార్ కార్యాలయానికి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు, వయోవృద్ధుల చట్టం అంటే "తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్ల నిర్వహణ మరియు సంక్షేమ చట్టం, 2007 వయోవృద్ధులకు రక్షణ, సంక్షేమం, మరియు నిర్వహణను అందించే చట్టం. పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా చూడాలని మండల వాసులు కోరుకుంటున్నారు, తల్లిదండ్రులను పట్టించుకోని కుమారులకు ఇది సరైన గుణపాఠం అని వృద్ధులు చర్చించుకుంటున్నారు,

# రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తవ్వాలి



- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 02న మంజూరు పత్రాలు పంపిణీకి సిద్ధం చేయండి
- రాజీవ్ యువ వికాసం పురోగతిపై సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

హైదరాబాద్, మే 9 (జనంసాక్షి) : ముందుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను ఎంపిక చేసి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 న సాంక్షన్ పత్రాలు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాజీవ్ యువ వికాసం పై సంబంధిత ఉన్నత అధికారులతో సమీక్షించారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం చేసుకున్న దరఖాస్తుల వెరిఫికేషన్ వేగవంతంగా పూర్తి చేసి ఈనెల 15 నుంచి 25 వ తేదీలోగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని సూచించారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీలోగా ఎంపికైన లబ్ధిదారుల సంబంధించిన సాంక్షన్ పత్రాలను సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 02 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు సాంక్షన్ పత్రాలను పంపిణీ చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇందులో ఎలాంటి జాప్యం జరగకుండా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సాంక్షన్ పత్రాలను పంపిణీ చేసిన తర్వాత లబ్ధిదారులకు ట్రైనింగ్ నిర్వహించి పథకాలకు సంబంధించిన గ్రౌండింగ్ చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీధర్, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాపీ బర్త్‌డే టూ యు మారియా





- రేనౌండ్ రైఫిల్ షూటర్ మారియాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొంగులేటి
- సయ్యద్ సాదిక్ అలి అధ్వర్యంలో హైదరాబాదులోని సెక్రటేరియట్లో మంత్రి పొంగులేటి ఆశీర్వాదాలు పొందిన మారియా..

హైదరాబాద్. మే 09 (జనంసాక్షి) : హ్యాపీ బర్త్డే టూ యు మారియా అంటూ ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి కి చెందిన మారియాకు రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మారియా కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ సారథ్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని సచివాలయం లో రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన చాంబర్లో కేక్ కట్ చేయించి బర్త్ డే విషెస్ తెలిపారు. మారియా రైఫిల్ శిక్షణలో భాగంగా అందుకు కావలసిన మౌలిక వసతులు, రైఫిల్ కొనుగోలు ఆర్థిక అంశాలకు చెందిన ఫైలును త్వరిత గతిన వేగవంతం చేసి ఆమె శిక్షణకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటి సయ్యద్ సాదిక్ అలీతో కాసేపు ముచ్చటించారు. ఈ మేరకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ , మారియా తండ్రి ఖదీర్ , ఆర్ పి వి సంస్థ నాయకులు కలిమ్, మారియా సోదరుడు, ప్రముఖ పిస్తోల్ షూటర్ ఎహ్ సాన్, మంత్రి పొంగులేటికు కృతజ్ఞతలు తెలిపారు.

# శంషాబాద్ విమనాశ్రయానికి బెరింపులు



- తనిఖీలు చేసి..భద్రత కట్టుదిట్టం

హైదరాబాద్, మే9 (జనంసాక్షి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు మెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు, భారత్‌- పాక్ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేసారు. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు- డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు- చేసిన సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులు 3 గంటల ముందే విమానాశ్రయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రయాణికులను క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పూర్, చండీగఢ్, రాజ్‌కోట్ వెళ్లే విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు.

# ఏపీ మద్యం కుంభకోసం కేసులో హైదరాబాద్‌లో సిట్ దాడులు

- నిందితుల ఇల్లు సోదా..నోటీసులు



హైదరాబాద్, మే9 (జనంసాక్షి) : ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ దూకుడు పెంచింది. ఒకేసారి హైదరాబాద్‌లో మెరుపు దాడులు చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, మాజీ పీఏ కృష్ణమోహన్ రెడ్డి, ఆయన కుమారుడు రోహిత్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ఇళ్లు, కార్యాలయాలపై సిట్ అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్‌లో ఈ కేసు నిందితులైన కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప నివాసాలు, కార్యాలయాల కు వెళ్లిన సిట్ అధికారులు అక్కడ నోటీసులు జారీ చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణ కోసం విజయవాడలోని సిట్ కార్యాలయానికి రావాలని తెలిపారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ముడుపుల రూపంలో రూ.3,200 కోట్లు- చేతులు మారినట్లు- సిట్ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన కీలక నిందితులు రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డితో పాటు- మరికొందరి స్టేట్‌మెంట్ల ఆధారంగానూ సిట్ సమాచారం సేకరించింది. పాలసీ రూపకల్పన, ఏ స్థాయిలో ఏ అధికారిని నియమించాలనే విషయంలో ధనుంజయరెడ్డి కీలక పాత్ర పోషించారని సిట్ చెబుతోంది. మద్యం పాలసీ రూపకల్పన, సరఫరాదారుల నుంచి ముడుపుల వసూళ్లు, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో వీరి పాత్ర ఉందని భావిస్తోంది. పర్సంటేజ్‌ల గురించి చర్చించేందుకు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి మద్యం కంపెనీ యజమానులతో హైదరాబాద్, తాడేపల్లిలో పలుమార్లు సమావేశం అయ్యారని, వసూలు చేసిన సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని సిట్ దర్యాప్తులో ఆధారాలు సేకరించింది. ఆ సొమ్ము అంతిమంగా ఎవరి ఖాతాకు చేరిందనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది. బాలాజీ గోవిందప్ప అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణికి సిట్ అధికారులు నోటీ-సులు ఇచ్చారు. విచారణకు హాజరు కావాలని నోటీ-సుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. అలాగే కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇంట్లో లేకపోవడంతో ఆయన కుమారుడు రోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసి వారి ఇళ్లల్లో సిట్ ప్రత్యేక అధికారులు దాడులు ప్రారంభించారు. ఒకేసారి హైదరాబాద్‌లో ముగ్గురు కీలక నిందితుల ఇళ్లపై సిట్ అధికారులు దాడులు చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం వెలుగుచూసింది. కూటమి ప్రభుత్వం ఈ స్కాంలో ఉన్న వ్యక్తులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ కేసును సిట్‌కు అప్పగించింది. సిట్ అధికారులు ఈ కేసును ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కసిరెడ్డితో పాటు- మరికొంతమందిని అధికారులు అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సిట్ అధికారులు హైదరాబాద్‌లో సోదాలు జరుపుతున్నారు. మే 11వ తేదీ తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో కృష్ణమోహన్ రెడ్డి కీలకంగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కృష్ణమోహన్ రెడ్డి తప్పించుకు తిరుగుతున్నారని అధికారులు తెలిపారు. ముందస్తు బెయిల్ కోసం కృష్ణమోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా కృష్ణమోహన్ రెడ్డి సుప్రీంకోర్టులో వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయింది.

# యుద్ధం సమస్యకు పరిష్కారం కాదు

- దౌత్యమార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలి
- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్

న్యూఢిల్లీ, మే 9 (జనంసాక్షి) : ఏ సమస్యకు యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఎఐఎంపిఎల్‌బి శుక్రవారం పేర్కొంది. భారత్‌-పాక్ సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతపై బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదం మరియు అమాయక పౌరుల హత్య తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. ఇస్లామిక్ బోధనలలో, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన గ్రంథాలలో, మానవ విలువలలో ఉగ్రవాదానికి స్థానం లేదని పేర్కొంది. ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చలు, ఇతర దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదన్నది కూడా వాస్తవమని పేర్కొంది. దేశం, ప్రజల రక్షణ మరియు వారి రక్షణ కోసం తీసుకునే ప్రతి చర్యకు ఎఐఎంపిఎల్‌బి మద్దతు ఇస్తుందని ప్రకటించింది. క్లిష్టమైన సమయాల్లో ప్రజలు, రాజకీయ పార్టీలు, సాయుధ దళాలు, ప్రభుత్వం కలిసి రావాలని స్పష్టం చేసినట్లు- బోర్డు పేర్కొంది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై ఎఐఎంపిఎల్‌బి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. గురువారం జరిగిన ఆఫీస్ బేరర్ల ప్రత్యేక ఆన్‌లైన్ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపింది. తమ 'సేవ్ వక్ఫ్ క్యాంపెయిన్'ను యథావిధిగా కొనసాగిస్తామని, అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బహిరంగ సమావేశాలు , కార్యక్రమాలను మే 16 వరకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

## శాంతిని కోరుకోవడమంటే
# హానిని అంగీకరించినట్లా?

- పాక్‌తో ఉద్రిక్తతల వేళ నటి రష్మిక పోస్ట్



హైదరాబాద్, మే 9 (జనంసాక్షి) : శాంతిని కోరుకోవడమంటే.. హానిని అంగీకరించడం కాదని రష్మిక అన్నారు. భారత్‌- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన నేపథ్యంలో ఆమె పోస్ట్ వైరల్‌గా మారింది. అన్యాయానికి బదులు తీర్చుకునే దేశాన్ని ప్రశ్నించవద్దంటూ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు. ఉగ్రవాదం నుంచి మనల్ని రక్షించుకునేందుకు చేసే పోరాటం యుద్ధం కాదు. ఈ పోరాటానికి మద్దతిచ్చే వారిని యుద్ధాన్ని కాంక్షించే వారిగా పేర్కొనొద్దు. దేశ భద్రత, న్యాయం కోసం ఆరాటపడే పౌరులు వారు. దూకుడు ధోరణి, అత్యవసర ఆత్మరక్షణకు మధ్య చాలా నైతిక భేదం ఉంటుంది. కుట్రపూరితంగా జరిగిన ఉగ్రవాద చర్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు.. దానికి ప్రతీకారం తీర్చుకోవడం అనేది బాధ్యతే అవుతుంది తప్ప.. అవకాశం కాదు. శాంతిని కోరుకోవడమంటే అర్థం.. జరిగిన హానిని మౌనంగా అంగీకరించడం కాదు. మనకు జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకుంటు-న్న దేశాన్ని ప్రశ్నించొద్దు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారిని ప్రశ్నించండని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రష్మిక.. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగినప్పుడు కూడా స్పందించారు. ఆ వార్త విని తన హృదయం ముక్కలైందని తెలిపారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలన్నారు. ఇక మరోవైపు పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటోంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రస్థావరాలపై విరుచుకుపడింది.

# ఐపిఎల్‌ను నిరవధికంగా వాయిదా వేసిన బిసిసిఐ

న్యూఢిల్లీ, మే9 (జనంసాక్షి) : ఇండియన్ ప్రీమియర్ లీగ్‌-2025 సీజన్‌ను బీసీసీఐ నిరవధికంగా వాయిదా వేసింది. ఇండో-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంది. భారత్‌-పాకిస్థాన్ యుద్ధం అంతకంతకూ ముదురుతుండటంతో ఐపీఎల్‌-2025ను కొనసాగిస్తారా.. లేదా.. అనే అనుమానాలు నెలకొన్నాయి. భద్రతా కారణాల రీత్యా నిన్న ఢిల్లీ క్యాపిటల్స్‌-పంజాబ్ కింగ్స్ మధ్య ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను బీసీసీఐ రద్దు చేసింది. దీంతో పూర్తి సీజన్‌ను నిలిపివేస్తారా అనే అనుమానాలు మొదలయ్యాయి. అందుకు తగ్గట్లే శుక్రవారం మీటింగ్ తర్వాత ఐపీఎల్‌-2025ను నిరవధికంగా వాయిదా వేసింది. మిగతా మ్యాచులు జరుగుతాయా.. లేదా అనేది స్పష్టత ఇవ్వలేదు. నిరవధికంగా వాయిదా వేస్తున్నామని చెప్పడంతో ఇక ఈ సీజన్ క్లోజ్ అయినట్లేనని విశ్లేషకులు అంటున్నారు. ఈ విషయంలో బీసీసీఐ మరింత స్పష్టత ఇస్తుందేమో చూడాలి. యుద్ధ పరిస్థితులు చల్లబడ్డాక టోర్నీ నిర్వహణ విషయంలో తమ నిర్ణయాన్ని బోర్డు పెద్దలు మార్చుకుంటారా అనేది చెప్పలేం.

# అల్లు అరవింద్ ఉదారత

- రక్షణ దళాలకు విరాళం ఇస్తామని వెల్లడి



హైదరాబాద్, మే9 (జనంసాక్షి) : భారత్‌- పాక్ మధ్య చోటు-చేసుకున్న తాజా పరిణామాలపై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. భారత సైన్యానికి తమ మద్దతు ఉంటుందన్న ఆయన.. విరాళం కూడా ప్రకటించారు. తమ బ్యానర్‌లో తెరకెక్కి, శుక్రవారం విడుదలైన 'సింగిల్'సక్సెస్ మీట్‌లో మాట్లాడారు. ఆ సినిమా కలెక్షన్స్‌లో కొంత భాగాన్ని సైనికులకు అందజేస్తామన్నారు. మన సైనికులు దేశం కోసం పోరాడుతుంటే.. సినిమా విషయంలో మేం సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదు అనిపించింది. సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం. ఈ ఉద్రిక్త పరిస్థితులకు ముందు మేం ఈ మూవీ రిలీజ్ డేట్ ప్రకటించాం. వాయిదా వేయడం మంచిదా, కాదా? అన్న దానిపై చర్చించాం. సినిమా కోసం వందల మంది పనిచేయడమే కాదు థియేటర్లపై వందల కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. అందుకే ఎవరూ తప్పుగా అర్థంచేసుకోరనే ధైర్యంతో సినిమాని విడుదల చేశాం' అని అరవింద్ వివరణ ఇచ్చారు. శ్రీవిష్ణు హీరోగా తెరకెక్కిన రొమాంటిక్ కామెడీ చిత్రమిది.

# తుర్కియే, జర్ బైజాన్‌లకు టూర్లు రద్దు

- ట్రావెల్ ఏజెంట్స్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మే9 (జనంసాక్షి) : భారత్‌- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాయాది దేశం దుందుడుకు చర్యలను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది. ఈ పరిణామాల నడుమ అంతర్జాతీయ ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. పాక్‌కు మద్దతుగా నిలుస్తున్న తుర్కియే, అజర్‌బైజాన్ వంటి దేశాలకు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ దేశాలకు అనవసర ప్రయాణాలు మానుకోవాలని, అక్కడి సున్నితమైన ప్రాంతాల పర్యటన ప్రణాళికల విషయంలో అప్రమత్తతంగా వ్యవహరించాలని తెలిపాయి. తుర్కియే, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్‌లకు నూతన బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపేయాలని నిర్ణయించినట్లు పర్యాటక సేవల బ్రాండ్ 'కాక్స్ అండ్ కింగ్స్' వెల్లడించింది. ఈ దేశాలకు అనవసరమైన ప్రయాణాలు మానుకోవాలని భారత ప్రయాణికులకు కాక్స్ అండ్ కింగ్స్ డైరెక్టర్ కరణ్ అగర్వాల్ సూచన చేశారు. పహల్గాం దాడి, తదనంతరం పరిణామాల నేపథ్యంలో ప్రయాణికులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఈజ్‌మైట్రిప్ తెలిపింది. అత్యవసరమైతేనే తుర్కియే, అజర్‌బైజాన్‌లను సందర్శించాలని సూచించింది. ట్రిప్ ప్లానింగ్‌కు ముందు ట్రావెల్ అడ్వైజరీలను పరిగణనలోకి తీసుకోవాలని ఈజ్‌మైట్రిప్ వ్యవస్థాపకుడు నిశాంత్ ట్వీట్ చేశారు. తుర్కియే, అజర్‌బైజాన్‌లకు అన్ని ప్రయాణ ప్యాకేజీలను నిలిపివేసినట్లు ట్రావోమింట్ తెలిపింది. ఈ దేశాలకు ఇప్పటికే చేసుకున్న బుకింగ్‌లపై క్యాన్సలేషన్ ఫీజు వసూలు చేయబోమని వెల్లడించింది. అయితే.. అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ ఫ్లైట్ బుకింగ్‌లు అందుబాటు-లో ఉంటాయని చెప్పింది. మరోవైపు.. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో హోటల్ బుకింగ్‌లు రద్దవుతున్నట్లు సంబంధిత ప్రతినిధులు తెలిపారు.

## యుద్ధం వేళ..పాక్ అసత్యప్రచారాలు

- ఫ్యాక్ట్ చెక్‌తో తిప్పికొడుతున్న భారత్

న్యూఢిల్లీ, మే 9 (జనంసాక్షి) : భారత్, పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్ మీడియా, సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలకు తెరలేపాయి. పెద్ద ఎత్తున అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయి. సోషల్ మీడియాలో పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖులు సైతం తప్పుడు వీడియోలను, ఫొటోలను పోస్టు చేస్తున్నారు. భారత ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు ప్రచారాలపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఉక్కుపాదం మోపుతోంది. నిజా నిజాలను బయటపెడుతోంది. మహ్మద్ అలీ రెజా రజు అనే వ్యక్తి తన ట్విటర్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశాడు. ' బ్రేకింగ్ .. ఇండియాలోని జమ్మూ ఎయిర్ బేస్‌లో చాలా చోట్ల ప్రభావం పడ్డట్టు- తేలింది' అని రాసుకొచ్చాడు. దానిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చేసింది. ఆ వీడియో 2021, కాబూల్ ఎయిర్‌పోర్టుకు సంబంధించినదని తెలిపింది.

# మాక్ డ్రిల్, సైరన్ల నిర్వహణకు ఏర్పాట్లు



న్యూఢిల్లీ, మే9 (జనంసాక్షి) : భారత్‌-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఏదైనా అత్యవసర పరిస్థితులను తలెత్తితే వాటిని ఎదుర్కొనేందుకు ఆయా రాష్ట్రాలు అప్రమత్తమవుతున్నాయి. సరిహద్దు రాష్ట్రాల్లో రాత్రి కరెంటు కట్, స్కూళ్ల మూత, ఉద్యోగులకు సెలవులు రద్దు వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో భారీ సంఖ్యలో బలగాలను మోహరించడం, కంట్రోల్ రూమ్‌లు, అనేక ప్రాంతాల్లో ఎయిర్ సైరన్ల ఏర్పాటు-, మాక్ డ్రిల్స్ నిర్వహించడంలో దేశ రాజధాని నిమగ్నమైంది. రాజధానిలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు- కీలక స్థావరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే మార్కెట్లు-, రైల్వే స్టేషన్లు, మాల్స్, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘాను పెంచారు. ఎటు-వంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా 11 జిల్లాలను సంసిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు- నగర వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా సైరన్లను ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. సైరన్లను అమర్చుతున్నాం. ఎత్తైన భవనాలపై ఏర్పాటు- చేసి, వీటి పనితీరును పరిశీలిస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని ప్రదేశాల్లో ఏర్పాటు- చేయనున్నాం. 11 జిల్లాల పరిధిలో ఇప్పటివరకు 10 సైరన్లు ఏర్పాటు- చేశాం. కొన్ని సైరన్ శబ్దాలు రెండు కి.మీలు, కొన్ని నాలుగు, మరికొన్ని 16 కి.మీ పరిధి వరకు వినిపిస్తాయని దిల్లీ రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వీటికి సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేశామని, ఇవి శబ్దం చేసినప్పుడు ఎలా స్పందించాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370